Om



శ్రీ విష్ణుభొట్ల సూర్యనారాయణ, సుందరలక్ష్మి

నరసారావుపేట

తాలూకా గ్రామ చరిత్ర

రచయిత:


విష్ణుభొట్ల సూర్యనారాయణ

ప్లీడరు, గుంటూరు

సంపాదకులు, ప్రచురణకర్త:

(కండ్లగుంట) వేదాంతం రంగాచార్యులు

నరసారావుపేట



నరసారావుపేట
తాలూకా గ్రామ చరిత్ర

రచయిత:

విష్ణుభొట్ల సూర్యనారాయణ

ప్లీడరు, గుంటూరు

సంపాదకులు, ప్రచురణకర్త:

(కండ్లగుంట) వేదాంతం రంగాచార్యులు

నరసారావుపేట

నరసారావుపేట తాలూకా గ్రామచరిత్ర

Sri Pratapa Sita Rama Anjaneyulu
by
The Author
25.5.65

రచయిత:
విష్ణుభొట్ల సూర్యనారాయణ
ప్లీడరు, గుంటూరు

సంపాదకులు, ప్రచురణకర్త:
(కండ్లగుంట) వేదాంతం రంగాచార్యులు
నరసారావుపేట

ప్రథమ ముద్రణము 1964
ప్రతులు : ౧౦౦౦

మూల్యము : రెండు రూపాయలు

ముద్రణము :
జూపిటర్ ప్రింటింగ్ ప్రెస్,
బ్రాడీపేట, గుంటూరు-2

మనవి

ఇప్పటికి దాదాపు యేబది సంవత్సరముల క్రింద నా చిన్నతనమున మల్లాది సోమయాజులుగారు వ్రాసిన "గుంటూరు చరిత్ర" యను గ్రంథమును చదివియుంటిని. అప్పటినుండియు గుంటూరు జిల్లాను గురించిన సమగ్రచరిత్రను తెలిసికొనవలయు ననెడియూహ నాకుకల్గెను. కొంతకాలమునకు నాకప్రయత్నముగ మెక్లీనను వారు వ్రాసిన "కష్ణాజిల్లా మాన్యూల"ను గ్రంథమును సంపాదించ గల్గితిని. ఆ గ్రంథము నిప్పటికి పాతిక సంవత్సరముల క్రింద చదివియుంటిని. అప్పటినుండియు సమగ్రమైన జిల్లా చరిత్రయు జిల్లా యందలి గ్రామచరిత్రయు వ్రాయవలెననెడి యూహకలిగెను. అప్పటినుండియు విషయసేకరణకు ప్రయత్నింప ప్రారంభించిని. కొంతకాలమునకు జిల్లాకలెక్టరు చేసిన రాబర్టు సూయెలను వారు వ్రాసిన గ్రామముల చరిత్రను సంపాదించి అందలి విషయములను కొన్నిటిని సంగ్రహించితిని. అంతటితో సంతుష్టి చెందక యింకను ప్రయత్నింపగా సర్వేయరు జనరలుగా వ్యవహరించిన కల్నలు మెకెంజిగారును వారి యనుచరులు భాషా పండితులునైన యేలూరు కాపరస్తులు కావలి బొఱ్ఱయ్య, లక్ష్మయ్య సోదరుల సహాయసంపత్తులవలన తయారు కావింపబడి "లోకల్ రికార్డ్సు"అను పేర కొంతకాలము చెన్నపట్టణమునందలి కానిమెరా పుస్తక భాండాగారమునందును ప్రస్తుతము విశ్వవిద్యాలయ ప్రాచీన ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారమునందు నుంచబడిన వ్రాత పుస్తకములయందలి గుంటూరుజిల్లాలోని గ్రామములను గూర్చి

విషయములను అచటి అధికారుల యనుమతిన 1959 వ సంవత్సరమున రెండుమాసములున్ను 1961 వ సంవత్సరమున రెండు మాసములున్ను అచటనే వుండి అపుడు సంపాదించిన సమాచారమునున్ను యీ గ్రామ చరిత్రలయందు చేర్చితిని.

ఇట్లు శ్రమపడి తయారుచేయబడిన చరిత్ర నేమిచేయవలెనో తోచక బాధపడుచున్న సమయమున యీ గ్రంథ సంపాదకులైన శ్రీమాన్ వేదాంతం రంగాచార్యులుగారు నరసారావుపెట తాలూకా లోని కొన్ని గ్రామములను గురించిన చరిత్ర తనవద్ద గలదని దానిని నా వద్దనున్న చరిత్రను కలిపి తాను ప్రచురించెదనని చెప్పినందున నరసారావుపేట తాలూకాలోని 97 గ్రామముల చరిత్రను వారి కిచ్చియుంటిని. ఈ పుస్తకము వారి యభిమానముయొక్క ఫలితమేయైయున్నది. పైన వ్రాసిన వారికందరకు నేను కృతజ్ఞుడను. నేను శ్రమపడి వ్రాసిన హంశములను శ్రీమాన్ వేదాంతం రంగాచార్యులవారియొక్క శ్రద్ధవలన అచ్చునందు చూడగల్గుట నాకు ఆనందమును గలుగజేయుచున్నది.

ఇట్లు
విష్ణుభొట్ల సూర్యనారాయణ
రచయిత

సంపాదకుని విజ్ఞాపన

నేను నరసారావుపేటచరిత్ర ప్రచురణమైనప్పటినుండి యీ తాలూకాచరిత్ర ప్రచురించిన బాగుండునని తోచి ప్రయత్నించుచుండ ఒకరోజున శ్రీ విష్ణుభొట్ల సూర్యనారాయణ ప్లీడరుగారి పరిచయముగలిగి వారు వ్రాసిన చరిత్రనుచూచి ఆ భాగమును అచ్చువేయించుటకు కోరగా వారు అంగీకరించి ఆ గ్రంథము నా కొసంగిరి. అందుల కెంతయు వారికి నేను కృతజ్ఞుడను. ఈ గ్రంథముద్రణకు అడిగినదే తడవుగా ద్రవ్య సహాయముచేసిన ద్రవ్యదాతలకున్నూ, దగ్గరయుండి గ్రంథ పరిశీలనచేసి గ్రంథముద్రణ పూర్తిచేయించిన శ్రీమాన్ వి. వి. నరసింహాచార్యులుగారికిని కృతజ్ఞుడను.

శ్రీ సూర్యనారాయణగారి ప్రతి, నేను సంపాదించిన భాగములు కలిపి చేర్చి యీ గ్రంథరూపమున ప్రచురించ గలిగినందులకు సంతోషించుచున్నాను.

ఇట్లు,
సంపాదకుడు.

ఈ గ్రంథ ముద్రణమునకు సహాయముచేసిన ద్రవ్యదాతలు, నరసారావుపేట

కీర్తిశేషులగు నాగసరపు సుబ్బారాయశ్రేష్ఠిగారి
ధర్మపత్ని వెంకట సుబ్బమ్మగారు

శ్రీ మండవ ఆదినారాయణ రామశ్రేష్ఠిగారు
,, అర్వపల్లి నరశింహ్మంశ్రేష్ఠిగారు
,, బత్తుల వెంకట పేరయ్యశ్రేష్ఠిగారు
,, కొవ్వూరావూరి బాలకోటయ్యశ్రేష్ఠిగారు
,, తాళ్లూరి నాగేశ్వరావుశ్రేష్ఠిగారు
,, మిరియాల సుబ్బారావుశ్రేష్ఠిగారు
,, మద్ది గోపాలంశ్రేష్ఠిగారు
,, శిగినం శెట్టి మూలస్వాములుశ్రేష్ఠిగారు
,, జొన్నలగడ్డ పున్నయ్యశ్రేష్ఠిగారు
,, దేసు రామసుబ్బారావుశ్రేష్ఠిగారు
,, తాటికొండ రామపోలి శెట్టిశ్రేష్ఠిగారు
,, దోరడ్ల రామయ్యశ్రేష్ఠిగారు

చిలకలూరిపేట

కీ॥ శే॥ వడ్లమన్నాటి శ్రీనివాసరావు పంతులుగారు

శ్రీ రాచమల్లు కన్నయ్యశ్రేష్ఠిగారు
,, పొట్టి సుబ్బారావుశ్రేష్ఠిగారు
,, పొట్టి రామయ్యశ్రేష్ఠిగారు




వేదాంతం రంగాచార్యులు
నరసారావుపేట


—సంపాదకుడు.



శ్రీ విఖనసాచార్యులవారు. నరసారావుపేట



శ్రీ భీమేశ్వరస్వామి - నరసారావుపేట



అట్లూరి ఆంజనేయస్వామి - నరసారావుపేట

నరసారావుపేట తాలూకా గ్రామచరిత్ర

అట్లూరు

ఇది నరసారావుపేటకు పురాతన గ్రామము. కనుకనే యీ తాలూకాచరిత్ర అట్లూరు గ్రామముతో ప్రారంభింపబడినది. ఈ అట్లూరు పూర్వము మొఖాసా గ్రామముగ నుండెడిది. ఈ గ్రామమిప్పుడు నరసారావుపేటలో పశ్చిమ భాగమున పాతయూరను పేరుతో వ్యవహరింపబడుచున్నది. ఈగ్రామ మొఖాసాదార్లు కటికినేని నారన్న, వెంకన్నగార్లు. వీరు వెలమవారు.

ఈగ్రామములో అతి పురాతనమైన భీమేశ్వర, వేణుగోపాల, ఆంజనేయస్వామివార్ల ఆలయములుండెడివి. కొంత కాలమునకు భీమేశ్వర, వేణుగోపాలస్వామివార్ల ఆలయములు శిథిలములై పోవుట తటస్థించెను. తర్వాత నొకప్పుడు ఆగ్రామ మొఖాసాదార్ల ఆవులదొడ్డిలో భీమేశ్వరస్వామి లింగము దొరకగా సంగయ్య అను లింగబలిజ భీమేశ్వరస్వామి ఆలయమును మరమ్మతుచేయించి అందాలింగమును ప్రతిష్ఠ చేయించినట్లు చెప్పుదురు. ఈ ఆలయములో శాసనములు మూడు కనుపించుచున్నవి. ఒకటి క్రీ॥ శ॥ 1159 లోను, రెండవది క్రీ॥శ॥ 1244 లోను, మూడవది క్రీ॥ శ॥ 1262 లో వ్రాయబడినవి.

దీనినిబట్టి 1159 కి పూర్వమే ఈ గ్రామమున్నట్లును, అందు భీమేశ్వరస్వామి మొదలైన దేవుళ్ల ఆలయములు కట్టబడియున్నట్లును తెలియుచున్నది. కనుక యీ అట్లూరు చాల పురాతనమైన దనుటలో యెట్టి సందేహమును లేదు.

ఈగ్రామము వెలమ మొఖాసాదార్ల క్రిందనున్న కాలములో శ్రీ రాజా మల్రాజు వెంకట గుండారాయణింగారు క్రీ॥ శ॥ 1783–1818 వఱకు పాలితులుగా నుండిరి. వారు పరిపాలించు సమయములో నారన్నయను మొఖాసాదారుడు ఒక స్వామివారి ప్రతిష్ఠాదులకును, అర్చకత్వమునకును పాంచరాత్రుల నేర్పఱుప ప్రయత్నించుచుండగా శ్రీ గుండారాయణింగారు తెలిసికొని పూర్వమునుండి యుండియున్న వైఖానసులనే యేర్పఱచవలసినదిగా నొక ఉత్తరము వ్రాసియిచ్చిరి. దాని ప్రకారమే నారన్నగారు జరిపియుండెను.

ఇక ప్రాచీనకాలమునుండి యున్న ఆలయములలో శ్రీ వీరాంజనేయస్వామివారి ఆలయమొకటి. ఇది మాత్రము శిథిలము కాక అట్లేనిలచియున్నది. ఇపుడు ఆంజనేయస్వామి దేవాలయపరిపాలన పబ్బతి వెంకటేశ్వర్లుగారు చేయుచున్నారు.

ఈ ఆలయనిర్మాణాదిక మెప్పుడు జరిగినదో సరియైన కాలము చెప్పుట కవకాశములేదు. ఈ దేవునకు స్వల్ప భూవసతి కలదు, ఈ భూమిని పూర్వపు జమీందా

ర్లెవరో యిచ్చియుండవచ్చును. ఈ దేవుని పూజాదికమును గుఱించి, మేళ్ళచెరువు వారికిని, కళ్లగుంట రంగాచార్యులు గారికిని హైకోర్టువఱకు వ్యవహారము జరిగియుండెను. ఆంజనేయ స్వామివారి అర్చకులు వైఖానసులు వేదాంతం రంగాచార్యులు, చినరంగాచార్యులు, పెద్దింటి శీతారామమ్మ గార్లు.

భీమేశ్వరాలయము మిక్కిలి శిథిలావస్థలో నుండగా కోటమరాజు వెంకటాచలం పంతులుగారు మరమ్మతులు చేయించి. కల్యాణ మంటపాదులను కట్టించియుండిరి. ప్రస్తుత కాలమున ఈ ఆలయ పరిపాలనమును మద్ది వీరరాఘవయ్య గారు నిర్వహించుచున్నారు. ఇటీవల జాగర్లమూడి వేంకటేశ్వర్లుగారు అద్దాలమహలు కట్టించిరి. మఱికొందఱు భక్తులు గాలిగోపురమును, రథమును, రథశాలను కట్టించియున్నారు. ఈ స్వామివారి అర్చకులు ఆదిశైవులు కొండకావూరు వెంకట్రాముడుగారు.

2. నరసారావుపేట

ఇది తాలూకా ముఖ్యకేంద్రము. గుంటూరునకు పడమటి దిక్కున 28 మైళ్ళదూరమున ఈ పట్టణమున్నది. పూర్వమీ ప్రాంతమును బరిపాలించుచున్న శ్రీ రాజామల్రాజు వెంకట గుండారాయణింగారు క్రీ. శ. 1797 పింగళనామ సంవత్సర శ్రావణ శుద్ధ ౫ శుక్రవారమునాడు పేటకును, కోటకును


శంఖుస్థాపన చేయించి రమణంశ్రీగారగు నరసారాయనింగారి పేర విశాలములగు వీధులతో పేటను నిర్మించి, పేటకు మధ్య భాగమున బొడ్డురాయి స్థాపించి, దానికడ నొక మందిరమును కట్టించియుండిరి. దీనిని 1919 అక్టోబరు 27వ తేదీన దొరతనము వారు పడగొట్టించి వీధినివిశాలముగ నుండునట్లు చేసిరని పెద్దలు చెప్పెదరు.

ఈ పేట నిర్మాణ మారంభించిన కొలది దినములకు కెలగ ఉప్పరి కులస్థుడు పరమయ్య అను నాతడు యోగిగా నుండి యీ గ్రామమున కీశాన్యదిక్కున పెద్ద కత్తువ చెరువును త్రవ్వించెను. పిమ్మట శ్రీ వేణుగోపాలస్వామివారి ఆలయమును, శ్రీ రామలింగస్వామివారి ఆలయమును కట్టించి స్వామివార్లను ప్రతిష్ఠింపజేసెను. అటుపిమ్మట శా.శ. ౧౭౩౮ పరీధావి సంవత్సరమున కొప్పరాపువారి వెంకటప్పయ్య, బాల ప్రసాదం, బాలకోటయ్యగార్లు ఈ రెండు దేవాలయములకు ఆలయ గోపురాదికముల నిర్మాణముచేసి జీర్ణోద్ధారణ చేసి యుండిరి. అటుపిమ్మట శా. శ. ౧౭౮౦ కాళయుక్తి సంవత్సరమున శ్రీ సత్యనారాయణ స్వామివారి ఆలయమును కట్టించి స్వామివారిని ప్రతిష్ఠింప జేసిరి. శ్రీ సత్యనారాయణస్వామి వారికి వైఖానసులు కండ్లగుంట వేదాంతం రంగాచార్యులు మున్నగు వారు అర్చనాది కైంకర్యములను జరుపుచున్నారు.


రామలింగేశ్వరస్వామివారి నిత్యకైంకర్యాదులు జరుగుటకు పూర్వపు జమీందారులు భూవసతి కల్పించియుండిరి. ఈ



శ్రీ వేణుగోపాలస్వామి వారు
నరసారావుపేట



శ్రీ సత్యనారాయణస్వామి వారు
నరసారావుపేట



శ్రీ భావనారాయణస్వామివార్లు
నర్సారావుపేట

స్వామివారికి ఆదిశైవులగు కొండ కాపూరి లింగయ్య వగైరాలు పూజాదికములు జరుపుచున్నారు.

నరసారావుపేటలో దక్షిణభాగమున శ్రీ భావనారాయణ స్వామివారి ఆలయము కలదు. ఈ ఆలయము నరసారావుపేట కట్టకముందే ఈ స్వామివారి ప్రతిష్ఠ జరిగినట్లు 1784 వ సంవత్సరమున శ్రీ రాజా మల్రాజు వేంకట గుండారాయణింగారు కళ్ల గుంట రంగాచార్యులుగారికి వ్రాయించియిచ్చిన సనదును బట్టి కన్పడుచున్నది. పిమ్మట ఈ ఆలయము శిథిలముకాగా శా.శ. ౧౮౩౯ పింగళ సం. జ్యేష్ఠమాసమున శిగినంశెట్టి మామయ్య. అరవపల్లి నరసమ్మగార్లు పునర్నిర్మాణము చేయించి యుండిరి. ఇప్పుడు తాళ్లూరి నాగేశ్వరరావుశ్రేష్ఠి గారు ముఖమండపమును, శిగినంశెట్టి మూలస్వాములుశ్రేష్ఠి అండ్ కంపెనీవారు కీ॥ శే॥ గుంటూరు సుబ్బారావు శ్రేష్ఠిగారి ధర్మపత్ని పేరమ్మగార్లు కళ్యాణమంటపమును, శిగినంశెట్టి మూలస్వాములుశ్రేష్ఠి అండ్ కంపెనీవారు, దేసు రామసుబ్బారావుశ్రేష్ఠి, జొన్నలగడ్డ పున్నయ్యశ్రేష్ఠిగార్లు పెద్దహాలున్నూ యింకా అనేకభక్తులు అనేకకట్టడములును వృద్ధిచేయుచున్నారు. పట్టాభిరామస్వామివారి అర్చకులే యీ స్వామి వారికిని అర్చకులు.


ఈ గ్రామమునకు మధ్యభాగమున షుమారు 125 సంవత్సరములకు పూర్వము సేట్ శివలాల్ గారి కుమారుడు శివభక్షుగారు విఘ్నేశ్వరాలయము కట్టించి అందు విఘ్ననాథుని

ప్రతిష్ఠించినట్లు చెప్పుదురు. కాని అది యేకారణమువల్లనో శిథిలమైపోగా ఇటీవల వైశ్యసంఘమువారు తిరిగి గుడికట్టించి యందు వినాయకుని ప్రతిష్ఠించియున్నారు. ఆ స్వామికి కావూరి లింగయ్య వగైరాలు పూజాదికములు జరుపుచున్నారు.

ఈ పట్టణములోనే పూర్వము తహశీల్‌దారుగా నున్న వంగనామముల లక్ష్మీనారాయణప్ప పంతులుగారు రాజాగారి కోటకు దక్షిణభాగమున నొక ఆలయమును కట్టించి స్వప్నమున దర్శనమొసంగి చెప్పిన జాడననుసరించి సత్తెనపల్లి తాలూకా కోఘ్యూరి గ్రామమున భూస్థాపితమైయున్న పట్టాభి రామస్వామివారి విగ్రహమును దెచ్చి శా. శ. ౧౭౮౦ ప్రభవ నామ సంవత్సరమునకు సరియగు 1862 ఫిబ్రవరి 4వ తేదీన శ్రీ వైఖానసామగరీత్యా ప్రతిష్ఠించి 1868 స్వామివారికి రథమును, వాహనాదులను చేయించి నొసంగి భూములను సంపాదించి 1872 ఫిబ్రవరి 22వ తేదీన అర్చకులకు దానపత్రం వ్రాయించి యిచ్చియుండిరి. పిమ్మట 1886 ఏప్రియల్ 13వ తేదీన శ్రీ రాజా మల్రాజు వెంకట నరసింహారావు బహదూర్ జమీందారు వారికి సర్వాధికారము లొసంగుచు వుయలు నామా వ్రాసియిచ్చి పరమపదించిరి. పిమ్మట మండవ వెంకట రెడ్డిగారు పొన్నవాహనమును, వాహనశాలను తయారు చేయించిరి. తరువాత కరులవాయి మల్లయ్యగారు వాహన శాల, పాకశాల మున్నగు కట్టడములను నిర్మించిరి. తాడేపల్లి



శ్రీ పట్టాభిరామస్వామివార్లు
నర్సారావుపేట



శ్రీ పట్టాభిరామస్వామివార్ల ఆలయజీర్ణోద్ధార ధర్మకర్తలు
శ్రీ నాగసరపు సుబ్బరాయశ్రేష్ఠి దంపతులు (శ్రీవారు-అర్చకులు)

వెంకటనారాయణ వగైరా భక్తులు 30 మణుగుల పెద్దగంటను సమర్పించియున్నారు.

తరువాత కొంతకాలమునకు నాగసరపు పున్నయ్యగారి కుమారుడు సుబ్బరాయ శ్రేష్ఠిగారు ప్రమోదూత సం॥ శ్రావణ బ ౧౩ లు సకుటుంబముగ వేదాంతం రంగాచార్యులు గారిని వెంటబెట్టుకొని కాశీకి వెళ్ళి గంగాస్నానము చేసి కాశీ విశ్వనాథుని దర్శించి ఆ మహాక్షేత్రముననే ఆచార్యుల వారివలన మంత్రోపదేశమంది, ఉత్తరదేశ యాత్రలుచేసి తిరిగి వచ్చిన పిమ్మట ఆచార్యులవారి ప్రోత్సాహముచే శ్రీ పట్టాభిరామస్వామివారికి ఆలయ, ప్రాకార, గోపురాదులను నిర్మించి సువర్ణకలశము లెత్తించి 26-4-39 వ తేదీన మహా వైభవముగ ప్రతిష్ఠాకలాపమును నిర్వహించి అటనుండి స్వామివారి నిత్యనైమిత్తిక కైంకర్యముల నన్నిటిని యథావిధిగ జరుపుచుండిరి. కొంతకాలమైన పిమ్మట స్వామివారి పర్యంకాసనమునకు అద్దాల మహలును అతిసుందరముగ నిర్మింపజేసి స్వామివారి వైభవములను కనులారగాంచుచు 1957 జూన్ 12వ తేదీన కాలధర్మము చెందిరి. వారి యనంతరము వారి దత్తపుత్రులగు రామారావుగారు శ్రీస్వామివారి కార్య కలాపములను నిర్వహించుటలో దీక్షితులై యుండిరి. శ్రీరంగాది దివ్యక్షేత్రములలో జరిగినట్లే స్వామివారికి అంగ రంగ వైభవములు జరుగుచుండును. శ్రీస్వామివారికి వైఖానసులగు

వేదాంతం రంగాచార్యులు, చినరంగాచార్యులు పెద్దింటి సీతారామమ్మ వగైరాలు అర్చనాది కైంకర్యములను జరుపుచున్నారు.


ఈ పట్టణమునకు మధ్యభాగమున మాజేటి శ్రీరాములు గారి ఆధిపత్యము క్రింద, నెల్లూరు పట్టణవాసియగు కొత్త మాసు పరదేశి కుమారుడు కోటప్పయను వారు ఒక దేవాలయమును గట్టించి అందు కన్యకా పరమేశ్వరిని, నగరేశ్వర స్వామిని, పార్వతీదేవిని ప్రతిష్ఠించియుండిరి. నరసారావుపేట లోని వైశ్యసంఘమే ఆ యాలయ పరిపాలనా భారమును వహించి నిత్య నైమిత్తికాది కార్యములను జరుపుచున్నది. కోటప్పగారు మాజేటి శ్రీరాములుగారికి ఈ దేవాలయమునకు సంబంధించిన ధర్మాధికారము నొసంగుచు 1896 సం॥ ఆగస్టు 25వ తేదీన అధికార పత్రమును వ్రాసి యిచ్చియుండిరి. ఈ అధికార పత్రమును, మరణశాసనమును కలవు.

ఈ యాలయమున వెలనాటి పూజారులగు ఆమంచి పట్టాభిరామయ్య అర్చకులుగా నున్నారు.

పట్టాభిరామస్వామివారి ఆలయమునకు తూర్పుదిక్కున వంగల రామస్వామిగారి భార్య ఆదిలక్ష్మమ్మగారను ఒక బ్రాహ్మణ భక్తురాలు శ్రీ సీతారామస్వామివారికి నూతనముగ దేవాలయమును కట్టించి శా. శ. ౧౮౨౯ ప్లవంగ నామ సం॥



శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారు
నర్సారావుపేట



జ్యేష్ఠ శు ౯ గురువారం శుభముహూర్తమున శ్రీ స్వామివారిని ప్రతిష్ఠింపజేసి నిత్యనైవేద్య దీపారాధనలు జరుపుచు వచ్చెను. తర్వాత కొలది దినములకే అదిలక్ష్మమ్మగారు స్వామివారి కైంకర్యము కుంటువడకుండ జరుపుటకు సమర్థులని యెంచి కొప్పురావూరి వెంకటప్పయ్యగారికి 1907 ఆగస్టు 9వ తేదీన ధర్మకర్తృత్వాధికారము నిర్ణయించుచు (మరణశాసనమునం దీయమ స్వామివారి కర్పించిన భూవసతులు మొదలగు విషయములు గలవు) వ్రాయించియిచ్చి వారి స్వాధీనము చేసెను. ఆదిలక్ష్మమ్మగారు (ఆదెమ్మ) శ్రీ స్వామివారి కైంకర్యమునకు కొంత భూమియు నొసంగిరి. కొన్ని దినములైన పిమ్మట తాను వ్రాయించి యిచ్చిన ధర్మకర్తృత్వాధికార పత్రమును రద్దుపఱచి, భూములను మార్చి అర్చకులకు అర్చనాది కైంకర్యములకు గాను 1913 ఏప్రియల్ 28 వ తేదీన దానిపత్రము వ్రాసియిచ్చి పరిపాలనమును మార్పు చేసిరి. ఈ పరిపాలనమును కొంతకాలము కొంపల్లి హనుమంతరావు, కాకుమాను హనుమయ్య, మండవ వెంకటరెడ్డి గార్లు కొనసాగించి యుండిరి. ఈ మహాభక్తురాలు తమ జీవితమంతయు స్వామివారి సేవతోనే కాలముగడపి యున్నది. తుదకు యాత్రలకై వెడలి 1913 జులై 22వ తేదీన ఆ సాధ్వి కాశి యందు కైవల్యము బొందెను. తరువాత మండవ వెంకటరెడ్డి శ్రేష్ఠిగారు యీ దేవాలయమును వృద్ధిపరచి అద్దాల మహాలు కళ్యాణమంటపము మున్నగు కట్టడములు వృద్ధిచేసి

భక్త శిఖామణులై వాశిగాంచిరి. యిపుడు వారికుమారులు ఆదినారాయణరావుగారు పరిపాలకులై యున్నారు.

పట్టాభిరామస్వామివారి ఆలయమునకు పడమటి దిశయందు పాండురంగస్వామి కోవెల కలదు. ఈ యాలయమును గుగ్గిలం వెంకట సుబ్బయ్యగారు స్థలము సంపాదించి యాలయ నిర్మాణమునకు శంఖుస్థాపనచేసి దివంగతులైరి. అటుపిమ్మట వారి ధర్మపత్ని రాఘవమ్మగారు దీక్షవహించి తన భర్త ప్రారంభించిన దైవకార్యమును నిర్వహింప దలపెట్టి తాటికొండ కోటీశంగారిద్వారా ఆలయ గోపురాది నిర్మాణము చేయించి 1-4-1936 వ తేదీన స్వామివారి ప్రతిష్ఠాకలాపము పూర్తిచేసిరి. కొంతకాలము ఆమెయే పరిపాలనాధికారము నిర్వహించి పిమ్మట 16-4-1960 వ తేదీన తాటికొండ రామ పోలిశెట్టి, నారడ్ల రామయ్యగార్లకు తన ధర్మకర్తృత్వాధికారమును వ్రాసియిచ్చెను. ఆ స్వామివారికి వెలనాటి పూజారులు ఆమంచి పట్టాభిరామయ్య అర్చకులుగానుండి నిత్య పూజావిధులను నిర్వహించుచున్నారు.

ఈ పురమున మధ్వశ్రీ అధరాపురపు పురుషోత్తమాచార్యులుగారను మహాతపస్సంపన్నులును, హనుమదుపాసకులునగు మధ్వబ్రాహ్మణులొకరు గలరు. వారు తమ గృహమునందే తమ యిష్టదైవమైన ఆంజనేయ స్వామికి మందిరము కట్టించి అందు హనుమంతుని ప్రతిష్ఠించి తామే యారాధనము జరుపుచు వచ్చిరి. అవసానకాలమున తమ యావదాస్తిని శ్రీ స్వామివారి కర్పించి, శెడింబి హనుమంతరావు పం-

తులు, పత్రి వెంకటరావు పంతులు, మజుందారు హనుమంతరావు పంతులు, తాడేపల్లి ఆంజనేయ శాస్త్రి, మానూరు రాఘవరావు పంతులుగార్లకు ధర్మకర్తృత్వాధికారమును వ్రాతపూర్వకముగ నొసంగి విరోధికృతు సం॥ చైత్ర శు ౯ నాడు పరమపదించియుండిరి. అటనుండి పైవారే ధర్మకర్తలుగ నుండి కార్యకలాపములను నిర్వహింప నారంభించిరి. ప్రస్తుతము శెడింబి శ్రీనివాసరావు, మొరుసుపల్లి హనుమంతరావు, మానూరి జానకిరామయ్య, తాడేపల్లి సంపూర్ణ లక్ష్మీనారాయణ, అద్దంకి కృష్ణమూర్తిగార్లు ధర్మకర్తలుగానుండి స్వామివారి నిత్యనైమిత్తికాది సేవావిధులను జరుపుచున్నారు. శ్రీ స్వామివారి అర్చనాది కైంకర్యములను మాధ్వులైన రాచూరి శ్రీనివాసాచార్యులుగారు నిర్వహించుచున్నారు.

ఈ పట్టణమున నరసింహపురమను నొక పేట కలదు. దానికి పడమటి దిశయందు శంకరమంచి లక్ష్మీనారాయణ శాస్త్రిగారు శంకరమఠమును కట్టించి అందు పుష్పగిరి పీఠాధిపతులు శ్రీ పరమహంసేత్యాది బిరుదాంకితులగు శ్రీ విద్యానృసింహ భారతీ స్వాములవారిచే 7-7-1923 వ తేదీన శంకరాచార్య స్వామిని ప్రతిష్ఠింపజేసి యుండిరి.

ఈ పట్టణమునకు పశ్చిమభాగమున రాధాకృష్ణ అగ్రహారమను పేట కలదు. ఈ అగ్రహారమును 1893 సంవత్సరమున పోతురాజు వెంకటప్పయ్యగారు ప్రారంభించి తమ యిష్ట

దైవమగు రాధాకృష్ణుని పేరు పెట్టిరి. ఇందొక ఆంజనేయస్వామి దేవాలయము కలదు. ఈ ఆంజనేయస్వామివారి ఆలయావరణముననే బ్రహ్మయ్యయనువారు రంగనాయకస్వామివారి ఆలయము కట్టించి అందు శ్రీ స్వామివారిని ప్రతిష్ఠింపజేసిరి. ఆ స్వామివారికి పూజా కైంకర్యములను వైదికులు వంగర సుబ్బయ్యగారు జరుపుచున్నారు.

ఈ నరసారావుపేటలో పెక్కండ్రు దాతలు పెక్కు ధర్మకార్యములను నిర్వహించి యీ పురమును యాత్రాస్థలముగా నొనరించి యుండిరి. ఈ పట్టణములోని ఆలయ వైభవములు వచించుటకంటె కనులారజూచి ఆనందించుటయే ముఖ్యము.

3. అన్నవరము

ఈ గ్రామము నరసారావుపేట తాలూకాలోనిది. కొంపిచర్లలోని కొంతభాగము పూర్వ మెప్పుడో బ్రాహ్మణుల అన్నదానమునకుగాను ప్రత్యేకింపబడెను. ఆ కారణము వలననే యీ గ్రామమునకు అన్నవరమని పేరు వచ్చినట్లు కన్పడుచున్నది. ఈ గ్రామమున రెడ్డిరాజుల కాలములో శ్రీ వేణుగోపాలస్వామి వారి ఆలయము కట్టించబడినట్లును, రత్నాకరం తిరుమలాచార్యుల వారిని అర్చనా కైంకర్యమునకు నియోగించినట్లును చారిత్రికముగ తెలియుచున్నది.

ఈ గ్రామము కొంతకాలము రాయని భాస్కరుని యేలుబడిక్రిందను, తర్వాత కొంతకాలము గుంటుపల్లి ముత్తరాజయ్యగారి అధికారముక్రిందను నున్నట్లు కన్పడును. ముత్తరాజయ్యగారి అధికారములో 1570 వఱకుండియుండెను. తర్వాత వాసిరెడ్డి పెదనాగన్నగారు పాలకులైరి. అటుపిమ్మట మానూరి వెంకన్నగారి పరిపాలనలోనికి వచ్చెను. 1771 లో సుబేదారు నాజీమల్లుఖాను బ్రిటిషువారికి చెందజేసెను. బ్రిటిషువారు 1796 లో వాసిరెడ్డి వేంకటాద్రిగారికి చెందజేసిరి. ఈ గ్రామమున పట్టాభిరామస్వామివారి దేవాలయము కలదు. ఇది ప్రాచీనమైనదని చెప్పవచ్చును. శ్రీ స్వామివారికి వైఖానసులు వేదాంతం వెంకటాద్రిమాచార్యులుగారు అర్చనాది కైంకర్యమును నిర్వహించుచున్నారు.

4. అప్పాపురము

ఇది నరసారావుపేటకు ఆగ్నేయముగ 9 మైళ్ళ దూరములో నున్నది. ఇది చిన్నగ్రామము. దీనికి సంబంధించిన చరిత్ర యేమియు తెలియరాదు. కాని అప్పాజీ యని శ్రీకృష్ణదేవరాయలచే గౌరవముగా పిలువబడు తిమ్మరుసు ఈ గ్రామమును కట్టించెనని ఒక ప్రతీతి కలదు. కనుకనే యీ గ్రామమునకు అప్పాపురమను పేరు వచ్చియుండవచ్చును. ఈ తిమ్మరుసు కనుపట్టులో గోపాలస్వామి దేవాలయము కూడ కట్టించియుం

డెను. కనుక తిమ్మరుసు ఈ గ్రామము కట్టించెననుటలో సందేహించవలసిన యవసరముండదు. అప్పాజీ కట్టించినందున అప్పాపురమను పేరు వచ్చినదనుటలో విప్రతిపత్తి యేమియు లేదు. ఈ గ్రామమున హనుమంతుని దేవాలయ మొకటి కలదు. ఆ యాలయము పురాతనమైనదిగ కన్పడుచున్నది. ఈ దేవునకు అర్చనాది కైంకర్యములు వైఖానస సూత్రులగు పరాంకుశం వెంకట రంగాచార్యులు, నృసింహాచార్యులు గార్లు నిర్వహించుచున్నారు.

5. అ న ం త వ ర ము

పూర్వ మెవరో యొకరాజు గుఱ్ఱముపై ప్రయాణము చేయుచు యనమదల దాటి కొలది దూరము వెళ్ళునప్పటి కొక పెద్ద మఱ్ఱిచెట్టు కన్పించెను. అచట కొంతకాలము విశ్రమింపదలచి గుఱ్ఱము దిగి దాని నచట కట్టివైచి ఆ చెట్టునీడన విశ్రమించెను. చల్లని గాలి సోకుటవలన సుఖముగా నిద్ర పట్టెను. అపుడు స్వప్నమున అనంతుడను సర్పము కన్పించి "ఇది నేనుండు ప్రదేశము ఇట నాపేరుతో నొకగ్రామము కట్టించవలసినది" అని చెప్పి అంతర్ధానమయ్యెను. రాజు కన్ను తెఱచి చూడగా నచట ఏమియు కన్పింపకుండెను. అంతట ఆ రాజు అదియే దివ్యాజ్ఞగా భావించి కొలది దినములలోనే ఒక సుముహూర్తమున అచట నొక గ్రామమును కట్టించి అనంతవరము అని పేరిడి యుండెను అను ప్రతీతి యొకటి కలదు.

ఈ గ్రామమును గుఱించిన ప్రతీతి మఱియొకటి ప్రచారములో నున్నది. అనంతవర్మయనురాజు తనపేర ఈ గ్రామమును కట్టించియుండుటచే నీ పేరు వచ్చినదనియు చెప్పుదురు.

ఈ యనంతవరమునే పద్మరాజు అనంతవరమని పిలుచుటయు వాడుక కలదు. పూర్వ మొక సమయమున ఈ ప్రాంతమునకు పరిపాలకుడైన పద్మరాజు యనమదల శివారుగానున్న యీ గ్రామమును ఆశ్రితులైన పండితులకు అగ్రహారముగ దానమొసంగెనట. అందువలన దీనికి పద్మరాజు అనంతవరమని ప్రతీతి యేర్పడినట్లును చెప్పువాడుక కలదు. వీనిలో ఏది సత్యమో, ఏది అసత్యమో చెప్పతగిన దృష్టాంతములు లేకున్నను ఈగ్రామము పురాతనమైనదనియు, పవిత్రమైన అగ్రహారమనియు చెప్పుటకు వీలుకలుగుచున్నది. ఈ గ్రామమును వీరభోగ వసంతరాయుడు తనకు ముఖ్యపట్టణముగా జేసి కొని యుండెనని పెద్దలు చెప్పుదురు. మఱియు నిందు వీరభోగ వసంతరాయ డెక్కి తిరుగు కంచురథ చక్రముల జాడలు కొంతకాలము కనుపించుచుండెడివట.

అట్టి యీ గ్రామము ధనికుల కాస్పదమై యొప్పారుచున్నది. కొంతకాలము క్రిందట నిమ్మరాజు వెంకయ్య అను సంపన్న గృహస్థుడు ఒక దేవాలయము కట్టించెను. అదియే యిప్పుడున్న వేణుగోపాలస్వామి దేవాలయము కావచ్చును.

ఇదిగాక ఆ గ్రామమున ఆంజనేయస్వామి దేవాలయమును గలదు. ఈ రెండు ఆలయములకును వైఖానసులు దీవి హనుమాచార్యులుగారు కైంకర్యము జరుపుచున్నారు. ఈ ఆలయములేగాక భోగమల్లేశ్వర స్వామి ఆలయమును నొకటి యున్నది. స్వామివారి పేరునుబట్టి చూడ వీరభోగ వసంత రాయనిచే నీ యాలయము నిర్మింపబడియుండవచ్చునని తోచుచున్నది. ఈ స్వామివారి అర్చకులు తుర్లపాటి బ్రహ్మయ్య, కోటయ్య, వెంకట సుబ్బయ్య అనువారు.

6. ఇక్కుర్రు

ఈ గ్రామము చరిత్ర ప్రసిద్ధమైనది. ఇది నరసారావుపేటకు పడమరగా మూడుమైళ్ళ దూరమున నున్నది. ఈ గ్రామ సమీపమున నొక కొండగలదు. దానిమీద మల్లికార్జున స్వామి, రామలింగస్వామి దేవాలయములు రెండు కలవు. ఇక్కుర్రు అను గ్రామమునే ఇక్కురం అనియు నందురు. ఈ యిక్కురం కొండమీద శిరిపురపు రామానాయకుని కుమారుడు మల్లినాయకుడు రామప్రతిష్ఠచేసి గుడి యెత్తించినట్లును, మల్లికార్జునస్వామికి ఈ గ్రామము సమర్పించినట్లును 1116 లో వేయించిన చోళుల కాలపు శాసనములో తెలుపబడి యున్నది. కొంతకాలమునకీ మల్లికార్జునస్వామి ఆలయము శిథిలము కాగా రాజరాజ మహారాజ దేవుల పరిపాలనమున మహారాజు ఆ స్వామివారి ఆలయమును జీర్ణోద్ధారణ చేసి యుండెను.

ఒక సమయమున మల్లికార్జునునికొండ మీద నీటికరవేర్పడెను. అపుడు శక్తియను పేరుగల శాస్త్రజ్ఞుడు అచటనున్న ఒక బండను పగులగొట్టగా నందుండి నీటిబుగ్గయొకటి యేర్పడెను. అప్పటినుండి ఆ కొండమీద నీటికొఱత తీరి సమృద్ధిగా జలముండుట సంభవించెను. ఆదోనను శక్తిదోన యందురు.

ఈ దోనకు సమీపముననే పాండవ గుండ మొకటి యున్నది. పాండవులు వనవాసము చేయు సమయమున ఈ గుండమునకు సమీపముననే వారు నివసించుటచే దీనికి పాండవ గుండమని పేరు కలిగియుండవచ్చును. శక్తిదోనలో తొలి యేకాదశినాడు స్నానము చేసిన మహాపుణ్యమని ప్రజలకు విశ్వాసము కలదు. ఇప్పటికిని తొలియేకాదశినాడు అశేష జనము వెళ్ళి స్నానము చేయుచుండుట కలదు. ఈ గ్రామ కరిణీకము ఇక్కుర్తివారిదే. ఈ గ్రామ మెవరి పరిపాలనమునను గాని బోయినపల్లి వారికి ముఖాసాగా నీయబడి యున్నది. మఱియు నిందు ప్రసిద్ధి చెందిన కూనలమ్మయను గ్రామదేవత ఆలయ మొకటియును వినాయకుని గుడియు కలవు. రామలింగ స్వామి మున్నగు ఆలయములకు ఆదిశైవులు కొండకావూరి కోటయ్యగారు అర్చకులుగా నున్నారు.

7. ఇర్లపాడు

ఈ గ్రామము నరసారావుపేటకు ఆఱుమైళ్ళ దూర [illegible] రాజుల కాలమున 1023 లో [illegible] కలదు. ఈ ఆలయము సోమన [illegible] కట్టించినట్లు 11వ శతాబ్దిలో నున్న శాసనమునుబట్టి తెలియుచున్నది. దీనిని సోమేశ్వరాలయ మనెదరు. సోమేశ్వరస్వామి కెదురుగా నున్న స్తంభముమీద చెక్కబడిన శాసనముమీద నిట్లు కలదు.

(1) "శకవర్షంబులు 1057 (శ్రీ) మత్ సోమన పెగ్గడ [illegible] ఇజ్జిల్లూర్ల (శ్రీ) సోమేశ్వర మహాదేవరం [illegible] మండప [illegible] గుడియెత్తించి నాదేవరకు [illegible] కట్టించిన పెంజెఱువు దానముగా [illegible] దీపంబు పెట్టించె".

(2) "శ్రీ మన్మహామండలేశ్వర చోడరాజు ఇజ్జిలూరి (శ్రీ) సోమేశ్వర దేవరకు భోగారంబుగానిచ్చిన భూమి".

మొదటి శాసనమువలన సోమన పెగ్గడ దేవాలయము కట్టించి అఖండదీపము పెట్టించినట్టును, రెండవ శాసనము వలన చోడరాజు సోమేశ్వరస్వామికి భోగారము భూమి యిచ్చినట్లును స్పష్టమగుచున్నది. సోమన పెగడ కట్టించిన దేవాలయమగుటచేతనే ఆస్వామికి సోమేశ్వరస్వామి అని పేరు

వచ్చియున్నది. శాసనములలో నున్న ఇరలూరే [illegible] అని వ్యవహారములోనికి వచ్చియుండును.

ఈ గ్రామ కరణములు కూడ ఇర్లపాటివారే. వారిపుడు జొన్నలగడ్డవారను గృహనామముతో వ్యవహరింపబడుచున్నారు. ఈ గ్రామములోని సోమేశ్వర స్వామివారికి ఆది శైవులైన సుదురుపాటి భద్రయ్య, నాగేశ్వరరావు, కోటేశ్వరరావుగార్లు పూజాకైంకర్యమును చేయుచున్నారు.

8. ఉప్పలపాడు

ఈ గ్రామము నరసారావుపేటకు నైరృతి దిశను మూడుమైళ్ళ దూరమున కలదు. పూర్వమీ గ్రామము పెట్లూరు ప్రాంతము [illegible] సీమలో కలిసియుండెడిది. తరువాత కొంతకాలము [illegible] కాలో చేరియున్నది. ఈ గ్రామమునకు [illegible] దేవాలయము [illegible] కట్టించి [illegible] స్వామి [illegible] నైవేద్య దీపా [illegible]

చున్నారు. ఈ గ్రామముననే గంగమ్మ యను గ్రామదేవత యును కలదు. అందొక శాసనము కన్పట్టుచున్నది.

9. క ను ప ఱ

ఈ గ్రామము నరసారావుపేటకు ఆగ్నేయ దిక్కున నాలుగుమైళ్ళ దూరముననున్నది. ఈ గ్రామమున కొంతకాలము జైనులు నివసించి జైనాలయమును కట్టించిరి. ఆ ఆలయము శిథిలమై పాడుపడి జైనపాడను దిబ్బగా నిపుడేర్పడి యున్నది. అచట ఆ యాలయ చిహ్నములేవియు కన్పింపవు. ఇప్పటికిని ఎప్పుడైన వాన కురిసినపు జైనపాడను దిబ్బమీద జైన నాణెములు దొరుకుచుండునట. కొంత కాలమునకు పూర్వము జైననాణెములు, అనేకరంగులుగల పెంకులు, ఇటుకలు, గాజుముక్కలు అధికముగ దొరకుచుండెడివట. తరువాత కృష్ణదేవరాయల కాలములో 15వ శతాబ్దమున తిమ్మరుసు మంత్రి ఈ గ్రామమున గోపాలస్వామి ఆలయము కట్టించి భూదానము చేసినట్లు చెప్పుదురు.

ఈ గ్రామములోని పోతరాజు గుడికి ముందు భాగమున నున్న 1267లో వ్రాయబడిన శాసనమువలన నిందు గోపినాధుని దేవాలయ మొకటియున్నట్లు తెలియుచున్నది. ఆ ఆలయపు చిహ్నములైనను ఈనాడు కన్పడకున్నవి.

మధ్యకాలములో కనుపర్తి చిన్నంరాజు ఈ గ్రామమున సీతారామ స్వామి దేవాలయమును, రామలింగేశ్వర స్వామి

దేవాలయమును కట్టించియుండిరి. సంతు బందీలు చేసినపుడు నాదెండ్ల సమితిలో చేరి చౌదరీలవలన అమానీ మాఖ్లియత్ జరిగెను.

ఈ గ్రామమధ్యమున నొక రాతి విగ్రహము కలదు. అది యేసునాధస్వామి యని ప్రజలు చెప్పుదురు. ఆ విగ్రహమిటీవల బ్రిటిషు ప్రభుత్వ పరిపాలనలో క్రైస్తవ మతము బాగుగ విజృంభించి నప్పుడు స్థాపనము జరిగియుండ వచ్చును.

గోపరాజు రామన్న కరిణీకము లిచ్చునపుడు ఈ గ్రామ కరిణీకము కనుపర్తివారి కిచ్చెను. సంతుబందీలు చేయుటలో ఈ గ్రామము నాదెండ్ల సంతునందు చేరెను. కొండవీడు వంతు వేసినపుడు ఈ గ్రామము మానూరివారి వంతుకు వచ్చెను. వారి యన్నదమ్ములు పంచుకొనినపుడు వెంకటేశంగారి వంతుకు రాగా అపుడు సత్తెనపల్లిలో చేర్చబడెను. బ్రిటిషువారు చేసిన తాలూకాల విభాగములో నరసారావుపేట తాలూకాలోనికి ఈ గ్రామము వచ్చెను. శ్రీ సీతారామస్వామివారి అర్చకులు శ్రీరంగం నరసింహాచార్యులుగారు రామలింగేశ్వరస్వామి అర్చకులు చదలవాడ సోమయ్యగారు.

10. కా మే ప ల్లి

ఈ గ్రామము నరసారావుపేటకు పదురెండు మైళ్ళ దూరమున నున్నది. ఈ గ్రామమునకు ఉత్తరమున నున్న

దిబ్బమీద ఒక శాసనము కలదు. ఆ శాసనము కామచోడ మహారాజు, కేత జగ్గయ్యలనువారికి కావేరీ తీర్థవాసి దానమిచ్చినట్లు కనబడుచున్నది. ఇచట కరణములు కామేపల్లి వారు, తురుమెళ్ళవారు. ఈ గ్రామమున సీతారామస్వామి వారి దేవాలయము కలదు. అర్చకులు వైఖానసులు. విస్సకొండ రామాచార్యులు అనువారు.

11. కావూరు

ఈ గ్రామము నరసారావుపేటకు తొమ్మిదిమైళ్ళ దూరమున తూర్పు దిశగానున్నది. ఇచట వాశిరెడ్డివారిచే కట్టించబడిన శ్రీ చెన్నకేశవస్వామి, ఆంజనేయ స్వామివార్ల ఆలయములు కలవు. ఆ గ్రామమున 1137 లో వేయించిన ఒక శాసనము కలదు. ఆ శాసనమున "గోనియపూడి గ్రామమున నున్న సోమేశ్వర స్వామికి భూదానము చేసినట్లు కనబడుచున్నది. 1650 లో జొన్నలగడ్డ కొండప్పయను నాతడు శ్రీ వేణుగోపాల స్వామి వారి ఆలయమును కట్టించెను. ఆ దేవాలయము కొంత కాలమునకు శిథిలముకాగా కావూరి లక్ష్మన్న యను వారు 1803 లో మరమ్మతులు చేయించి యుండిరి. ఆ గ్రామముననే మధ్యభాగమున కేతినేనిసుబ్బయ్య, నాయుడు జగన్నాథము, [illegible] అను వారలు శ్రీ సీతారామస్వామి వారి దేవస్థానమును కట్టించిరి. ఇచ్చట బ్రహ్మాండ

పురాణము అర్థపంచకమును తెనిగించిన కావూరి యల్లనామాత్యుడు ఈ గ్రామవాసియే. ఈ గ్రామకరణములు కావూరి వారే. శ్రీ సీతారామస్వామి, చెన్నకేశవస్వామి, ఆంజనేయ స్వామివార్ల అర్చనాదికైంకర్యములు జరుపువారు దివి కేశవాచార్యులు, సీతారామాచార్యులు గార్లు.

12. కాకాని

ఈ గ్రామము నరసారావుపేటకు ఏడు మైళ్ళ దూరమున గలదు. ఇందు హనుమంతుని దేవాలయము, కేశవ స్వామి దేవాలయములు కలవు. హనుమంతుని దేవాలయములో నొక స్తంభముమీద నొక శాసనము చెక్కబడియున్నది. అది 1246 లో వ్రాయబడినది. అందు "కాకతీయ రాజ్యములోని కాకండ యను నగ్రహారమున కేశవస్వామి ప్రతిష్ఠ గావింపబడినట్లును, ఇంకను అనేకదానములు చేసినట్లును గలదు. ఈ శాసనమును బట్టి చూడ కాకండయను నదే యీనాడు కాకానిగా మారినట్లు కన్పించుచున్నది. కాకండలో కేశవస్వామి ప్రతిష్ఠ చేసినట్లు శాసనమున వ్రాయబడుటయు, కాకానియందు కేశవస్వామివారి ఆలయ ముండుటయు చూడ అలనాటి కాకండయే యీనాటి కాకాని యని తప్పక చెప్పవచ్చును. ఈ గ్రామమున శిథిలములైన మఱికొన్ని దేవా

లయములు కూడగలవు. ఈ గ్రామకరణీకము కాకాని వారిది. ఆంజనేయస్వామివారి అర్చకులు వైదీకులు.

13. కొప్పరము

ఈ గ్రామము చారిత్రక ప్రసిద్ధమైనది. నరసారావుపేటకు దక్షిణమున పదునాలుగు మైళ్ళ దూరములో నున్నది. ఈ గ్రామములో కోదండరామస్వామి, వీరభద్రస్వామి, త్రిపురాంతకస్వామి, సోమేశ్వరస్వామి దేవాలయములు కలవు. ఇవి చాల పురాతనమైనవిగ కన్పట్టుచున్నవి. కోదండరామస్వామి ఆలయ ప్రాంగణములో రెండు శాసనము లున్నవి. అందొకటి 1115 లోనిది. రెండవది కూడ ఆకాలమున వేయబడిన దే. ఈ శాసనము లందొకదానిలో కన్నరచోడ మహీపాలుని మంత్రియగు మారుడు ఈ గ్రామమున రెండు చెరువులు త్రవ్వించి"నట్లు వ్రాయబడి యున్నది. రెండవదానియందు "సోమేశ్వరాలయము కట్టించి యా స్వామికి ఈ గ్రామము దానమిచ్చినట్లుగ లిఖింపబడియుండెను. ఈ శాసనమును బట్టి చూడగా సోమేశ్వరాలయము 12వ శతాబ్దిలో కట్టింపబడినట్లు తేలుచున్నది. ఈ గ్రామముననే వీరభద్రస్వామివారి దేవాలయమున మఱిరెండు దానశాసనములు గలవు. అవి కాకతి గణపతిదేవుని కాలము నాటివి. అందొకటి 1218 లోను రెండవది 1233 లోను వేయించబడినట్లు ఆ శాసనములవలన అర్థమగు

చున్నది. ఈ శాసనమువలన ఈ గ్రామమున ఉత్తరదిక్కున 1168 లో మల్లేశ్వరస్వామి దేవాలయమొకటి కట్టించబడినట్లు కల్పడుచున్నది. కాని మల్లేశ్వర దేవాలయమిపు డీగ్రామమున కన్పించుటలేదు. అది శిథిలమై యుండవచ్చును.

కోదండరామస్వామివారి దేవాలయములోని కల్యాణ మంటపము దగ్గర మఱియొక శాసన మున్నది. అది 1324 సంవత్సరమునకు చెందినది. దానియందు రామలక్ష్మణులకు ప్రత్యేక దానములు చేసినట్లుగ గలదు.

రెడ్డిరాజుల పరిపాలనకాలములో వారు సోమేశ్వర స్వామివారి ఆలయము శిథిలావస్థలో నుండగా అద్దానిని మరల కట్టించి యుండిరి. మల్రాజువారు ఈ దేవాలయమునకు మఱికొన్ని భూములిచ్చినట్లుగ గన్పట్టుచున్నది. వాసిరెడ్డి వేంకటాద్రినాయుడుగారి కాలమున కీ గ్రామములోని ఆలయములు శిథిలావస్థలోనుండగా నాయుడుగారు ఈ దేవాలయములను తిరిగి ఉద్ధరించియుండిరి.

కొప్పరం శివారులో సజ్జాపురం అను గ్రామ మొకటి కలదు. అందు శ్రీ సీతారామస్వామి దేవాలయమును ఆగ్రామ వాస్తవ్యులైన కంతేటి వీరయ్య, గంధ్రు 'అంకమ్మ, రెడ్డి వెంకటసుబ్బయ్య. దోగిపర్తి అమరయ్యగార్లు 1952 వ సంవత్సరమున కట్టించియుండిరి.

కోదండరామస్వామికి వైఖానసులు దీవి హనుమాచార్యులుగారు అర్చనాది కైంకర్యమును జరుపుచున్నారు. త్రిపురాంతకస్వామి, వీరభద్రస్వామి అర్చకులు ఆదిశైవులు తుర్లపాటి రామలింగయ్య, కోటయ్య, సుబ్బయ్యగార్లు.

14. కో ళ్ళ పూ డి

ఈ గ్రామము 1266 వ సంవత్సరమున కమ్మనాటి రాజ్యములో కొణాంద్రిఫూండి యను పేరుతో వ్యవహరింపబడుచుండెడిది. ఆ కొణాంద్రిపూండియే కొల్లపుండిగా మార్పు చెందినది. చాలకాలము కొల్లపూండియను నామముతోనే వ్యవహరింపబడుచు వచ్చినది. కనుకనే కొన్ని కుటుంబముల వారికి కొల్లపుండివారను గృహనామమేర్పడుట సంభవించినది. కొల్లపుండియనునదియే క్రమక్రమముగా కోళ్ళపూడిగా మార్పు చెంది యుండవచ్చును.

కొణాంద్రిపూండియను పేరుతో వ్యవహరింపబడుచున్నపుడు ఆ గ్రామమందు శ్రీవల్లభ రాజను నాతడు శ్రీ కొమరు గోపీనాథుని (బాలగోపీనాథుని) ప్రతిష్ఠించి, ఆ దేవుని అర్చనాదులకు భూదానము చేసినట్లు ఒక శాసనమువలన దెలియవచ్చుచున్నది. ఆ దేవాలయము కాలక్రమమున నష్టమై పోవుటచేతనే యిపుడా దేవాలయము కన్పింపదు.

కొల్లపుండి యను నామముతో వ్యవహరింపబడునప్పుడు కొల్లపుండి శింగరాజను వారు 1565 వ సంవత్సరమున ఆది కేశవస్వామికి గర్భగుడి, అంతరాలయములు నిర్మింపజేసి, శ్రీ భూదేవులకు గరుడకంబమును నెలకొల్పియుండిరి. అటుపిమ్మట వారే నీలకంఠేశ్వరునకు ఆలయము కట్టించి ప్రతిష్ఠ చేసినట్లు వేరొక శాసనమువలన దెలియవచ్చుచున్నది. దీనిని బట్టి 16 వ శతాబ్దమువఱకు కోళ్ళపూడియను గ్రామము కొల్లపుండిగనే వ్యవహరింపబడుచుండెననుట నిక్కువము.

తర్వాత కొంతకాలమునకు కొల్లపుండి కోలలపూడిగా మార్పు చెందినట్లు గ్రామకరణముల యింటి పేరు వలన ఊహింప వీలగుచున్నది. ఆ కోలలపూడి యను పేరే యిటీవల యెప్పుడో వ్యవహారమున కోళ్ళపూడిగా మార్పు చెంది యాపేరుతోనే ప్రస్తుతకాలమున వ్యవహరింపబడుచున్నది.

15. కొ ణి దె న

నరసారావుపేటకు పదునెదు మైళ్ళదూరమున ఈ గ్రామము కలదు. ఈగ్రామ సమీపమున నొకకొండ యున్నది. ఆ కొండమీద కేశవస్వామి వారి ఆలయమొకటి కలదు. ఆ దేవాలయము లోనున్న శాసనమందు నన్నెచోడ మహారాజు పేరు కన్పడుచున్నది. ఆ శాసనము 1151 లో వేయబడినది. ఇందుదహరింపబడిన నన్నెచోడ మహారాజే తెలుగు

కుమారసంభవ కృతికర్త. కమ్మనాటిని త్రిభువనమల్లుడు పరిపాలించు సమయమున ఆ దేశమునకిదియే ముఖ్యపట్టణముగా నుండి యుండెను. ఆ నాడు ఈ గ్రామమునకు "కొట్టయదోన" యను పేరు వ్యవహారములో నున్నట్లు కన్పించుచున్నది. అదియే వ్యవహారవశమున కోణిదెనగా మార్పు చెందియుండెను.

కొండమీదనున్న కేశవస్వామిని అచటివారు త్రిభువనమల్లు కేశవుడని పిలుచుచుందురు. ఈ వ్యవహారమును బట్టి ఈ కేశవస్వామిని త్రిభువనమల్లుడు పరిపాలించునప్పుడు ప్రతిష్ఠించియుండును. లేకున్న త్రిభువనమల్లు కేశవుడను వ్యవహారము కలుగుట సంభవింపదు.

ఇచట శంకరేశ్వరస్వామి దేవాలయము మఱియొకటి కలదు. ఈ శంకరేశ్వర దేవరకు బొల్లయను నాతఁడు కొంత భూమి దానము చేసినట్లు శాసనములవలన దెలియవచ్చుచున్నది. ఈ కొండదగ్గర ఒక నీటిబుగ్గ నిర్మల జలముతో కూడి యుండును.

పూర్వము ఈగ్రామ కరిణీకపు మిరాశీ బల్లికురువవారికి, శంకరప్రగడవారికి, పుణ్యమూర్తులవారికి నుండెడిది. కాని యిపుడు కోణిదెనవారికి సంక్రమించినది. అందువలన వారే యిపుడు కరిణీకము చేయుచున్నారు. ఈ గ్రామమందలి కేశవస్వామికి పాంచరాత్రులు అర్చకులు. శంకరేశ్వరస్వామికి ఆదిశైవులు తుర్లపాటి వెంకట్రాయుడు.

16. కొమ్మాలపాడు

ఈ గ్రామము నరసారావుపేటకు దక్షిణమున ఒంగోలు, హైదరాబాదు రోడ్డుమీద నున్నది. ఈ గ్రామమున నాలుగు వందల సంవత్సరముల క్రిందట అద్రి భావరాజుగారు శ్రీ సీతారామస్వామి ఆలయమును, రామలింగేశ్వరస్వామివారి ఆలయమును కట్టించిరి. ఇచట రాతితో కట్టబడిన కోటయొకటి కలదు. దీనినిబట్టి ఈ గ్రామమును ముఖ్యపట్టణముగా జేసికొని యే రాజైనను పరిపాలించియుండ వచ్చును. పూర్వము ఈ గ్రామ కరిణీకము ఆంధ్రవారి కుండెడిది. ఇపుడు కొమ్మాలపాటివారే కరిణీకము చేయుచున్నారు. శ్రీ సీతారామస్వామివారి యర్చకులు వైఖానసులు పరుచూరి వెంకటాచార్యులుగారు. రామలింగేశ్వర స్వామివారి అర్చకులు ఆదిశైవులు కుందుర్తి సుబ్బయ్యగారు.

17. కుందుఱ్ఱు

నరసారావుపేట తాలూకాలోని కొమ్మాలపాటికి నైరృతి భాగమున కుందుఱ్ఱు అను గ్రామము కలదు. ఈ గ్రామము పేటకు పదునెన్మిది మైళ్ళ దూరమున నున్నది. పూర్వము ఈ గ్రామమును మాతమ్మనాయుడు రాజధానిగా జేసికొని ఈ ప్రాంతమును పరిపాలించినట్లు కన్పడుచున్నది. ఇందు రాతితో కట్టబడిన కోటయొకటి యున్నట్లు పెద్దలు చెప్పు

దురు. అది యిప్పుడు కన్పింపదు. ఈ గ్రామములో రెండు పెద్ద చెఱువులు కలవు.

ఈ గ్రామ కరిణీకము మిరాశీ మొదట సువర్ణాదాయం వారి కీయబడెను. ఈకుడిలో భావరాజు, తిప్పరాజు, దేవళరాజు అని ముగ్గురు అన్నదమ్ములు గలరు. ఈ ముగ్గురును కరిణీకపు మిరాశీని మూడు భాగములుగ జేసికొనదలచి యీ గ్రామమును కుందుర్తి, కుంచాలపురం, విభురాంపురం అను పేర్లతో మూడుగ విభజించి ముగ్గురును కరణములుగ నుండి ఆ వ్యవహారములు చూచుచుండిరి. ఒక గ్రామమునే మూడు భాగములుగ జేయుటచూడ నిది పూర్వము పెద్ద పట్టణముగా నుండి యుండునని ఊహింపవచ్చును. పెద్దదిగ నుండుటవలననే మాతమ్మనాయని పరిపాలనమున రాజధాని పట్టణముగ నేర్పడుట సంభవించినది. ఇపుడు మాత్రం కుంచాలపురం, విభురాంపురం అను పేర్లు కన్పింపక ఒక కుందుర్తి యను పేరుతోనే వ్యవహరింప బడుచున్నది. ఇపుడీ గ్రామమునకు కందుర్తి వారొకరే కరణములుగ నుండి యున్నారు. ఈ గ్రామమున ఆంజనేయస్వామివారి దేవాలయ మొకటి మాత్రమే కలదు. వైఖానసులు నారాయణం రామాచార్యులుగారు ఆ స్వామిని ఆరాధించు చున్నారు.

18. కోటప్పకొండ

ఇది యొక పుణ్యక్షేత్రము. ఆంధ్రప్రదేశ్ లో ప్రసిద్ధికెక్కిన క్షేత్రములలోనిది యొకటి. నరసారావుపేటకు దక్షిణ

దిక్కున నిది యెనిమిదిమైళ్ల దూరములో నున్నది. ఇది యల్లమంద యను గ్రామములోనిది. ఈ కొండయందు కోటీశ్వరస్వామి యుండును. కోటీశ్వరునే కోటప్ప యందురు. ఈ దేవుడు భక్తజన సులభుడగుటవలన కోటప్పయను వ్యవహారము సంభవించినది. యల్లమంద యనునది కుగ్రామము. ఈ గ్రామమునకు గల ప్రాముఖ్యత యంతయు నిందలి కొండ వలన నేర్పడినదేయని చెప్పవచ్చును. దీని ప్రక్కగా ఓంకార నది (ఓగేరు) ప్రవహించు చుండును. ఈ నది చేజర్ల కొండలో జన్మించినది.

ఈ కోటప్పకొండ 1580 అడుగుల యెత్తుగల కొండ. అంత యెత్తుగల కొండయైనను కోటీశ్వరస్వామి ఆలయము మాత్రము 687 అడుగుల యెత్తులోనే యున్నది. కొండ క్రింద రామలింగేశ్వరస్వామి ఆలయ మున్నది. కోటీశ్వరుని ఆలయముకంటె రామలింగేశ్వరస్వామి ఆలయమే ప్రాచీనమైనది. అర్వాచీనమైనను కోటీశ్వరస్వామి మహిమయే గొప్పది. దేవాలయమునకు పోవుటకు రాతితో కట్టబడిన మెట్లమర్చబడి యున్నవి. అవి చాల యెత్తుగా నుండునట్లు కట్టబడి యుండుటచే కొండయెక్కుట మిగుల ప్రయాస యగుచున్నది. భక్తులు కొండ యెక్కునపుడలసి పోవుచు "చేదుకో కోటయ్య" అని కేకలిడుచు అతి ప్రయాసమీద కొండ నెక్కుచుందురు.

శ్రీస్వామివారీకొండపై భక్తాభీష్ట ఫలదాత యగుచు నావిర్భవించియున్న విషయ మొకింత విచారింతము. పూర్వమొకప్పుడు పరమేశ్వరుడు పార్వతీ సహితుడై తన కుమారుడైన వినాయకుని తొడపై గూర్చుండ బెట్టుకొని మురిపెముతో ముచ్చటలాడుచు, లోకావన పరాయణుడగుటచే నంతలోనే తన దృష్టిని లోకముపైకి మరల్చెను. అపుడు భూలోకము భగవద్భక్తికి దూరమై నాస్తిక వాదముతో గూడి పతితమై యుండెను. అట్టి దుస్థితిని గమనించి పరమేశ్వరు డాలసింపక పతితుల నుద్ధరింప దలపెట్టిన వాడై వెంటనే భూలోకమున కవతరించి యీ కొండ కొమ్మునుండి పరిశీలించు చుండెను. ఈ సందర్భమున నొక భక్తురాలి గాథ యొకటి వివరింప వలసియున్నది. అది వివరించిన గాని భగవంతుడు లింగరూపమును ధరించి యీ కొండపై నిలచి భక్త సులభుడై యుండు విషయము గోచరముకాదు.

ఈ కొండకు సమీపముననే రమణప్ప యను నొక గొల్లవాడు నివసించు చుండెను. ఆతనికి రాధయను కూతురు కలదు. ఈ పిన్నది పదునాలుగేండ్ల వయసు గలదియై యుండెను. ఆమె ప్రతిదినము తన మేకలను కొండమీదికి తోలుకొని పోయి యా కొండ నెత్తముమీద మేపుకొని సాయంకాలమునకు దిగివచ్చు చుండెడిది. ఇట్లుండగా నొకనాడు కొండ శిఖరము మీదకు మేకలను తోలుకొని పోయి తానొక చెట్టుక్రింద

కూర్చుండి భగవంతుని పాటలు పాడుచు తన్మయురాలై యుండెను. ఇంతలో సూర్యాస్తమయమయ్యెను. మేకలు తన చుట్టు చేరి అరవ నారంభించెను. అపుడామె కన్ను తెఱచి చూచునప్పటికి సూర్యాస్తమయమైయుండెను. ఇక నిలుచేరుట యెట్లాయని భీతిచెంది భక్తసులభుడైన పరమేశ్వరుని మనసార ధ్యానించెను. ఆ ప్రాంతముననే యున్న పరమ శివుడు ఈ భక్తురాలికి ప్రత్యక్షమయ్యెను. ఆ బాలిక శంకరుని దర్శించి పాదములపై బడి జంకులేక తనను తన జీవములతో గూడ నిలుచేర్ప వేడుకొనెను. భగవంతుడును అట్లే యనుగ్రహించెను. ఆమె యిలుసేరి భగవంతుని దయ కబ్బురపడుచు మర్నాడుదయముననే పాలుపండ్లు తీసికొని మేకలతో గూడ కొండ శిఖరమునకు వెడలి భగవంతుని ధ్యానింపగా యథారూపముతో నా భగవంతుడు కన్పించెను. ఆమె తాను తెచ్చిన పాలు పండ్లు సమర్పించెను. భగవంతుడు ప్రత్యక్షముగ తానిచ్చిన పదార్థములను సంతృప్తిగ మెసగ నామె సంతసించి యిట్లే ప్రతి దినము చేయనారంభించెను. ఇట్లు చేయుచుండగా కొన్నిదినములకు భగవంతుడు తనవాడయ్యెను. ఒకనాడు తాను తెచ్చియిచ్చిన పదార్థములను భగవంతుడు తినిన పిదప "అయ్యా! నీవు వంటరిగా రాత్రివేళ యీ కొండపై నుండనేల? మా యింటికి దయచేయుము. నిన్నహోరాత్రము లారాధించుకొనుచుండెదను." అనుచు తనకున్న

చనువుతో నిర్బంధించెను. భగవంతుడు సంతోషపడి "బిడ్డా! అట్లే నీ వెంటవచ్చెదను. నీవు ముందు నడచుచుండుము. నీ వెక్కడతిరిగి చూచిన అక్కడ శిలయై పోయెదనని చెప్పి వెంట బయలుదేరెను. ఆమె కొంతదూరము కొండదిగి భగవంతుడు తన వెంటవచ్చుచున్నాడో లేదోయని వెనుకకు తిరిగి చూచెను. వెంటనే భగవంతుడు లింగరూపుడై నిలచిపోయి యా బాలికను గూడ శిలారూపము నొందించెను. నాటినుండియు భగవంతుడచటనే యుండుట సంభవించినది. అక్కడనే పిదప భక్తవరులాలయమును నిర్మించిరి. ఆ గొల్లభామ శిలనుగూడ మనమచట చూడగల్గుదుము. శంకరుడు భక్తుల కోర్కెల నీడేర్చి తనయందు ఎల్లరు భక్తితత్పరులై యుండుటకు గాను ఈ విధముగ నవతరించి యీ కొండమీద స్థిరనివాస మేర్పఱచుకొని యుండెను.

1780 సంవత్సరములోని శాసనమును బట్టిచూడగా మాబలూరి వీరభద్రుడనువాడు గర్భాలయ, అంతరాలయములతో నొక దేవాలయము నిర్మించినట్లుగా గన్పడుచున్నది. తర్వాత భక్తులు మిగిలిన కైంకర్యములను చేయించి యుందురు.

ఇంతకంటె పూర్వము 1153 వ సంవత్సరములోని శాసనమువలన ఈ కోటీశ్వరస్వామికి ఇనుపఱ్ఱెడ్లను దానము చేసినట్లుగా గానవచ్చుచున్నది. 1182 లో నున్న మఱియొక

శాసనములో స్వామివారి పాలకై కొన్ని గొఱ్ఱెలను దానము చేసినట్లు వ్రాయబడి యున్నది.

ఈ శాసనములు మూటిలో నీ స్వామివారిని త్రికోటీశ్వర స్వామి యనుచు పేర్కొనబడినది. దానింబట్టి ఈదానములన్నియు త్రికోటీశ్వరస్వామికే చేయబడినట్లు కన్పట్టుచున్నది. ఈకొండపైన త్రికోటీశ్వరస్వామియు, పాతకోటీశ్వరస్వామియు, బొచ్చు కోటీశ్వరస్వామియు, సాలంకేశ్వరస్వామియు, అడవి రామలింగేశ్వరస్వామియు, పాపవిమోచనస్వామియు గలరు. భగవంతు డిన్నిరూపములతో నేల యుండెనో తెలిసికొన వీలుకాకయున్నది. ఇచట శివరాత్రికి గొప్పయుత్సవము జరుగును. ఆ యుత్సవమునకు వివిధ ప్రాంతముల నుండి వేలాది భక్తులు వచ్చి మ్రొక్కుబడులు చెల్లించు చుందురు. అన్ని యుత్సవములకంటె ఈ దేవుని యుత్సవమందొక ప్రత్యేకత గలదు. ఈ యుత్సవమునకు వచ్చు భక్తులలో నెక్కుడుమంది ప్రభలు కట్టుకొని వత్తురు. ఇచ్చటికి వచ్చు ప్రభలసంఖ్య గణనాతీతముగ నుండును. వారివారి విభవములను బట్టి గొప్ప గొప్ప ప్రభలు కట్టుకొని వచ్చుచుందురు. కటికి బీదవాడైనచో చిన్న ప్రభనైన కట్టుకొని వచ్చును. ప్రభలు కట్టుకొని రానివారి సంఖ్య చాల తక్కువగ నుండును. ఆ శివరాత్రి కొండకు నలు ప్రక్కల కొన్ని మైళ్లదూరము నేల యీనినట్లుగ జన సము

దాయముతోను, ప్రభల సముదాయముతోను నిండి చూడ వేడుక కల్గించుచుండును.

ఈ దేవుని యాలయమునకు వంశపారంపర్య ధర్మకర్తలు నరసారావుపేట జమీందారులైన మల్రాజువారు. ఇపుడు దేవాదాయ ధర్మాదాయ శాఖవారు అచ్చట జరుగ వలసిన యేర్పాట్లు చూచుచున్నారు. ఉత్సవ దినములలో అన్న సత్రము లేర్పఱచబడును.

ఈ స్వామివారికి అర్చకత్వము చేయువారు ఆదిశైవులైన కొండకావూరి అప్పయ్య, వెంకట్రామయ్య, వెంకట కోటయ్య, సాంబయ్య, పిచ్చయ్య, సత్యనారాయణ, రామయ్య, కోటయ్య, ఆదెయ్య, లింగయ్య, సుబ్బారావు, అక్కంభొట్లు, వెంకట్రామయ్య, కోటయ్యశాస్త్రిలు, శేషయ్య అనువారు కలరు. అందరును కొండకావూరివారే. కుటుంబము తామర తంపరగా పెరుగుటచే అనేక గ్రామములను ప్రత్యేక ప్రత్యేకముగ సంపాదించుకొని ఆయా గ్రామములలో జీవనము చేయుచు వంతుల ప్రకార మిచట కైంకర్యములు జరుపు చున్నారు.

కొండ క్రింద నీలకంఠేశ్వరస్వామి, భువనేశ్వరి అమ్మవారు, ప్రసన్న కోటీశ్వరస్వామి, చంద్రమౌళీశ్వరస్వామి వార్ల ఆలయములు కలవు. ఈ యాలయములలో కొండకావూరి

వెంకట్రాయుడు పూజాది కైంకర్యములు జరుపుచుందురు. గొల్లభామ, యామలమ్మ ఆలయములు కలవు. ఆ దేవతలను పూజించువారు యాదవకులస్థులైన మేకల కోటప్ప భార్య భూదేవి.

యల్లమంద గ్రామములో పురాతనమైన శ్రీ కోదండ రామస్వామివారి ఆలయముకలదు. దీని కైంకర్యపరులు శ్రీ వైఖానసులు వినుకొండ హనుమంతాచార్యులు గారు. ఈ గ్రామ మధ్య 1922 మేనెల 11వ తేదీన పాపరాజు రాఘవయ్య గారు శ్రీ సీతారామస్వామి వారి ఆలయము కట్టించి అందు స్వామివారి ప్రతిష్ఠ గావించియుండిరి. ఆంజనేయస్వామి దేవాలయముకూడ మఱియొకటి కలదు, ఈ యాలయములకును హనుమాచార్యులు గారే అర్చనాది కైంకర్యములను నిర్వహించు చున్నారు.

19. కొండకావూరు

ఈ గ్రామము నరసరావుపేటకు దక్షిణమున ఎనిమిది మైళ్ళ దూరమున నున్నది. ఇందు పడమటిదిశన హనుమంతుని విగ్రహము కలదు. పూర్వము ఈ గ్రామ కరిణీకము జల్లె గంపవారిది. తరువాత వారు తమ మిరాశీని యితరులకు విక్రయించినట్లు కన్పడుచున్నది. ఈ గ్రామమును గుఱించి ఎట్టి విశేషములు కన్పింపవు.

ఈ గ్రామములో 1391 కి సంబంధించిన శాసన మొకటి యున్నది. అదియు నీ గ్రామమునకు సంబంధించినది కాదు. కాని దానిలో "తిమ్మరసయ్యంగారను ప్రధానమంత్రి" అను పేరు కనబడుచున్నది. ఈ తిమ్మరసు కృష్ణదేవరాయల మంత్రి కాడు. ఆతడు 16వ శతాబ్దిలోనివాడు. ఈ సమయమున తిమ్మరసయ్యంగారనువారు మఱియొక వైష్ణవమంత్రి ఉండి యుండవచ్చును.

20. కేసానపల్లి

నరసారావుపేటకు ఆగ్నేయముగ రెండుమైళ్ళ దూరములో కేసానపల్లెయను గ్రామము కలదు. కేశియను భోగ స్త్రీ ఈ గ్రామమును కట్టించినట్లు ప్రతీతి కలదు. అందువలన నీ గ్రామము కేశనపల్లియై క్రమక్రమముగా మార్పుచెంది సామాన్య జనుల వ్యవహారములో కేసానపల్లియై యుండ వచ్చును. ఈ గ్రామమున రామలింగేశ్వరస్వామి ఆలయము, చన్నమల్లేశ్వరస్వామి ఆలయము, వేణుగోపాలస్వామి ఆలయములను మూడు దేవాలయములు కలవు. ఇందు చెన్నమల్లేశ్వరస్వామివారిఆలయముశిథిలముకాగా గుడిపల్లి శింగభొట్లను వారు జీర్ణోద్ధారణము చేయించి యుండిరి. వేణుగోపాలస్వామి వారి ఆలయ మొక కుమ్మరి కట్టించి ప్రతిష్ఠ చేయించినట్లు చెప్పెదురు. ఇపుడు విగ్రహము మాత్రమున్నదిగాని ఆలయము లేదు. ఇవిగాక ఆంజనేయస్వామి విగ్రహముకూడ నొకటి యున్నది. ఆ యూరి పొలములో భైరవుని విగ్రహ మొకటి కన్పించును. ఈ గ్రామమునకు కరిణీకం కేసానపల్లి వారిది. రామలింగేశ్వరస్వామి అర్చకులు ఆదిశైవులైన కొండకావూరి సాంబయ్యగారు.

21. కొండవీడు

నరసారావుపేట తాలూకాకు కొండవీడు శిరోమాని కమై ప్రకాశించుచున్నది. ఈ తాలూకా చరిత్రము తలంపునకు వచ్చినప్పటికి మనోనేత్రమునకు కొండవీడే ప్రత్యక్షమగుచుండును. ఈ కొండ లీతాలూకా కీశాన్య భాగమున ప్రారంభమై నైరృతి మూలకు తొమ్మిదిన్నర మైళ్లు ఆక్రమించి యున్నవి. ఈ కొండ నైరృతి దిక్కున బల్లపరపుగానుండి దక్షిణభాగమున కిరీటాకృతిగల్గి క్రమక్రమముగాకొంతదూరము పోవునప్పటికి సన్నకొండయను పేరుతో నంతరించిపోవుచున్నది. ఈ కొండలకు మధ్యభాగమున కొండవీడను గ్రామము కలదు. ఈ గ్రామముయొక్క చరిత్ర పలువురు పలువిధములుగా చెప్పుచుందురు. పురాణములనుబట్టి యొక విధముగను చరిత్రల వలన మఱియొక విధముగను నూహింప వీలుకలుగుచున్నది.

ఈ గ్రామము పురాణ కాలమున నొక పెద్ద పట్టణముగా నుండి విదర్భదేశమునకు రాజధాని నగరముగా నుండెడిదనియు. ఇదియే కుండినవగరమనియు చెప్పవీలగుచున్నది.

ఈ నగరమును రాజధానిగా జేసికొని భీమ భూపాలుడును, భీష్మక మహారాజును పరిపాలనము చేసియుండినట్లు తెలియుచున్నది.

ఇక చరిత్రకారులు కొండవీడు, కుండిన నగరము కాదనియు, అది తెలంగాణాలోని బీరు అను ప్రదేశమున కుండిన పురము కలదనియు, అదియే భీష్మకునకు రాజధాని నగరమనియు చెప్పుచున్నారు. చరిత్రకారు లట్లు చెప్పుచున్నను, లోకవాడుకను బట్టియు, అచటివారు కుండినపుర మనుటకు చూపు అనేక నిదర్శనముల వలనను, ఆంధ్రమహాకవులు వ్రాసిన గ్రంథములలో దీనినే కుండినపురముగ నిర్దేశించి చెప్పుట వలనను, అనేక శాసనముల యందు కొండవీటి ప్రాంతమే కుండిన నగరమని కన్పించుచున్నందునను, ఇది కుండిననగరమనుటలో విప్రతిపత్తి యేమియు కాన్పింపదు.

ఈ కొండవీటి పట్టణము పూర్వకాలమున శింగిస్కాను పేటనుండి యామలూరులోని ముండ్లమూరెమ్మ కొండవరకు వ్యాపించియుండునని అచటివారు చెప్పుచుందురు. ఈ పట్టణములో 18 పేట లుండెడివట.

12వ శతాబ్దారంభముననే యిచట గణపతి రాజులలో నొకరగు విశ్వంభర దేవునిచే కోట కట్టింపఁ బడుటవలన అంతకు పూర్వమేయిది రాజధాని నగరముగ నున్నట్లు కనబడుచున్నది. 1238 వ సంవత్సరపు శాసనము వలన గూడ ఇది

రాజధాని నగరమని తెలియవచ్చుచున్నది. కొన్ని శాసనములలో ప్రోలయ వేమారెడ్డి అద్దంకిని, కొండవీటినిగూడ పరిపాలించి యుండెనని వ్రాయబడి యుండెను. తర్వాత అనవేమారెడ్డి ధరణికోటను పాలించుచు తన రాజధానీ నగరమును కొండవీటికి మార్చినట్లు అనేక దృష్టాంతము లున్నవి. కాని యెప్పటినుండి యిది రాజధాని పట్టణముగ రూపొందినది, యే రాజుతో ప్రారంభమైనది నిర్ధారణగ చెప్పుటకు అవకాశములు కన్పింపకున్నవి. ఏది యెట్లున్నను నిది కొంత కాలము రాజధాని పట్టణముగ నుండి మహోన్నత స్థితినంది యున్నదని చెప్పుటకు మాత్రము సంపూర్ణావకాశములున్నవి.

కొండవీటి రాజ్యమొకప్పుడు నేటి గుంటూరు, కృష్ణా, నెల్లూరు, కర్నూలు, గోదావరి జిల్లాలకు గూడ వ్యాప్తమై యున్నట్లు కొన్ని శాసనములలో వాడబడిన బిరుదపదములు మున్నగు వానివలన నిర్ధారణ యగుచున్నది. ఈ రాజ్యములో నాల్గు గిరిదుర్గములు, పదునాలుగు సీమలు, రెండువేలకు పైగ గ్రామములు ఉండియున్నట్లు విశదమగుచున్నది. ఇందలి నాలుగు గిరిదుర్గములు కొండవీడు, బెల్లంకొండ, వినుకొండ, నాగార్జునకొండ యనునవి.

రెడ్డిరాజులు 1328 నుండి 1427 వఱకు నూరు సంవత్సరములు రాజ్యముచేసియుండిరి. తరువాత ఈ రాజ్యము గోల్కొండ నవాబుల వశమయ్యెను. అటుపిమ్మట (శ్రీ) కృష్ణ

దేవరాయలు కొండవీటి కొండను స్వాధీనము చేసికొనెను. తల్లికోట యుద్ధానంతరమున 1565 లో ఈ కోట తిరిగి తురకలకు స్వాధీనమాయెను. వారికి స్వాధీనమైన పిమ్మట ప్రథమమున 'మూర్తిజాఖాన్' అను నాతడు పరిపాలనమునకు వచ్చెను. ఆ సమయమున కొండవీటిరాజ్యము మూర్తిజాఖాన్ రాజ్యమను పేరుతో వ్యవహరింపబడినట్లు కన్పడుచున్నది. మహమ్మదీయులపాలన లోనే యీ రాజ్యమును విభాగించి జమీందారులకు పంచిపెట్టబడినట్లును కన్పడును.

ఇట్లు జమీందారుల పరిపాలనము జరుగుచుండగా ఆ సమయమున పరిపాలకుడుగనున్న నాజరుజంగు అను మహమ్మదీయ ప్రభువు కొండవీడు సీమను ఫ్రెంచి వారికి స్వాధీనము చేసియుండెను. కాని మహమ్మదీయ అమీనులే పాలకులుగ నుండిరి. ఫ్రెంచివారికి స్వాధీనము చేయబడినపిమ్మట వారు కొండవీటనుండక పాత గుంటూరులో నొక కోటను కట్టుకొని రాజధానిని అచటికి మార్చుకొనిరి. ఈవిధముగనే డెబ్బదిమిది సంవత్సరములు గడచునప్పటికి కొండవీడు తిరిగి మహమ్మదీయుల స్వాధీనములోనికి వచ్చెను. అప్పుడు హైదరాబాదు నవాబు 'జిల్లాదారు' అను పేరుతో నొక యుద్యోగిని కొండవీటికి పంపి, వానిద్వారా పాలనము నిర్వహించుచుండెను. ఈ విధముగా 1786 వఱకు జరిగెను. ఇట్లుండగా హైదరాబాదు నవాబు కొండవీటి

సీమను 1788 లో ఇంగ్లీషువారికి స్వాధీనముచేసి యుండెను. అప్పటితో మన రాజుల యొక్కయు, మహమ్మదీయుల యొక్కయు పరిపాలనము తొలగి ఇంగ్లీషువారి వశమయ్యెను. అంతట ఇంగ్లీషువారు పరిపాలనా సౌకర్యమునకై తామాక్రమించిన దేశమును జిల్లాలుగా విభాగించి యుండిరి. ఆ విభాగములో కొండవీడు ఒక జిల్లా కేంద్రనగరముగా నుండెను. తరువాత జిల్లాను గుంటూరుకు మార్చిన పిదప నిది కొన్నాళ్లు తాలూకా నగరముగ నుండెను. గుంటూరు జిల్లా 1794 లో ప్రారంభమయ్యెను. కొద్దికాలము మాత్రమే కొండవీడు తాలూకాగా నుండెను. పిమ్మట తాలూకా గూడ నచటి నుండి మార్చబడి సామాన్య గ్రామముగా నుండుట సంభవించెను. అంతటి మహోన్నత స్థితినందిన కొండ వీడు నేడు కుగ్రామమై కని ఆనందించుటకు వీలుకాక విని ఆనందించుటకు మాత్రమే యుపయోగ పడునదై యున్నది. సర్వము కాలమునకు లోబడక తప్పదుగదా?

ఇట్టి కొండవీటి యొక్క వైభవ విశేషము లెట్టివో ఇక పరికించి చూతము.

కొండవీడను గ్రామము కొండవీటి కొండలకు మధ్య భాగముననుండి రెడ్డి రాజులకు ముఖ్య పట్టణమై యొకనాడు వెలుగొందిన దనుటలో సందియము లేదు. ఈ కొండవీటి కొండల యందనేక శిఖరములు గలవు. ఆ శిఖరములను జోళ్లు

అందురు. అందు శిఖరములు లెక్కకు ఏబది వఱకుండునని చెప్పుదురు. అందు ముఖ్యమైనవి మూడు నాలుగు శిఖరములు కలవు. అందు మూరు వేంకటేశ్వర శిఖరమొకటి. దీనిపై వేంకటేశ్వరస్వామి ఆలయము కలదు. ఈ దేవాలయ మెప్పుడు కట్టబడినదో తెలియదు. ఈ యాలయమందు వివాహము లధికముగా చేయబడు చుండెడివట. ఈ శిఖరము దగ్గరనే కన్యకల బావియను నొక బావికలదు. దేవకన్యకలు వచ్చి అందు స్నానముచేసి వెళ్ళుచుండెడి వారని వాడుకకలదు. అచట కొన్ని దేవకన్యకల ప్రతిమలును గలవు.

రెండవ శిఖరమును ఆదంసఫీదు శిఖరమందురు. దీనినే రుద్రపాద శిఖరమనియు చెప్పుదురు. ఇచట శిలములైన కొన్ని శివాలయములు కలవు. దీనికి దక్షిణమున రుద్రపాద మనబడెడు పాదాకారముగనున్న ఒక గుంటయున్నది. దీనిలో అన్ని కాలములయందును నీరుండును. ఈ నీరు కృష్ణానదినుండి వచ్చునని చెప్పుదురు. ఇచట మహమ్మదీయు లొక దరగాను కట్టించిరి.

మూడవది బొల్లమూరు శిఖరము. ఈకొండల కాగ్నేయ భాగమున నీ శిఖరమున్నది. అన్ని శిఖరములలోను నిదియే యెత్తైన శిఖరము. దీనిపై కెక్కుట చాలకష్టము. ఏబది శిఖరములలోను నలువదియొక్క శిఖరముల పేర్లు మాత్రమే 1876 లో ఆ గ్రామ కరణములు వ్రాసియున్నారు.

ఈ కొండలమీద ఆఱుగుహలు కలవు. 1. బైరాగుల గుహ. 2. మేకలగట్టు. 3. బిలంనరసింహునిగుహ. 4. ఏదెల్ల గుహ. 5. మేడలబండగుహ. 6. చీమకొండగుహ. ఈ గుహలు గయిలు అనియు వ్యవహరింప బడుచున్నవి.

ఈ కొండపైన పడమటి దిక్కున దాదాపు మూడు మైళ్ళ మించిన చదరముగల సమ ప్రదేశముకలదు. ఈ చదరమునందు వెదుళ్ల చెఱువు, ముత్యాలమ్మ. (కూనలమ్మ) చెఱువు, పుట్టాలమ్మచెఱువు అను మూడు చెఱువులున్నవి. వెదుళ్ల చెఱువునకు పడమటి భాగమున ముప్పది స్తంభముల మంటపమున్నది. అది అయిదుగజముల వెడల్పు, ఇరువది గజముల పొడవునుండును. ఈ మంటపము రెడ్డిరాజుల కాలములో భోజనశాలగ నుపయోగింప బడెనట. అందు శిథిలములైన రాజమందిరము లనేకములు కలవు. పుట్టాలమ్మచెఱువు గట్టుమీద రెండు దిగుడు బావులున్నవి. దీని కీశాన్యదిక్కున శివాలయమొకటి కలదు. ఈ ఆలయములో పదునైదు శాసనములును, రెండు మంటపములును గలవు ఆచదరమందే నేతి కొట్టొకటి కలదు. పూర్వము రెడ్డిరాజుల కాలములో నిందు నేయి భద్ర పఱచెడివారట. దీనికి తూర్పుదిక్కున నిరువది నాలుగు, ఇరువదిరెండు స్తంభములు కలమండపములు రెండున్నవి. ఇచటనున్న శివాలయములో, గణపతి, సుబ్రహ్మణ్యస్వామి, నాగకన్యకల విగ్రహములుకలవు. ఈ మండపములకు

సమీపముననున్న ఒక గుహదగ్గర పానవట్టముతో గూడిన శివ లింగము కన్పించుచుండును. ఈ చదరమునకు చుట్టుగోడలు కలవు. కొండమీదికెక్కు మెట్లదగ్గర శిథిలమైపోయిన నరసింహ స్వామి ఆలయముకలదు. అందలివిగ్రహము వెలుపలపారవేయ బడియున్నది. ఇచట ఒకబంగళాయును, దానికాగ్నేయదిక్కున శిథిలమైన ఒక ఆలయమును, పడమటి దిక్కున ఒక మంటప మును కలవు. బంగళానుండి తిరిగివచ్చుచోట వేరొక మంట పము, రెండంతస్థుల ద్వారము కలదు. ఈ బంగళా నానుకొని తూర్పుదిక్కున పదునాఱు స్తంభముల రెండు మంటపములు కలవు. ఈ మంటపములనే వేమనయోగి మంటపము లందురు. ఇచటికి తూర్పుగా అంబ దేవాలయమును, మెట్లకు దక్షిణ మున గంజికాలువయు, గంగాధర రామేశ్వరాలయము కన్పడు చుండును. ఈ దేవాలయమున (శ్రీ) రంగ రాయల శాసన మొకటి యున్నది. ఇందు మోరంపూడి గ్రామ కాపరస్తులు నిత్య నైవేద్య దీపారాధనలనిమిత్తం భూములిచ్చినట్లు వ్రాయ బడియున్నది. రాజమందిరము దగ్గర రెండు ఆలయములు శిథిలములైనవి కనుపించును. కొండనడుమ గుహయందు కొండ సింగరయ్య విగ్రహ మొకటి యున్నది. కొండపైన రెండు ప్రార్థనామందిరములు మహమ్మదీయులవి కనుపించును. అచట నున్న 1523వ సంవత్సరపు శాసనమువలన నవులూరి పోతరాజు దేవాలయ మొకటి యున్నట్లు తెలియుచున్నది కాని అది యిప్పుడు కన్పింపదు.

కొండ దిగువ భాగమున నిపుడు కోటయని పిలువబడు చోటున గోపీనాథస్వామి దేవాలయముండెడిదట. ఆ ఆలయ స్తంభములు చెక్కడపు పనిచే నెంతయో రమ్యముగా నుం డును. ఈ ప్రాంతముననే పూర్వము వెయ్యికాళ్ళ మంటప ముండెడిదట. ఆలయద్వారమున కిరుప్రక్కల రెండుశాసనము లును, రాతి ధ్వజస్తంభముపై నొక శాసనమును కలవు. ఈ శాసనములు సదాశివరాయలు కాలమున 1565 వ సంవ త్సరమున వ్రాయింపబడినవి. ఈఆలయమునకు నాలుగంతరాళ ములు కలవు. దీని సమీపములో పెద్ద నంది విగ్రహమున్నది. దీని తోక దగ్గర పెద్ద రంధ్రము కనుపించుచుండును. ఈ నంది క్రింద బంగారము, ధనము నుండగా దొంగలు కనిపెట్టి రంధ్రము చేసి అందలి ధనమపహరించిరని వాడుకగలదు. ఇచటనే లం కెల బావియు, 'వసంతఘర్' అనురాజమందిరమును నుండెడి వట. అవి యిప్పుడు కాన్పింపవు. అచ్చటి వారా ప్రదేశము లను జూపి ఆ పేర్లు చెప్పుచుందురు. ఇచటనే గృహరాజ మేడ యనునది పూర్వముండునట్లు చెప్పుదురు. ఇపుడా ప్రాంత మంతయు దిబ్బయై పోయినది. ఇటీవల అనగా 1898 వ సంవ త్సరములో ఈ ప్రాంతమున నున్న ఒక పొలములో కందిమళ్ళ మల్లయ్య అనువానికి వీరభద్రస్వామి లింగము దొరకగా అచ టనే ఆ లింగమున కాలయ నిర్మాణము చేయబడినది.

రెడ్డిరాజుల కాలమున కట్టింపబడిన రంగనాయకస్వామి గుడియొకటి ఈ ప్రాంతముననే కన్పించును. అందిప్పుడు శేషపాన్పు మాత్రము చెక్కుచెదరకుండ నున్నది. ఇచట మాణిక్యారావు కోనేరు కలదు. ఇది కర్ణాటుల కాలములో మాణిక్యారావు ఖిల్లేదారుగా నుండి యీ కోనేరును త్రవ్వించి యుండెను. ఇచట నింకను కొన్ని గుండములు కన్పించుచుండును. యుద్ధములలో రాజులు మరణించగా వారి భార్యలీ గుండములలో పడి మరణించుటకుగాను త్రవ్వింపబడినవని అచ్చటివారు చెప్పుదురు. ఇచటనే పూర్వము రాజగృహము లుండెడివని వాడుక. గృహరాజమేడ యుండు దిబ్బమీద జడ్డిగం బావి కలదు. కొలది దూరము సాగగా పెద్ద చెఱువును, దానిలోపలి భాగమున తోటలును నున్నవి. ఈతోటలు పెదదాసరయ్య, చినదాసరయ్య అనువార్లచే నాటబడినవని చెప్పుదురు. ఆ చెఱువు కట్టమీద వేణుగోపాలస్వామి ఆలయముండెడిదట. కొండ సమీపములో తిరుమల లక్ష్మీనరసింహస్వామివారి ఆలయమును, దానికి పడమట రామేశ్వరస్వామి ఆలయమును, తూర్పుదిక్కుగ మదనగోపాలస్వామి ఆలయమును నున్నవి. వీనిలో రామేశ్వరస్వామివారి ఆలయము కొలిచలముల అచ్చన్న గారిచే 1665 వ సంవత్సరమున నెలకొల్పబడినట్లు ఒక శాసనమువలన దెలియవచ్చుచున్నది. ఈ గ్రామమునకు త్తరభాగమున వీరభద్రాలయమును, దానికు త్త

రముగ పాదిలె రహిమాన్ సాహెబుగారి దర్గాయును, ఇంకను ఉత్తరముగ పత్తెఖాను మసీదును, దాని దగ్గరనే 'సుర్ఖానా' మసీదును, దానికి దక్షిణమున నల్లమసీదు, పడమట గుమ్మల్ మసీదు, జామఖానామసీదులు కలవు. ఇప్పటికి దాదావు నూటయేబది సంవత్సరముల క్రిందట కోట యనబడు గోపీనాధ పురమున నొక మహమ్మదీయుని యిల్లు త్రవ్వుచుండగా నందు వెన్నముద్ద కృష్ణుని విగ్రహము కనుపించెను. అప్పటి ప్రభువైన మానూరి వెంకట కృష్ణమ్మగారు తమ గ్రామములో ప్రతిష్ఠించుటకు తీసికొనిపోవుచుండగా సింగిసాకనుపేటకు వెళ్లునప్పటికి బండి కదలక ఆగిపోయెనట. అప్పటికి ప్రొద్దు గ్రుంకినందున ఆరాత్రి కక్కడనె పడుకొనిరి. ఆనాటిరాత్రి స్వప్నమున భగవంతుడు కన్పించి "నన్నీగ్రామముననే ప్రతిష్ఠింపవలసిన" దని చెప్పెనట. అపుడు వెంకటకృష్ణమ్మగారు ఆ గ్రామముననే ఆలయము కట్టించి ప్రతిష్ఠ జరిపెను. ఈ కృష్ణ విగ్రహము ముద్దులు మూటగట్టుచుండును. ఇపుడును ఆ దేవునకు పూజాపురస్కారములు జరుగుచున్నవి.

మఱియు ప్రోలయ వేమన్న శాఘవాలయమును, నాదెండ్ల గోపయ్య రఘునాయకుల ఆలయమును కట్టించినట్లు శాసనములవలన దెలియుచున్నది. అవి యిప్పుడు ప్రత్యక్షగోచరములు కాకున్నవి. ఈ గ్రామమున కట్టింపబడిన దేవాలయములకును శిథిలములైన ఆలయములకును పరిమితి లేను

పించదు. ఇక్కడ పడిపోయిన దేవాలయ భాగములు అనేక గ్రామములకు తీసికొనిపోయి అక్కడ అవసరములైన మండపాదులు కట్టుకొని యుండిరి.

కొండవీటి కొండలమీద చుట్టు కోటగోడలున్నవి. ఈ కోట యేకాలమున నెవరిచేత నిర్మింపబడినది తెలిసికొనుటకు తగిన ఆధారములు లేవు. కాని కొండవీటి దండకవిలెయందు ఈ కోట దాదాపు ఎనిమిదివందల సంవత్సరముల క్రిందట అనగా 12వ శతాబ్దమున విశ్వంభర దేవునిచే కట్టింపబడినట్లు వ్రాయబడియున్నది. ఈతడు ఒరిస్సాదేశపురాజు. ఈ విశ్వంభరుని నల్గురు కుమార్లలో పెద్దవాడైన గణపతిదేవుడు కొండవీడు ప్రాంతమున పదునాల్గు గ్రామములను బ్రాహ్మణులకు అగ్రహారములుగ నిచ్చెనని చెప్పుదురు. కొండ కుత్తర దిక్కున నైదు కోట లొకేచోట నున్నవి.

ఈ కోటలలోనికి వెళ్లుటకు రహస్యమార్గము లున్నవట. కొండక్రింద పడమర దిక్కున ఒకటిన్నరమైలు చుట్టుకొలత గల యొక కోటగలదు. ఈకోటచుట్టు ఏబదిగజముల వెడల్పు పది అడుగుల లోతు గల ఒక అగడ్త గలదు. ఈ కోటకు నాల్గు దిక్కులయందు బురుజులు కలవు. రామయభాస్కరుడీకోటను కట్టించి గోపీనాథుని ప్రతిష్ఠించి యాదేవుని పేరుతో నా గ్రామమునకు గోపీనాథపురమని పేరుపెట్టెను. ఈ కోటయొక్క ఉత్తర సింహద్వార మిప్పటికినిగలదు. దీనికి ప్రక్కనే

రామయ భాస్కరుని గురించి వ్రాసిన పద్యమొకటి శాసనములో కనబడుచున్నది. దక్షిణమున నాదెండ్ల గవనియను మరియొక ద్వారముండెడిది. అది శిథిలమైపోయినది. ఉత్తర దిక్కున ప్రోలయ వేమారెడ్డిచే కట్టించబడిన పుట్టకోటయనునది యొకటియున్నది. ఆ ప్రాంతముననే కుండినపురముండెడిదని చెప్పుదురు. ఇచట నగరేశ్వరస్వామి దేవాలయమొకటి యున్నట్లు శాసనమువలన తెలియవచ్చుచున్నది. గుంటూరు నరసింహస్వామి గాలిగోపురముననున్న 1404 వ సంవత్సరములోని శాసనము నగరేశ్వరదేవుని గూర్చియు ఆ యాలయములోని మంటపమునుగూర్చియు చెప్పుచున్నది. నగరేశ్వరదేవాలయమున పెనుగొండ రాయపూడి వీరిశెట్టి ఒక స్తంభమును వేయించినట్లు ఒక శాసనమున కలదు. ఇట్టి విశేషములతో గూడి పూర్వమీ పట్టణము చెప్పనలవికాని యున్నతస్థితి నందియుండెను.

22. గన్నవరము

నరసారావుపేటకు ఆగ్నేయమున నిరువదిమైళ్ళ దూరములో నీ గ్రామమున్నది. సాగి గన్నమనీడు ఎద్దనపూడి, పోలూరు గ్రామములనుండి కొంతభూమిని ప్రత్యేకించి తనపేర నొక గ్రామమును నిర్మించి దానిని బ్రాహ్మణులకు అగ్రహారముగా నొసంగెను. గన్నమనీని పేరుపెట్టబడుటచేత ఈగ్రామము గన్నవరమయ్యెను. అగ్రహారీకులు నశించుటచే రాయలవారు

ఈ యగ్రహారమును రాయన భాస్కరునకు కరిణీకాగ్రహారముగా నిచ్చియుండెను. రాయన భాస్కరుడు కొప్పరాజు వారికి తాత్కాలికముగ కరిణీకమొసంగి, పిమ్మట తమబంధువులైన దమ్మాళపు శ్రీనివాసుల ప్రపౌత్రులును, సూరప్ప పౌత్రులును, సర్వప్ప పుత్రులునగు వెంకటకృష్ణయ్య, చినపాపయ్య సీతారామయ్యగార్లకు ఈ యగ్రహారమును కరిణీకము క్రింద శాశ్వతముగా నొసంగెను.

ఈ గ్రామమున వేణుగోపాలస్వామి దేవాలయ మొకటి కలదు. మరియు క్షయనామ సంవత్సర మాఘమాసములో కాళహస్తి పిచ్చయ్యగారను కమ్మవారు నూతనముగా శివాలయము కట్టించి ప్రతిష్ఠ జరిపించి నిత్య నైవేద్య దీపారాధనలకు కొంతభూమి నిచ్చి యుండిరి. వేణుగోపాలస్వామివారి అర్చకులు వైఖానసులగు వేదాంతం సీతారామాచార్యులు, పున్నమాచార్యులు మున్నగువారు. శివాలయం అర్చకులు ఆది శైవులు నాదెండ్ల రామేశ్వరగురుక్కళ్.

23. గోరిజవోలు

నరసారావుపేటకు తూర్పున ఎనిమిది మైళ్ళ దూరమున ఈ గోరిజవోలు అను గ్రామము కలదు. అచ్యుతరాయలు ఈ గ్రామమును తాళ్ళపాక తిరువెంగళనాథయ్య గారికి అగ్రహారముగా నిచ్చియుండెను. 1550 నాటికి ఈ వంశీకులు శిస్తులు

చెల్లింపజాలక వదలిపెట్టుటవలననో, మరేకారణము వలననో ఈ యగ్రహార మెవరి క్రిందను లేక యుండుట సంభవించెను. అనంతరము శ్రీ రంగరాయలు రాజ్యము చేయునపుడు ఈ గ్రామమును విరూపాక్షయ్య అనువారికి అగ్రహారముగ నిచ్చెను. తరువాత ఈ గ్రామము మానూరివారి జమీలోనికి వచ్చెను. ఈ గ్రామ కరిణీకము గుండ్లవారిది. వీరే పావడివారు. ఈ గ్రామమున ఆంజనేయస్వామివారి ఆలయము కలదు. ఆ దేవుని అర్చనాది కైంకర్యములను వైఖానసవరులైన పరాంకుశం రంగాచార్యులుగారు నిర్వహించుచున్నారు.

24. గొట్టిపాడు

ఓంకారనది యొడ్డున (ఒగేరు) గొట్టిపాడు అను గ్రామమున్నది. దీనిని కంచరగొట్టి పాడనియు నందురు. పూర్వము నుండి యీ గ్రామమున కంచర పనివాండ్రు అధికముగ నుండుటచే నీ పేరు వచ్చియుండును. ఈ గ్రామ కరణీకపు మిరాశీని గోపరాజు రామన్నగారు 1145 వ సంవత్సరములో ఆధానపువారి కిచ్చియుండెను. గొట్టిపాటికి కరణములగుటచే అప్పటినుండియు గొట్టిపాటి వారని పిలువబడుచుండిరి.

ఆ కాలముననే శేషు అను కోమటి ఆ గ్రామమున గుడి కట్టించి అందు శ్రీశైలలింగమును ప్రతిష్ఠించి ఆ స్వామికి మల్లేశ్వరుడని పేరుపెట్టెను. కృష్ణదేవరాయలు 1515 లో వీర

భద్ర గజపతిని పట్టుకొని ఆతని రాజ్యమును స్వాధీనపఱచుకొని వినుకొండ సీమలోని రాయన భాస్కరునకు స్వాధీనము చేసెను. అప్పటినుండి ఈ గ్రామము భాస్కరుని పరిపాలనలోనికి వచ్చెను.

కర్నాటకుల రాజ్య పాలనానంతరము విభరాం పాదుషా రాజుగానుండి ఈ ప్రాంతమునకు గుంటుపల్లి వారిని, భాస్కరుని వారిని, దేశపాండ్యాలుగ నియమించెను. అప్పటినుండి యీ గ్రామము దేశపాండ్యాల అధీనము లోనికివచ్చెను. తరువాత వారినుండి ముత్త రాజయ్యగారికిని, పిమ్మట వారి దగ్గర నుండి మల్రాజుసూరన్న గారికిని సంక్రమించెను.

ఈ గ్రామమందలి మల్లేశ్వరాలయము శిథిలముకాగా మిరాశిదారుడైన కృష్ణంరాజు 1781లో దేవాలయమును తిరిగి కట్టించెను. కాని పునఃప్రతిష్ఠ జరుగకముందే కృష్ణరాజు మరణించెను. అపుడు దండాపెరుమాళ్ళు అనుకాపు లింగమొకదానిని దెచ్చి ప్రతిష్ఠింపజేసెను. అటనుండి విశ్వేశ్వరస్వామియని వ్యవహరింపబడెను. ఈ గ్రామమున పురాతనమైనది ఆంజనేయస్వామి దేవాలయమొకటి కలదు. ఆంజనేయస్వామికి శ్రీనివాసుల వేంకటాచార్యులు, రాఘవాచార్యులు, హనుమాచార్యులు అర్చనాది కైంకర్యములను నిర్వహించుచున్నారు. విశ్వేశ్వరస్వామి వారికి ఆది శైవులైన తుర్లపాటివారు అర్చకులుగా నున్నారు.

25. గోవిందపురము

నరసారావుపేటకు ఆగ్నేయమున ఆరుమైళ్ళ దూరమున గోవిందపురమను గ్రామముకలదు. పూర్వ మీ ప్రదేశమున మహర్షులుండెడివారట. వారే భీమేశ్వరుని ప్రతిష్ఠించి స్వయముగ పూజించు చుండెడివారు. దేవకన్యక లీగ్రామమున పుష్పగంధి అను కాలువను నిర్మించి జలక్రీడలు సల్పెడివారని ప్రసిద్ధిగలదు. తరువాత 1123 లో నిమ్మానాయకుడు ఆ భీమేశ్వరునకు ఆలయమును కట్టించి, ఆ ప్రదేశమున నొక గ్రామమును నిర్మించి దానికి గోవిందపురమని పేరిడినట్లు ఒక శాసనము వలన తెలియవచ్చు చున్నది. పిమ్మట 1168 సంవత్సరములోని శాసనముల వలన ఈ దేవునకు భూము లిచ్చినట్లు కనబడుచున్నది.

2 వ శాసనం. 1168 సంవత్సరం కులోత్తుంగ రాజేంద్ర చోడరాజు రాజ్యముత్తరోత్తరాభి వృద్ధిగా కొమ్మననాయకుని కుమారుడు బాదినాయకుండు శ్రీవి (శ్రీ) భీమేశ్వర మహాదేవరకు అఖండ దీపమునకు నిచ్చిన గొఱియలు 55.

1 వ శాసనం. 1165 వ సంవత్సరమున గొడవర్తి సూరపనాయకుని కొడుకు శ్రీవి(శ్రీ) భీమేశ్వర మహాదేవరకు అఖండదీపమున కిచ్చిన గొఱియలు 55. ఈ రెండు శాసనముల లోను సంవత్సర భేదమున్నది. దాతల నామములలో భేదము

కలదు. దానోద్దేశ్యము మటుకు ఒకటిగానున్నది. ఇచ్చినభూమియు సమానమే. క్రోవి అను పదము రెండు శాసనములలోను నున్నది. కనుక ఈ రెండును నొకటే యని చెప్పవీలగుచున్నది. రెంటికిని మూడు సంవత్సరముల తేడా మాత్రమే కలదు. ఈ మూడు సంవత్సరములలోనే ఒకేయుద్దేశ్యము నిర్వహించుటకు ఇరువురు దానమిచ్చుట పొసగనేరదు. ఒకటి కానిమ్ము, రెండు కానిమ్ము 1165-68 ప్రాంతములో భీమేశ్వరస్వామి కార్య కలాపములు నిర్వహించుటకు కొంతభూమి యేర్పడినట్లు స్పష్ట మగుచున్నది.

1145 వ సంవత్సరమున గోపరాజు రామన్నరాయసం వీరరాజు అనువారికి ఈ గ్రామ కరిణీక మిచ్చియుండెను. 1238 వ సంవత్సరమున కాకతీయ రాజులు పూర్వము ఋషులుండు ప్రదేశమున జగన్నాథస్వామి ఆలయమును కట్టించి ఆ స్వామి పేరుతో జగన్నాథపురముగా మార్పుచేసిరి. 1695వ సంవత్సరమున కోడెవాండ్లను లింగబలిజలు భీమేశ్వరాలయము శిథిలము కాగా తిరిగి కట్టించి యందు స్వామి వారిని ప్రతిష్ఠించిరి.

సంతుబందీలు కావించి కొండవీటిని విభజించినపుడు ఈ గ్రామము మానూరివారి వంతుకు వచ్చెను. వారినుండి తరువాత వాసిరెడ్డివారు విక్రయించుకొనిరి. అటుపిమ్మట యడవల్లి అగ్రహారీకులైన పోతుకూచి రాములనువారు తిరిగి భీమే

శ్వరాలయమును కట్టించి ప్రతిష్ఠ చేసినట్లు కన్పడుచున్నది. ఒక కవి చాటు పద్యమున నిట్లు వర్ణించియుండెను.

"సీ॥ వనధికన్నిక ప్రేమఁ దనయఁ జూచిన చోటు
అఖిల విద్యలకెల్ల అందుబాటు
సకల తపోనిధుల్ సంచరించిన చోటు
వెలయంగఁ బ్రజలకు వేల్పుటావు
ముని సేవ్యుడగు జనార్దను డేలు నగరంబు
ప్రథిత భీమేశ్వర ప్రాంగణంబు"

ఈ పద్యమువలన పైన వ్రాసిన విషయములు చాలవఱకు నిరూపణ యగుచున్నవి. ఈ గ్రామము పై విషయములనుబట్టి పవిత్ర స్థలమనియు, చారిత్రక ప్రసిద్ధమైనదనియు తేలుచున్నది.

జగన్నాథస్వామివారి అర్చకులు వైఖానసులు బృందావనం వెంకటాచార్యులుగారు. భీమేశ్వరస్వామి అర్చకులు ఆదిశైవులు కొండకావూరి పెదపిచ్చయ్య, చినపిచ్చయ్య, గురునాథం, సుబ్బయ్య గారలు.

26. గుంటగార్లపాడు

ఇది నరసారావుపేటకు ఉత్తరమున రెండుమైళ్ల దూరమున నున్నది. ఈ గ్రామముయొక్క చెఱువుకట్ట మీాద రెండు

శాసనములు కన్పించుచున్నవి. ఈ గ్రామమునకు సంబంధించినవి కావు. ఇదియొక అగ్రహారము. ఏ ప్రభువు ఎవరికి దానముగ నిచ్చినది తెలియరాదు. ఈ గ్రామమున ఆంజనేయస్వామివారి ఆలయము కలదు. ఆ స్వామివారి అర్చనము జరుపువారు వైఖానసులు. రొంపిచర్ల నరసింహాచార్యులు గారు.

27. గ ణ ప వ ర ము

ఈ గ్రామము నరసారావుపేటకు ఆగ్నేయమున పది మైళ్ల దూరమున నున్నది. పూర్వమొకప్పుడు ఇది జైనుల పట్టణముగా నుండెను. గణపతిరాజు రాజ్యము చేయుకాలములో నా ప్రభువే స్వయముగవచ్చి ఈ గ్రామమునకు పశ్చిమ భాగమున సోమేశ్వరాలయము కట్టించి అందు స్వామివారిని ప్రతిష్ఠించెను. అప్పటినుండి ఈ గ్రామము గణపవరము అను పేరుతో వ్యవహరింప బడుచు వచ్చెను.

తరువాత మల్కి ఇబ్రహీం కాలమున ఈ గ్రామము 'జామాఖాన్' అనువానికి జాగీరుగ నీయబడెను. ఆ సమయమున గ్రామమునకు ఆగ్నేయ దిశయందు ఒక మసీదును, ఉత్తరమున నొక బావిని, దానికుత్తరమున నొక గుమ్మటమును నిర్మించియుండెను. తర్వాత ఈ గ్రామము మానూరి వారి జమీలోనికి వచ్చెను. మానూరివారి పాలనలో 1783 వ సంవత్సరమున నీ గ్రామములోని పెద్దకాపు వీరభద్రస్వామిని

భద్రకాళీ సహితముగ, దేవాలయము కట్టించి అందు ప్రతిష్ఠింప జేసిరి. సోమేశ్వరాలయములో లింగము విచ్ఛిత్తికాగా అందు మజిల సోమేశ్వరుని ప్రతిష్ఠించిరి.

ఆ సమయముననే సిద్ధ బసవన్నయను కంసాలి సోమేశ్వరాలయమున నొక భాగమున పార్వతీదేవిని ప్రతిష్ఠించెను. నాదెండ్ల గ్రామకరణము ముఖమంటపము కట్టించెను. రామలింగమను నొక కంసాలి గోపురమును కట్టించెను.

ఈ గ్రామమునకు తూర్పుదిక్కున ఆంజనేయస్వామి ఆలయము నిర్మింపబడి యున్నది. దీని కైంకర్యపరు లెవరో తెలియరాదు. సోమేశ్వరాలయమున నున్న శాసనములో "ఆలయం కట్టించి కామోజు అనువారికి దానమిచ్చినట్లుగ" వ్రాయబడియున్నది. ఆ దానము భూదానమై యుండును.

గోపాలస్వామివారి అర్చకలు వైఖానసులు మురికిపూడి వెంకటాచార్యులు. వీరభద్రస్వామి అర్చకులు ఆదిశైవులు కొర్నెపాటి శివయ్య, శంకరయ్య, కొండకావూరు వెంకట్రామయ్య, కోటయ్య, శాస్త్రిలుగార్లు.

28. గో గు ల పా డు

నరసారావుపేటకు పడమరగా పదుమూడుమైళ్ల దూరమున నీ గ్రామమున్నది. ఇది రొంపిచర్లకు మూడుమైళ్ల దూరములో నుండును. ఈ గ్రామమున వేణుగోపాలస్వామివారి ఆల

యము కలదు. ఎవరిచే నే కాలమున ప్రతిష్ఠింప బడినది తెలిసి కొనుటకు అవకాశములు లేవు. పూర్వము పాటిమీద నొక దేవాలయము పాడుపడి యుండగా నందలి భాగములను దెచ్చి దమ్మాళపువారు గ్రామ మధ్యమున నొక దేవాలయము నూరు సంవత్సరముల క్రిందట కట్టించినట్లును, మల్రాజువారిచ్చిన భూములవల్లనే యీ స్వామివారి కైంకర్యము జరుగుచున్న ట్లును తెలియుచున్నది. పూర్వమున్న గోపాలస్వామివారి దేవాలయమే యీ యాలయము కావచ్చును.

ఈ గ్రామమందలి కరిణీకపు మిరాశీ గోపాలుని వారిది. వీరినే గోగులపాటి వారందురు. గోపాలస్వామి అర్చనాది కైంకర్యములను నిర్వహించు వారు వైఖానసులు నారాయణం రంగాచార్యులు, వరదాచార్యులు, ఆంజనేయాచార్యులుగార్లు.

29. చీమలమఱ్ఱి

ఈ గ్రామము నరసారావుపేటకు ఎనిమిది మైళ్ళ దూరమున ఉత్తర దిశగానున్నది. పూర్వము ఈ గ్రామమున్న ప్రదేశము ఎడారిగా నుండెడిది. కాని ప్రయాణీకులు మధ్య ఆగుట కనువుగా నొక చీమలమఱ్ఱి చెట్టుండెడిది. అందువలన ప్రయాణీకులకు మధ్య ఈ చీమలమఱ్ఱి మజిలీగా నేర్పడెను.

ఇట్లు మజిలీగా నేర్పడుటచే నీమఱ్ఱికి ప్రసిద్ధివచ్చెను. ఈ చీమల మఱ్ఱి నెరుగని వారా కాలములో నరుదుగ నుండిరి. ఆ మఱ్ఱి సమీపములో కట్టబడిన ఈ గ్రామమునకును ఆ ప్రసిద్ధనామమే పెట్టియుండిరి. ప్రథమమున గోపరాజు రామన్న కరిణీకము లిచ్చునపుడు ఈ గ్రామకరిణీకమును పాకనాటి నియోగుల కిచ్చెను. ఆ కరిణీకము చేయువారును చీమలమఱ్ఱి వారైరి. ఈ గ్రామములో తూర్పుదిక్కున చీమలమఱ్ఱి శేషాచలంగారు కేశవస్వామి దేవాలయమును కట్టించి ప్రతిష్ఠగావించిరి. ఇచటికి సమీపముననే వేంకట యతీశ్వరుడు ప్రతిష్ఠ గావించిన సోమేశ్వరస్వామి ఆలయము కలదు. ఇదిగాక ఆంజనేయస్వామి దద్దళమును నొకటి యున్నది. తర్వాత ఆత్మకూరి లక్ష్మీనరసయ్య యను వైశ్యుడు శ్రీ సీతారామస్వామి దేవాలయము కట్టించెను. యర్నేడి వెంకటేశ్వర్లు, ములకలూరు మురళీధర రావు గార్లు గ్రామమధ్యన నొక దేవాలయము కట్టించి అందు 1947 సంవత్సరమున పాండురంగస్వామిని ప్రతిష్ఠించిరి. పూర్వమెప్పుడో కట్టబడిన కేశవస్వామి ఆలయము శిథిలముకాగా గడ్డం కోటయ్య, ఎఱ్ఱంనేడి పెదలింగయ్యగార్లు మఱల కట్టించి స్వామి వారి ప్రతిష్ఠ జరిపిరి. చెన్నకేశవస్వామి, పాండురంగ స్వామి, సీతారామస్వామి వార్లకు అర్చన చేయువారు వైఖానసులు నారాయణం లక్ష్మీనారాయణాచార్యులు. సోమేశ్వర స్వామి అర్చకులు దావులూరి సుబ్బయ్య, మల్లయ్యగార్లు.

ఈ గ్రామము కొంతకాలము బోయినపల్లివారికి మొకాసాగ్రామముగా నుండెను. తరువాత మల్రాజు వారికి స్వాధీనమాయెను. ఇపుడు కరిణీకము ముప్పాళ వారిది.

30. చల్లగుండ్ల

ఈ గ్రామము నరసారావుపేటకు వాయవ్య దిక్కున 8 మైళ్ళ దూరములో నున్నది. ఈ గ్రామములో చక్కని చిత్రములు చెక్కబడిన రాతిఫలకములు గలవు. ఇవి దేనికి సంబంధించినవో, ఏకాలమున చిత్రింపబడినవో తెలియదు. ఈ గ్రామమున సీతారామస్వామి దేవాలయములు రెండును, ఆంజనేయస్వామి యాలయమును, రామలింగేశ్వరస్వామి గుడియును కలవు. ఇచ్చటనున్న విష్ణ్వాలయములకు అర్చకులు పాంచరాత్రులు గొట్టిపోళ్ల బుచ్చయాచార్యులు. శివాలయమునకు అర్చకులు ఆదిశైవులు రాజోలు చంద్రమౌళి, ఆనందరావు, శంకరయ్య, వేంకటేశ్వర్లు ప్రభాకరరావుగార్లు.

31. చాగల్లు

నరసారావుపేటకు ఉత్తరముగ ఎనిమిది మైళ్ళ దూరమున నీ గ్రామమున్నది. ఈ గ్రామములో ఉత్తరదిక్కుననున్న బావిదగ్గర శాసనము చెక్కిన రాయి యొకటియున్నది. దానికిని ఈ గ్రామమునకును సంబంధము కన్పింపదు. ఇచట సీతా

రామస్వామి, ఆంజనేయస్వామివార్ల దేవాలయములు కలవు. సీతారామస్వామి అర్చకులు వైఖానసులు నారాయణం లక్ష్మణాచార్యులు. ఆంజనేయస్వామి అర్చకులు పాంచరాత్రులు గొట్టిపోళ్ల నరసింహాచార్యులు. ఇష్టకామేశ్వర స్వామి దేవాలయమును మఱియొకటి కలదు. ఈ యాలయమునకు అర్చకులు ఆదిశైవులు.

32. చెన్నుపల్లి అగ్రహారము

ఈ అగ్రహారము నరసారావుపేటకు పదునారు మైళ్ల దూరములో నైరృతిదిశన నున్నది. ఈ గ్రామమున వెయ్యి సంవత్సరములనాటి శివాలయ మొకటి కలదు. ఇందు పరశివైదీశ్వరుని విగ్రహామున్నది. ఇందుగల శాసనములో "సూరపరాజనువారు తమ గ్రామమగు కాటేపల్లి యందున్న కొమ్మేశ్వర దేవరకు దానములు చేసినట్లు" వ్రాయబడి యున్నది. మఱియొక శాసనము వలన "ఈ గ్రామములో కట్టింపబడిన మశీదుకు భల్లూలాఖానుడు కొంత మాన్య మిచ్చినట్లున్నది. ఈ దేవాలయమును గూర్చి యేమియు నీ శాసనముల వలన తెలియకున్నది. ఈ గ్రామమున (శ్రీ) సీతారామ స్వామివారి ఆలయమొకటి కలదు. ఆ దేవునకు వైఖానసులు, పరుచూరి వేంకటాచార్యులు అర్చనమును జరుపుచుందురు. పూర్వ మీ గ్రామ కరిణీకము గుంటుపల్లి వారిదై యుండెను. ఇపుడు గొడవర్తివారికి సంక్రమించి యున్నది.

33. చి ఱు మా మి ళ్ళ

నరసారావుపేటకు తూర్పుగ తొమ్మిదిమైళ్ల దూరమున నీ గ్రామమున్నది. ఇచట అనంతేశ్వరుని దేవాలయము కలదు. ఈ గ్రామములోని చెఱువు నందొకగుడి కన్పించుచున్నది. ఈ గ్రామముననున్న నొకవైశ్యుని యింటియందు రెండు శాసనము లున్నవి. అందొక దానియందు కులోత్తుంగ చోడ గోంకరాజు పేరు, రాజేంద్ర చోడుని పేరు కన్పించుచున్నవి. ఈ గ్రామ తటాకము నందున్న దేవరకు దాన మిచ్చినట్లును వ్రాయబడి యున్నది. ఆ దాన మెద్దియో స్పష్టముగ లేదు. దేవునికి జరుగవలసిన ముఖ్యకార్యములు నిత్య నైవేద్య దీపారాధనలే కనుక అందులకు భూదానము చేసినట్లు చెప్పవలసి యున్నది. రెండవ శాసనమున అనంతేశ్వరునకు ప్రోలి అను రాజు కొంత దానమిచ్చినట్లు వ్రాయబడి యున్నది. ఈ రెండు శాసనములు 1161 సంవత్సరమునకు సంబంధించినవి. దీనింబట్టి చూడ ఈ గ్రామము చాల పురాతన మైనదని చెప్పవచ్చును.

ఈ గ్రామముననే కొలిశెట్టి హనుమయ్య అను వైశ్యుడు శ్రీ సీతారామస్వామి దేవాలయము కట్టించి స్వామివారి ప్రతిష్ఠ చేయించి యుండెను. ఆ స్వామివారి అర్చకులు వైఖానసులు రత్నాకరం వేంకటశేషాచార్యులుగారు. ఈ గ్రామ కరిణీకము గోపరాజు వారిది.

34. చే జ ర్ల

ఈ గ్రామము నరసారావుపేటకు పదునాలుగు మైళ్ల దూరమున నున్నది. దీని సమీపమున చిన్న పర్వతపంక్తులు, చిట్టడవులు అధికముగనున్నవి. ఈ గ్రామమునకు ప్రయాణ సౌకర్యములు లేవు. అందువలన నీ గ్రామముయొక్క ప్రసిద్ధి వెల్లడికాక యున్నది. ఇదియొక మహాక్షేత్రము. ఈ గ్రామమున పురాతనమైన కపోతేశ్వరాలయ మొకటి కలదు. ఇచటనే కోటి లింగముల లుండెడివని పెద్దలు చెప్పుదురు. ఆ వాడుక యదార్థమైనదే కావచ్చును. ఈ గ్రామమున నెచట చూచినను అందమైన శివలింగములు కనిపించుచుండును. భూములు దున్నునపుడును లింగములు దొరుకుచుండును. దీనినిబట్టి చూడ నిందు కోటిలింగముల ఆలయము పూర్వ ముండెడిదనియు, అదికాల వశమున శిథిలమైపోయి యుండెననియు చెప్పుటకవకాశము కన్పించుచున్నది. కపోతేశ్వరాలయమునకు దక్షిణముగ మల్లికార్జున గుండమను నొక పుష్కరిణి కలదు. దీనికి దక్షిణముగ కొండలనుండి ఓంకారనది జనసమంది ప్రవహించుచుండును. దీనినే ఓగేరందురు. కపోతేశ్వరాలయమునకు పశ్చిమదిక్కున మేఘాలమల్లయ్య దేవాలయ మొకటి కలదు. కొండమీద వీరభద్రాలయ మొకటి యుండెడిది. ఈ యాలయ ద్వారములపైన ఆంధ్రుల శిల్పకళా నైపుణ్యము తేటతెల్లమగునట్లు అనేకరకములైన చిత్రములు చెక్కబడి యున్నవి.

ఈ ఆలయము నానుకొని దక్షిణముగ నొక పెద్ద మ్రానుగలదు. ఈ వృక్ష మెంతకాలమునుండి యున్నదో యెవరికిని దెలియదు. ఈ వృక్షవు మ్రాను ఒకటిగ నున్నను చెట్టుపైన ననేకజాతుల కొమ్మలు, పుష్పములు, ఫలములు నుండెడివని చెప్పుదురు. ఈ వృక్షమున నితర ఫలములుగాక సజాతీయమైన పండు పదురెండు సంవత్సరముల కొకటి పండెడిదనియు, దానిని దేవతలు సంగ్రహించి కపోతేశ్వరునకు నైవేద్యము చెల్లించెదరనియు వాడుకగఁ జెప్పుదురు. ఈ మ్రాను కొక తొఱ్ఱయుండెడిదట. ఆ తొఱ్ఱనుండి కాశీరామేశ్వరాది పుణ్యక్షేత్రముల కేగుటకు బిలములుండెడివనియు, ఈ గ్రామ వాస్తవ్యుడును, తపశ్శక్తి సంపన్నుడునగు తుంగదుర్తి బుచ్చయ్య యను పుణ్యపురుషుడు ఈ బిలమార్గముల ద్వారా అనేక యాత్రలు చేసివచ్చెననియు వాడుకగ చెప్పుదురు. ఈ వృక్షము ముప్పది సంవత్సరముల క్రిందట వచ్చిన గాలివానకు పడిపోయినదట. ఈ మాటలు సామాన్యమానవ శక్తి కతీతముగనుండి పుక్కిటి పురాణములుగ దోచినను, ఈ క్షేత్రము శక్తిసంపన్నమైనదని చెప్పుట కవకాశము మాత్రము కలుగజేయుచున్నది.

ఈ కపోతేశ్వరాలయము గుడిసె ఆకారమున నుండును. 23 అడుగుల వెడల్పు 83 అడుగుల పొడవును, 22 అడుగుల యెత్తునుగల్గి ఇటుక సున్నముతో కట్టబడియుండును. ఈ ఆలయ

మధ్యమున కపోత వర్ణముగల స్ఫటిక లింగముండును. ఆ వర్ణమును బట్టియే కపోతేశ్వరు డందురు. అందలి లింగముయొక్క పై భాగమున రెండు రంధ్రము లుండును. ఈ రంధ్రముల నుండియే అభిషేకజలము మల్లికా గుండములోనికి పోవును. అందు వలననే ఆ గుండము పవిత్రమై యొప్పుచున్నది.

ఈ యాలయము బౌద్ధయుగమున బౌద్ధుల చైత్యగృహమనియు, ఆమతము క్షీణించి వైదిక మతము వ్యాప్తమైన పిదప కపోతేశ్వరాలయముగ పరిణామమొందెననియు చరిత్రకారులు చెప్పుచున్నారు. ఆకారమునుబట్టి చూచిన వారి యూహ సమంజసముగనే కన్పించును. ఆలయ ద్వారము మీద చైత్యవాతాయనమును, పైకప్పు కోడిగుడ్డు ఆకారమును కలిగియుండును. ఇకనీ క్షేత్రమాహాత్మ్యమును గురించి సూవెల్సు ఆంటిక్విటీస్ అను గ్రంథమున వ్రాయబడి యున్నది. అద్దాని నిట సంగ్రహించెదను.

పూర్వము కాశ్మీర దేశమున యయాతికి మాంధాత యను కుమారుడు గలడు. అతనికి శిబిచక్రవర్తి, మేఘాడంబరుడు, జీమూతవాహనుడు అను ముగ్గురు పుత్రులు కలరు. పెద్ద కుమారుడైన శిబి రాజ్యము చేయుచుండెను. ఆ సమయమున శిబిచక్రవర్తి పెద్దతమ్ముడైన మేఘాడంబరుడు పుణ్యక్షేత్రములు సేవించుచు చేజర్లకొండ మీదికి వచ్చి అందున్న మహర్షులను జూచి తానును అచటనే తపస్సు చేసి కొంత

కాలమునకు సిద్ధిపొందెను. అతని మృత శరీరమున కచట సంస్కారము చేయబడెను. అట్లు సంస్కారముచేయబడిన ప్రదేశమున ఆతని తపోమహిమచే లింగమొకటి యుద్భవించెను. ఆ లింగముపై నచటివారు ఆలయమును కట్టించి మేఘాడంబేశ్వరుడని పేరిడిరి. అప్పటినుండి ఆ కొండ మేఘాడంబర కొండ యనియు మేఘాలమల్లయ్య కొండ యనియు పిలువబడుచుండెను.

ఎంతకాలమునకు సోదరుని స్థితిగతులు తెలియక శిబిచక్రవర్తి తన రెండవ తమ్ముడగు జీమూత వాహనుని వెదకుటకై పంపెను. ఆతడును అన్ని క్షేత్రములు తిరిగి తుదకు ఈ కొండపైకివచ్చి యందున్న మహర్షులంగాంచి తీవ్రమైన తపముసల్ప నారంభించి కొంతకాలమునకు నాతడును సిద్ధిపొందెను. అంతట తమ్ములిద్దఱి విషయములు తెలియక తానే స్వయముగ బయలుదేరి యీ కొండపైకి వచ్చి యిచ్చట నుండు విశేషములును, తనతమ్ములు సిద్ధిపొందిన విషయములును ఆ మునులవలన నెఱింగి తానీ కొండయందు శతయజ్ఞములుచేయ సంకల్పించి 99 యజ్ఞములు పూర్తిగావించి నూరవ క్రతువునకు సంకల్పించెను ఈ క్రతువు ముగించిన తన బ్రహ్మపదవికి భంగము కలుగునని యెంచి బ్రహ్మ శివ, కేశవుల కడకువెళ్ళి వారిని ప్రార్థించెను. అంతట శివ కేశవులు బ్రహ్మతోగూడ బయలుదేరి భూలోకమునకు వచ్చి రూపాంతరములను బొందిరి. అట్లు రూపాంతరములనుబొందిన ప్రదేశమే యిపుడు రూపెనగుంటయను పేరుతో వ్యవహరింపబడుచున్నది. వారటనుండి కొంతదూర మేగి పరిశీలింపగా దూరమున శిబి కనుపించెను. వారికండ్లకు శిబి కనుపించిన ప్రదేశమున రూపొందిన గ్రామమునకు కండ్లగుంటయని పేరువచ్చెను. అటనుండి యింకను కొంతదూరమువచ్చి శివుడుకిరాతుడుగను, బ్రహ్మబాణముగను, విష్ణువుపావురముగను రూపములను ధరించిరి. ఆప్రదేశమిప్పుడు విప్పర్లయని పిలువబడుచున్నది. అంతట కిరాతుడుపావురమును బాణముతో కొట్టబోగా అది యజ్ఞము చేయుచున్న శిబిచక్రవర్తిచేతిపై వ్రాలి శరణువేడెను. వెంటనే కిరాతుడు వచ్చి ఆకలిచే ప్రాణములుపోవు చున్నవి. పావురము నిమ్మని కోరెను. పావుర మెత్తు మాంసము నిత్తునని చెప్పి త్రాసునందు పావురమునుంచి, తన మాంసమును కోసి రెండవ వైపున పెట్ట నారంభించెను. ఎంతకాలమునకు సరిదూగక పోగా తన ఖడ్గముతో తల నఱకుకొనుటకు సిద్ధపడెను. అపుడు త్రిమూర్తులు నిజరూపములను ధరించి శిబికి ప్రత్యక్షమై వరమును కోరుకొనమనగా తనకును, తన పరివారమునకును కైలాసమొసంగ వేడుకొనెను. అట్లే శంకరు డనుగ్రహించెను. ఆ వరప్రభావమువలన పరివారము కోటిలింగములుగను, శిబిచక్రవర్తి కపోతేశ్వరుడుగను లింగాకారములను దాల్చిరి. కపోతేశ్వర లింగముననున్న రంధ్రములు మాంసము కోసిన గుంట

లుగ మారెను. ఈ కథ ఆ గ్రంథమున తెలుపబడియున్నది. ఈ కథకును మహాభారత కథకును భేదమున్నది. ఆ భేదము సంగతి యటుంచి యాలోచింపగా నీ క్షేత్రప్రభావ మగణ్యమని చెప్పుట కవకాశము కల్గుచున్నది.

ఇక ఆలయ నిర్మాణకాలము మున్నగు విషయములను శాసనములను బట్టి యాలోచించి చూతము. ఈ గ్రామమున తెలుగు లిపిలోను ప్రాచీన లిపిలోను వ్రాయబడిన శాసనములనేకములుగలవు. ఒక శాసనము సంస్కృతభాషలో వ్రాయబడినదియు గలదు. అందు ఆనంద గోత్రోద్భవులైన కందరాజు కుమార్తె పేరు పేర్కొనబడి యున్నది. ఆ కందరాజు క్రీస్తు శకము 4వ శతాబ్దిలోని వాడని చరిత్రకారులు చెప్పుచున్నారు. తెలుగు లిపిలో వ్రాయబడిన శాసనములలో నొకదానియందు విషమసిద్ధి నామముండుటచే నిది యేడవ శతాబ్దిలోనిదని తెలియుచున్నది. సంస్కృతపు శాసనమును బట్టి యీ ఆలయము 4వ శతాబ్దికి పూర్వపుదై యుండును. ఒక శాసనములో నిచట 4444 లింగము లున్నట్లు తెలుపబడియున్నది. అది 1247 వ సంవత్సరపు శాసనము. ఇచటనున్న తొమ్మిది శాసనముల లోను నీ గ్రామనామము వేర్వేరుగ కన్పడుచున్నది. మొదటి శాసనమున చేరుంజర్లయనియు, తర్వాత శాసనమున చేంజర్ల యనియు నుండెను. చేంజర్లయే పిమ్మట చేంజర్లగా మారెను.

ప్రతాపరుద్రుని కాలమున దేవాలయ పోషణమునకై యీ గ్రామము దానమీయబడినట్లు కన్పించుచున్నది. ఈ గ్రామమున 78 దేవాలయములు, 28 సందులు, 62 దుర్గ విగ్రహములు, 16 భైరవ విగ్రహములు 21 పీరుల విగ్రహములు ఉన్నట్లు చెప్పుదురు. ఈ గ్రామముననే నాగలింగేశ్వర స్వామియు కలడు. ఈ విధముగా నీ గ్రామము ప్రసిద్ధికెక్కి మహాక్షేత్రమై వాసిగాంచి యున్నది.

ఈ గ్రామకరణములు మొదట శానంపూడివారు. తర్వాత వారు దమ్మాళంవారి కిచ్చిరి. ఇపుడు చేజర్లవారే కరణములుగా నున్నారు. శివాలయములకు అర్చకులు ఆదిశైవులగు బెల్లంకొండ భద్రయ్య. ఆంజనేయస్వామి గుడికి వైదికులు అర్చకులుగా నున్నారు.

35. రూ పె న గు ం ట

ఈ గ్రామము నరసారావుపేటకు పదిమైళ్ళ దూరములో నున్నది. పూర్వము త్రిమూర్తులు శిబిచక్రవర్తిని పరీక్షించుటకై వచ్చి మారురూపములనుదాల్చియున్నందున నీపేరు వచ్చినట్లు చెప్పుదురు. ఈ గ్రామము బోయనపల్లి భూషణరావు అనువారికి ముఖాసాగా నీయబడెను. తరువాత తానీషా కాలమున మల్రాజు వారికి చెందెను. ఈ గ్రామమున వీరేశ్వర స్వామి, విఘ్నేశ్వర స్వామి, ఆంజనేయస్వామి, సీతారామ

స్వామివార్ల దేవాలయములు ప్రస్తుత కాలమున నున్నవి. పూర్వము భీమేశ్వర, సోమేశ్వర, బుగ్గమల్లేశ్వర, గోపాల స్వామి వార్ల ఆలయములు కూడ కలవు. అవి యిప్పుడు శిథిలములై పోయినవి. సీతారామస్వామి, ఆంజనేయస్వామి వార్లకు అర్చనాది కైంకర్యములు జరుపువారు వైఖానసులగు నారాయణం కృష్ణమాచార్యులు. శివాలయములకు చుండి కోటయ్య, వీరు ఆదిశైవులు.

36. కండ్లగుంట

ఈ గ్రామము నరసారావుపేటకు పదురెండుమైళ్ళ దూరమున నున్నది. త్రిమూర్తుల కండ్లకు శిబిచక్రవర్తి కన్పడిన ప్రదేశమగుటచే కండ్లగుంటయను పేరు వచ్చెనందురు. ఈ గ్రామమున ఆంజనేయస్వామివారి ఆలయము మాత్రము కలదు.

విప్పర్ల

ఈ గ్రామము నరసారావుపేటకు 13 మైళ్ళదూరమున నున్నది. త్రిమూర్తులు శిబిచక్రవర్తిని పరీక్షించుటకు మారు రూపములను ధరించిన ప్రదేశమును విప్పర్లయని చెప్పుదురు. ఈగ్రామమున రెండుశిథిలములైన ఆలయములు కలవు. అందలి రాళ్ళపై విగ్రహములు సుందరముగ చెక్కబడియున్నవి. పట్టాభిరామస్వామి ఆలయము, ఆంజనేయస్వామి ఆలయము,

శివాలయము అను మూడు దేవాలయము లున్నవి. ఈగ్రామమున వైదీకులు కరణములుగ నున్నారు.

ఈ గ్రామమున 694 సంవత్సరమున తెలుగులిపిలో వ్రాయబడిన శాసన మొకటియు, సంస్కృతమున వ్రాయబడిన శాసన మొకటియు కలవు. తెలుగులిపి శాసనమందు తూర్పు చాళుక్యుల కాలమున జయసింహ వల్లభరాజు కాలమున మ్లామందీశ్వరాలయమునకు దానమిచ్చి నట్లున్నది. విష్ణ్వాలయమునకు అర్చకులు పాంచరాత్రులు. శివాలయమునకు ఆది శైవులు చందలూరి శివయ్య అనువారు.

37. కుంకలగుంట

నరసారావుపేటనుండి నెకరికల్లుకు పోవు మార్గమున రోడ్డునకు పడమరగ కుంకలగుంటయను గ్రామముకలదు. త్రిమూర్తులు శిబిచక్రవర్తిని బరీక్షించుటకై మారు రూపములను ధరించియుండిరి. అపుడు పావురరూపమును ధరించిన విష్ణువు ఎఱుకువానికి భయపడుచువచ్చి వచ్చి యీ ప్రదేశమున కుంకిళ్లు పడిపోయెనట. ఇచట కుంకిళ్లు అనుపదము వ్యావహారికము. కుంకిళ్ళు అనగా తడబాటు అను నర్థమున సామాన్య ప్రజానీకముచే వాడబడుచున్నది. ఆ కారణము వలన మొదట యీ గ్రామము కుంకిళ్లగుంట అను పేరు

గలదియయ్యెను. అదియే రానురాను కుంకలగుంటగా మార్పు చెందెను.

ఈ గ్రామ కరిణీకపు మిరాశీ మొదట కుంకలగుంట వారిది. తరువాత ఏకారణమువల్లనో కాని భాస్కరునివారు, గుంటుపల్లివారు ఆ మిరాశీని పొందియుండిరి. వారు కొంత కాలమునకు దమ్మాళపువారికిని, చేజర్ల వారికిని సంక్రమింప జేసిరి. దీనికి పూజగుండాల పాడను పల్లె యొకటి అనుబంధ గ్రామమేర్పడి యున్నది. పాదుషావారి కాలమున ఈ గ్రామము రామరాజువారి క్రిందకు వచ్చెను. ఆ సమయముననే జంపని అమరపురాజు, సీతారామరాజు అనువారికి కొండవీడు, బెల్లంకొండ, వినుకొండలలోని కొన్ని గ్రామములను జాగీరుగా నిచ్చియుండిరి. అందీకుంకలగుంట కలదు. ఆ రాజు లిచటికి వచ్చి తమకు చెందిన గ్రామములకును మధ్య భాగమున నుండుటచే నీ గ్రామమున కోటకట్టుకొని యిచటనే నివసింప నారంభించిరి. ఇప్పుడాకోట ఖిలమై పోయినది. తర్వాత ఈ గ్రామము మల్రాజువారి క్రిందకు వచ్చెను.

ఈ గ్రామమున వేణుగోపాలస్వామి, నీలకంఠేశ్వరస్వామి భోగేశ్వరస్వామి, వల్లభేశ్వరస్వామి. ఆంజనేయస్వామి, గణేశుని దేవాలయములు కలవు. గ్రామమధ్యనున్న వేణుగోపాల స్వామి ఆలయము చోళప్రతిష్ఠ. తర్వాత కొంగుకోనప్ప యను గోల్కొండవ్యాపారి ఆదేవాలయమునకు గోపుర ప్రాకార

ములు కట్టించి, కొన్ని దానములు చేసెను. నీలకంఠేశ్వరుని ఆలయమొక యతీశ్వరునిచే కట్టింపబడి జంపని వెంకటాచల దీక్షితులవారిచే స్వామివారి ప్రతిష్ఠా కలాపములు జరిపించెనట. భోగేశ్వరస్వామి, వీరభద్రాలయములు చోళులచే ప్రతిష్ఠింపబడినవి. అవి ఖిలములై పోయినవి. ఆంజనేయాలయమును మిరాశిదారు ప్రతిష్ఠచేయించెను. గణేశుని గుడియు వారి చేతనే కట్టింపబడినదందురు. ఇందు భాస్కరుని వారు త్రవ్వించిన చెఱువొకటి కలదు. కాకతీయ ప్రతాపరుద్రుని చేతను, అతని మంత్రి యగు మల్లయ్య చేతను తమతమ ఆరోగ్యసిద్ధికిగాను కొన్ని దానములు చేయబడినట్లు కన్పడుచున్నది. ఇందు గల శాసనమువలన ప్రతాపరుద్రుడు ఈ ప్రాంతముననే యుద్ధముచేసి జయము పొందినట్లు తెలియుచున్నది. ఈ గ్రామమున కుందేళ్ల బోడు, పలుగురాళ్ళబోడు అను రెండు తిప్పలున్నవి.

గోపాలస్వామి అర్చకులు పాంచరాత్రులు, శఠగోపాచార్యులను వారు. శివాలయములకు ఆదిశైవులు పత్రి హనుమంతరావు, రాఘవయ్య, వేంకటేశ్వర్లు అనువారు.

38. చిలకలూరిపేట

ఈ గ్రామము నర్సారావుపేటకు ఆగ్నేయమున చీరాల పోయెడి మార్గముననున్నది. ఈ తాలూకాలోని కెల్ల

నన్ని వసతులు గల్గిన సుందరమైన పట్టణము. ఇది యొకప్పుడు మానూరివారి జమీలో నుండెడిది. ప్రభుత్వము జమీలు పంచిపెట్టునపుడు కొండవీటి సీమ మానూరివారికిని చిలకలూరిపేట శ్రీ రాజానరసన్నారావు గారికిని వచ్చెను. అప్పటి నుండి నరసన్నారావుగారి తమ్ముడు వెంకటకృష్ణసింగారిచే పరిపాలింపబడును 1812 వ సంవత్సరము వఱకుండెను. చిలకలూరిపాడులో నొక తురకజమీందారు ఉండెననియు, ఆతడే జమీందారుల కిచ్చెననియు నొక యభియుక్తి కలదు. ఇది నమ్మదగినదిగ కాన్పింపదు. 1830 వ సంవత్సరమున ఆక్లండు ప్రభువు కాలములో జమీందారులనుండి జమీలను దీసికొని హార్డింజి ప్రభువు కాలమున 1845 నవంబరు 8 వ తేదీన అలవెన్సులు ఏర్పాటుచేసిరి. ఈ గ్రామమున పెద్దకోట చిన్నకోట అను రెండు కోటలుగలవు. పెద్దకోటలో శ్రీ రాజా మానూరు హనుమాయమ్మగారి దత్తుకుమారుడు వెంకటరమణయ్యారావు గారు, వారి కుమారులు వెంకటనరసింహారావు వెంకటకృష్ణారావుగార్లు ఉండెడివారు. చిన్నకోటలో శ్రీ మానూరి వెంకన్నారావుగారు, వారి కుమారులు వెంకటకృష్ణ నరసింహారావు గారు, నివసించు చుండెడివారు. ఈ రెండుకోటలును చాల పురాతనమైన వగుటచే శిథిలావస్థలో నున్నవి.

వీరి పూర్వులలో శ్రీ రాజా మానూరు పెదవెంకట కృష్ణారావుగారు పసుమర్తి శివారు కొమరవల్లి పాటిలో దేవాలయము కట్టించి పసుమర్తి గ్రామములో దొరకిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామిని తెచ్చి ప్రతిష్ఠ చేయించిరి. శ్రీ స్వామివారికి చాలకాలము వారి స్వంత ద్రవ్యముతోనే అర్చనాది కైంకర్యములు కుంటుపడకుండ నిర్వహించి యుండిరి. తరువాత శ్రీ రాజా మానూరి వెంకటహనుమాయమ్మ, శ్రీ రాజా మానూరు వెంకన్నారావుగార్లు చిలకలూరిపాడు జమీందారు మజుందారు సర్కారు ముత్తు జాన్నగరు శ్రీ స్వామివారిల నిత్య నైవేద్యములకు, అఖండ దీపారాధనములకు గాను 1143 ఫసలీకి సరియగు 1834 సంవత్సరమున పన్నెండు కుచ్చెళ్ల భూమిని పరుచూరి శేషాచార్యులు, రామాచార్యులు, మురికిపూడి వెంకట్రామాచార్యులు, వెంకటాచార్యులుగార్లకు సనదు వ్రాయించి యొసంగియుండిరి. శ్రీ స్వామివార్ల కళ్యాణోత్సవము వగైరాలకు సర్కారులో సాలుకు 59/- లు చొప్పున ఇచ్చుచు కొంతకాలమునకు ఆపివేసిరి.

1860 సంవత్సరములో కృష్ణాజిల్లా కలెక్టరు గారైన థారన్‌వాల్ యిస్కుయిర్ వారి సమక్షమున కొంత వ్యవహారము జరిగినది. అపుడు ఆఋ కుచ్చెళ్లు అర్చకుల దగ్గరనుండి శ్రీ రాజా మానూరి వెంకట హనుమాయమ్మ, వెంకట కృష్ణనృసింహారావుగార్లు స్వాధీన పఱచుకొనిరి. శ్రీ నృసింహస్వామి ఆలయములోనే ఉత్తర దిక్కున ప్రతిష్ఠింపబడిన ఆంజనేయ స్వామి నిత్య నైవేద్య దీపారాధనలకుగాను 30 యకర

ముల భూమిని తాటికోల కృష్ణాచార్యుల గారికిచ్చి యుండిరి. శ్రీలక్ష్మీనరసింహస్వామివారి అర్చనచేయువారు వైఖానసులు మురికిపూడి సత్యనారాయణాచార్యులు, నరసింహాచార్యులు, శేషాచార్యులు, హనుమాచార్యులు, రాఘవాచార్యులు, పరుచూరి హనుమాచార్యులు, సూర్యనారాయణాచార్యులు వగైరాలు.

ఈ గ్రామమధ్యమున శ్రీ సీతారామస్వామి గుడికలదు. వడ్లమన్నాటి వెంకటప్ప సోమయాజులుగారు ఇచట తాలూకా తహసీల్దారుగా పనిచేయుచు ఈ ఆలయము కట్టించి, స్వామి వారి ప్రతిష్ఠ జరిపి, నిత్య కైంకర్యమునకు భూమినిచ్చి యుండిరి. వారి కుమారులు వెంకటచలం పంతులుగారు డిప్యూటీ కలెక్టరుగ పనిచేయుచు మరికొంత ఆస్తిని, కొన్ని వసతులను గల్పించి 26–10–1883 వ సంవత్సరమున వుయిల్ నామా వ్రాసిరి. వారి కుమారులు శ్రీనివాస దీక్షితులు వకీలుగా నుండి కొంతకాలము ఆలయ పరిపాలనము చేసియుండిరి. వారి కుమారులు జనార్దనరావు, మనుమడు శ్రీనివాసరావుగార్లు ఇపుడు పరిపాలకులుగ నున్నారు. ఈ స్వామివారి అర్చకులు శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి అర్చకులే.

ఈ గ్రామమున పూర్వము పెండేల గురులింగం అనువారు (దేవ తెలికలు) ఒక ఆలయమును కట్టించి అందు నాగేశ్వరస్వామిని ప్రతిష్ఠించి కొంతభూమి నిచ్చియుండిరి. కొంత

కాలమునకు ఆలయము శిథిలము కాగా కాశా వెంకటస్వామి అనువారు ఆలయమునకు గోపురప్రాకారములను కట్టించిరి. అర్చకులు వెలనాటి పూజార్లు కుందుర్తి గురుమూర్తిగారు.

ఈ గ్రామమున కుత్తరభాగమున ఉమామహేశ్వర స్వామివారి ఆలయమొకటి కలదు. గుబ్బిటి వెంకన్నగారు ఆలయ నిర్మాణాదులు చేసి భూవసతిని కల్పించి యుండిరి. షుమారు 50 సంవత్సరముల క్రిందట మైలవరపు వెంకటప్పయ్యగారు, వెంకన్న గారి కుమారుడు చంద్రమౌళిగారి వలన అధికార పత్రమును బొంది ఆ దేవాలయమున కన్యకామ్మవారిని ప్రతిష్ఠించెను. అర్చకులు వెలనాటి పూజారులు వారణాసి వెంకటసుబ్బయ్య.

ఈ చిన్న పట్టణమునకు అవసరమైన హంగులన్నియు నున్నవి. ఒక హైస్కూలు కమిటీ ఆధ్వర్యమున నిర్వహింపబడుచున్నది. ఇంకను అర్బన్ బ్యాంకు, గ్రంథాలయములు, కొన్ని ఎలిమెంటరీ స్కూళ్లు మున్నగునవి కలవు.

39. జగ్గాపురం

ఈ గ్రామము యడ్లపాటికి రెండుమైళ్ల దూరమున నున్నది. పూర్వము గజపతులు రాజ్యము చేయునపుడీగ్రామము ఇమ్మడిరాజు, ముమ్మడిరాజు అనువారల కీయబడి వారి యధీనములో నుండెడిది. వారిలో ఇమ్మడిరాజనువాడు ఈ గ్రామమున వేణుగోపాలస్వామి దేవాలయమును, చంద్రశేఖరస్వామి

దేవాలయమును కట్టించి, ప్రతిష్ఠలు జరిపి భూముల నొసంగి యుండెను. తరువాత మహమ్మదీయుల రాజ్యములో నీ దేవాలయములు భగ్నములు చేయబడగా సంతుబందీలు చేసినపుడు చౌదరీలు అమానీ మాల్గుజారీ చేసియుండిరి. వంట్లు వేసినపుడు 1713 వ సంవత్సరములో ఈ గ్రామము మానూరి వెంకన్నారావుగారి భాగమునకు వచ్చెను. 1749 లో మిరాశీదార్లు ఈ దేవాలయములను జీర్ణోద్ధరణ గావించి పునఃప్రతిష్ఠ చేయించిరి. అపుడు మరల భూదానములను చేసియుండిరి. ఈ గ్రామము ప్రథమమున చిలకలూరిపాడులో చేర్చబడెను. తరువాత జమీందారీలు పంపిణీ చేసికొనినపుడు ఇది వేంకటేశం గారి భాగములోనికి వచ్చెను. అందువలన సత్తెనపల్లి క్రింద చేరెను.

ఈ గ్రామము పూర్వమెప్పుడో జగ్గయ్య అనువాడు కట్టించినందున జగ్గాపురమని పేరువచ్చినది. 1749 లో జీర్ణోద్ధరణము చేయబడిన శివాలయము వాశిరెడ్డివారి కాలమునాటికి మఱల శిథిలమై యుండెను. అపుడు వారాయలయమునకు మరమ్మతులు చేయించి యుండిరి. తరువాత మఱికొంత కాలమునకు ఆ ఆలయము పాడుబడి పడిపోవుటకు సిద్ధమైయుండెను. ఆ సమయమున ముద్దనరంగయ్య అనువారు నూతనాలయమును కట్టించి స్వామివారి ప్రతిష్ఠజరిపి యుండిరి.

ఈ గ్రామమున రామాలయముకూడ మఱియొకటి కలదు. ముద్దన రంగయ్యగారే యీ గ్రామమున స్కూలు ప్రారంభించగా వారి కుమారులు రామయ్య చౌదరిగారు ఉన్నత పాఠశాలగా రూపొందించి యుండిరి. చల్లపల్లి రాజాగారు బీదవిద్యార్థులకు వసతి గృహమును కట్టించియుండిరి. పోపూరి బసవయ్యగారు బీదల సౌకర్యమునకు వైద్యాలయమును కట్టించిరి. పోపూరి శీతయ్యగారు ఒక మఠమును కట్టించి యున్నారు.

1145 వ సంవత్సరమున గోపరాజు రామన్నగారు పెళ్లూరివారికిని, మల్లోలు వారికిని కరిణీకము మిరాశీ యిచ్చి యుండిరి. శ్రీ వేణుగోపాలస్వామి, శ్రీ సీతారామస్వావార్ల అర్చకులు వైఖానసులు, దీవి హనుమాచార్యులు, చిన హనుమాచార్యులుగార్లు చంద్రశేఖరస్వామి అర్చకులు ఆదిశైవులు తుర్లపాటి రాఘవయ్య, కొండకావూరి సుబ్రహ్మణ్యంగార్లు.

40. జాలాది

నరసారావుపేట కాగ్నేయముగ పదునాలుగుమైళ్ళ దూరములో నీ గ్రామమున్నది. గజపతి రాజుల కాలములో ఇమ్మడిరాజు, ముమ్మడిరాజు అనువారీ గ్రామమున పడమటి దిశయందు మల్లేశ్వరస్వామి దేవాలయమును. వేణుగోపాలస్వామి

దేవాలయమును, ఈశాన్యభాగమున ఆంజనేయస్వామి ఆలయమును కట్టించిరి.

మొగలాయీల రాజ్యకాలములో 1101 ప్రాంతములయందు ఈ రెండు దేవాలయములును పూజాపునస్కారములు లేక పాడుపడుట సంభవించెను. తర్వాత వంట్లు వేసినపుడు ఈ గ్రామము మానూరి వెంకన్నారావు గారి భాగములోనికి వచ్చెను. మానూరి నరసన్నారావుగారు పరిపాలనమునకు వచ్చిన పిదప వారు పాడుబడియున్న విష్ణు, శివాలయములు రెండును మరమ్మతులు చేయించి స్వామివార్ల ప్రతిష్ఠలు జరిపించి యథావిధిగా కైంకర్యములు సాగునట్లు చేసియుండిరి.

గోవరాజు రామన్నగారు కరిణీకము లిచ్చునపుడు ఈ గ్రామకరిణీకము పెళ్ళూరివారి కీయబడెను. తర్వాత వారు పుణ్యమూర్తులవారికిని కొంతభాగ మిచ్చుటచే నిరువురును కరణములుగా నుండుట సంభవించినది. వేణుగోపాలస్వామి, ఆంజనేయస్వామివార్ల అర్చనాది కైంకర్యములను వైఖానసులు పుసులూరి రామాచార్యులు, లక్ష్మాచార్యులు, పర్చూరి కృష్ణమాచార్యులుగార్లు నిర్వహించుచున్నారు. మల్లేశ్వర స్వామి అర్చకులు ఆదిశైవులు కారంచేటి సూరయ్య అనువారు.

41. జొన్నతాళి

ఈ గ్రామము నరసారావుపేటకు దక్షిణమున ఇరువది మైళ్ళ దూరములో నున్నది. ఈ గ్రామనామము చూడ క్రొత్తగా కనుపించుచున్నది. ఆంధ్రదేశమున గ్రామనామములకు చివర పాడు, పల్లె, పురము, ప్రోలు, పేట మున్నగు పదములు కన్పించును గాని తాళియను పదమెచ్చటను కనుపింపదు. ఈ పేరు వచ్చుటలో నేదియో విశేషముండక తప్పదు. పూర్వము ఈ గ్రామములోని భూమి సారవంతమై యుండుటచే అందు వేయబడిన జొన్న, తాడివలె పెఱిగి యుండును. అందువలన జొన్నతాడియను పేరు ఏర్పడి యుండవచ్చును. ఈ సమాసము పాదపద్మమునంటిది. తాడివంటిజొన్న జొన్నతాడియగుటలో విప్రతిపత్తి యేమియునుండదు. ఆ యర్థములోనే మొదట ఈ వ్యవహార మేర్పడియుండెను. డకార ళకారములకు అభేదమును పాటించి జొన్నతాళి అనిరి. అదియే యీ గ్రామనామమైనట్లు కనుపించుచున్నది.

ఈ గ్రామమున ఆంజనేయస్వామి, త్రిపురాంతక స్వామి దేవాలయములు కలవు. అంజనేయస్వామి దేవాలయములో నొక శాసనమున్నది. ఆ శాసనమున త్రిపురాంతక దేవరకు ఒక చెరువు త్రవ్వించి నట్లును, హవిర్బలి కార్యనిర్వహణకు కొంత భూమి యిచ్చినట్లును. రెండు అఖండ దీపారాధన లిచ్చినట్లును

వ్రాయబడియున్నది. ఎవరిచ్చినట్లు కన్పింపదు. కాని ఆ శాసనములోనే కులోత్తుంగచోడ గొంకరాజు పేరు వ్రాయబడియున్నది. అందువలన ఈ దానములు గొంకరాజే చేసినట్లు ఊహింపవచ్చును.

ఈ గ్రామ కరిణీకము మొదట దర్శి వారిది. కాని చింతగుంట వారికిని అందు భాగమున్నది. ఎప్పుడో దర్శి వారు చింతగుంటవారి కాభాగమును సంక్రమింపజేసి యుండవచ్చును.

42. డేగరమూడి

ఇది నరసారావుపేటకు పదునారు మైళ్ళ దూరమున దక్షిణముగ నున్నది. ఈ గ్రామమున కీపేరు వచ్చిన విధమేమియో ఆలోచింపవలసియున్నది. మొదట దీనిపేరు డేంగురమూడి యని యుండవచ్చును. డేంగుర అనగా జయఘంటిక యని యర్థమున్నది. దీనినిబట్టి చూడగా పూర్వమెవరో యొక రాజు ఈ దేశమును జయించి యీ గ్రామమున్నచోట జయఘంటికను మ్రోగించగా నా ప్రాంతమున ఏర్పడిన యీ గ్రామమునకు డేంగురమూడి యనివచ్చి యుండవచ్చును. అదియే జనుల నోటబడి క్రమక్రమముగా డేంగురమూడి డేగురమూడియై చివరకు డేగరమూడిగా మారియుండవచ్చును.

ఈ గ్రామమున మల్లికార్జునస్వామి దేవాలయము కలదు. ఈ ఆలయమున నంది, నాగేంద్రుల బొమ్మలతో గూడిన శాసనమొకటి కలదు. అందు కులోత్తుంగ చోడుని కాలమున త్రిభువన చోడమల్లుని కుమారుడైన నన్నెచోడ మహారాజు కమ్మనాటిలోనున్న కోట్యమను గ్రామము దానముచేసినట్లు కన్పడుచున్నది. ఈ శాసనము 1080లోనిది. ఈ గ్రామములోని మల్లికార్జునస్వామి దేవాలయమునకు భూమి యెవరిచ్చినదియు కన్పింపదు. ఆకాలమునాటికి ఈ ప్రదేశమంతయు కమ్మనాటిలోనిదేయై యుండును. నన్నెచోడ మహారాజిచ్చిన కోట్యమను గ్రామమిదే కావచ్చును. పూర్వము దీనిపేరు కోట్యమనియుండి తర్వాత డేంగురమూడి యనుపేరు కలదికావచ్చును. కోట్యము మఱియొకచోటైనచో ఆశాసనమీ గ్రామమున నుండుట సంభవింపదు. కనుక కోట్యమను పూర్వనామముతో రాజిల్లు డోంగుర గ్రామమునే దానముగా నిచ్చియుండెనని చెప్పవచ్చును.

ఈ గ్రామకరిణీకము సాదిరాజువారిది. వారినే డేగరమూడి వారందురు. ఈ వంశమున వెంకయ్య అనువారు నిస్సంతుగా నుండ మరణమాసన్నమైనపుడు చింతగుంటవారికి కరిణీకమును స్వాధీనము చేసి యుండెను. ఈ గ్రామమున లక్ష్మీనరసింహస్వామివారి ఆలయ మొకటి కలదు. ఈ ఆలయమునకు

అర్చకులు వైఖానసులు. శివాలయమునకు అర్చకులు ఆదిశైవులు.

43. తిమ్మాపురము

ఈ గ్రామము నరసారావుపేటకు ఆగ్నేయదిక్కున 12 మైళ్ళదూరమున నున్నది. పూర్వమొకప్పుడు ఈ గ్రామమున్న ప్రదేశమునకు పెద్దకోతి యొకటి వచ్చి యచటనే మరణించె నట. ప్రజలు ఆకోతి హనుమంతుడుగ భావించి అది మరణించిన ప్రదేశమున నొక గ్రామము కట్టించి కోతిపేరు వచ్చునట్లుగా తిమ్మాపురము అని పేరిడి, ఆ గ్రామమందు హనుమంతుని ఆలయము కట్టించి, ఆదేవుని ప్రతిష్ఠించిరి. ఈ గ్రామమును కోతి తిమ్మాపురమనియు నందురు. ఇందు హనుమంతుని ఆలయమేకాక చంద్రమౌళీశ్వరాలయము కూడ నొకటి కలదు.

ఈ గ్రామమధ్యమున రాతి శాసన మొకటి కలదు. అందు "కులోత్తుంగచోడ గొంకరాజు భార్య కామిదేవి తమ్ముడగు "పరణయ" యనునాతడు గొంకేశ్వర నామధేయముతో సర్వజ్ఞం ప్రతిష్ఠించి నిత్యనైవేద్య దీపారాధనలకు ఒక తటాకమును త్రవ్వించి, తైలయంత్రమును దానమిచ్చినట్లు" కన్పించుచున్నది. ఇది సంస్కృతపదము. ద్వితీయావిభక్తి. సర్వజ్ఞం అనగా శివుని అని యర్థము భూమి లేకుండ తటాకమును త్రవ్వించి నిత్య నైవేద్య దీపారాధనలకు దాన

మిచ్చుట పొసగనేరని పని. ఈ చెరువు క్రింద సాగు కాదగినంత భూమితో గూడ చెఱువు త్రవ్వించి యిచ్చెనని చెప్పవలెను. ఈ గోంకేశ్వరాలయ మిప్పుడు కనిపింపదు. అది సమూలముగ నశించిపోయి యైన ఉండవలెను. లేకున్న ఆ యాలయమున చంద్రమౌళీశ్వరస్వామిని ప్రతిష్ఠించి యైనా యుండవలెను. ఈ శాసనము 1161 లోనిది.

గోపరాజు రామన్నగారు ఈ గ్రామ కరిణీకపు మిరాశీ రఘుపతిరాజుగారి కిచ్చియుండిరి.

ఆంజనేయస్వామి అర్చకులు వైఖానసులు పరాంకుశం వెంకటరంగాచార్యులు, నరసింహాచార్యులుగార్లు. చంద్రమౌళీశ్వరస్వామి అర్చకులు వెలనాటి పూజారులు చింతపల్లి సహదేవయ్య.

44. తంగేడుమిల్లి

ఇది నరసారావుపేటకు తొమ్మిదిమైళ్ల దూరమున దక్షిణ దిశగనున్నది. ఈ గ్రామమున హనుమంతుని గుడియు, చంద్రశేఖరస్వామి ఆలయమును గలవు. శివాలయము దగ్గర 1115 వ సంవత్సరములోని శాసనమొకటి కలదు. అందు కన్నరదేవచోడ మహారాజు మహీపాలుని మంత్రియగు మారయ యనునాతడు కొప్పరం గ్రామమున తటాకము

త్రవ్వించి ఆలయమును నిర్మించి సోమేశ్వరుని ప్రతిష్ఠించి యున్నట్లు లిఖింపబడినది హనుమంతుని ఆలయముదగ్గర ఒక శాసనమును, గ్రామములో మఱియొక శాసనమును గలవు. ఈ శాసనముల వలనను ఈ గ్రామచరిత్ర మేమియు వెల్లడి కాజాలదు.

ఈ గ్రామమునకును పవిడిపాడు గ్రామమునకును కావూరివారే శరిణీకపు మిరాశిదార్లు. కాని తమ మిరాశీని భాస్కరునివారి ఆడుబిడ్డ పసుమర్తి లింగరాజుగారి భార్యకు విక్రయించెను. అప్పటినుండి యీ మిరాశీ పసుమర్తివారి దయ్యెను. ఈగ్రామమున నిటీవల సీతారామస్వామివారి ఆలయ మొకటి కట్టింపబడినది. ఆంజనేయస్వామి, సీతారామస్వామి వార్ల అర్చకులు వైదికులు పోతుకుచ్చి సత్యనారాయణగారు. మల్లేశ్వరస్వామివారి అర్చకులు ఆదిశైవులు కొండకావూరి అప్పయ్య, సీతారామాస్వామిగార్లు.

45. తురుమెళ్ళ

ఈ గ్రామము నరసారావుపేటకు నైరృతిదిశన పంౘ్రెండుమైళ్ల దూరమున నున్నది. ఇది చిన్నగ్రామము. ఇందు శిథిలమైన యొక దేవాలయము కలదు. ఈ గ్రామ కరణములు తురుమెళ్ళవారు.

46. తూబాడు

ఈ గ్రామము నరసారావుపేటకు 12మైళ్ల దూరములో నున్నది, వెలనాటి కులోత్తుంగ చోళుకు కొండవీటి సీమలో పడమరభాగమును 1115 లో తన తమ్ముడగు బుద్ధవర్మ కిచ్చెను. అతడు గోవన్నను సేనాధిపతిగా జేసెను. ఆ గోవన్న యిచట పట్టణము నిర్మించి ఉత్తరభాగమున భీమేశ్వరస్వామిని ప్రతిష్ఠించి యీ నగరమునకు తూంబాడు అని నామకరణము చేసి 1123 వ సంవత్సరమున ఈ విషయమంతయు ఒక శాసనమున లిఖింపజేసెను.

తర్వాత రెడ్డిరాజు లిచట 1436 వఱకు రాజ్యముచేసిరి. అటుపిమ్మట నరపతులును, కర్నాటులును పాలించియుండిరి. వారి రాజ్యానంతరమున ఫాదుషావారి రాజ్యమేర్పడెను. వారిరాజ్యములో అమీనమమల్కు అనువాడు గుళ్లు పగుల గొట్టించి, ఈ రాళ్లను కొండవీటికి తోలుకొనిపోయి, అచట మసీదులు కట్టించెను.

పిమ్మట ఈ గ్రామము నాదెండ్ల సమతులో చేర్చి నల్ల బోతు చౌదర్లు, దేశపాండ్యాలు అయిన ప్రాతునివారు ఇచట రావలసిన పన్నులను అమానీ మామ్లియతు జరిపించిరి. తరువాత నీ గ్రామము కొండవీడుజిల్లా జాగీరుక్రిందకు వచ్చెను. 1720 సంవత్సరములో మానూరివారి స్వాధీనములో నుండెను.

1752 వ సంవత్సరమున నిజామల్ ముల్కు కుమారుడైన నాసర్ జంగ్ ఈ గ్రామము నితర గ్రామములతో కూడ ఫ్రెంచి వారి కొసంగెను. అటుపిమ్మట ఫ్రెంచీవారినుండి బసాలత్ జంగు స్వాధీనము చేసికొనెను. 1770 సంవత్సరమున తిరిగి నరసన్నారావుగారి స్వాధీనమునకు వచ్చెను. ఈ విధముగా నీ గ్రామము ఒకరి యధీనములోను నెక్కువకాలముండక పలువురి చేతులలో తిరుగుచు నుండెను.

ఆ సమయమున కరిణీకపు వంశములోని తూమాటి అక్కరాజు గ్రామమునకు పడమటిదిక్కున ఉమామహేశ్వర స్వామి ఆలయమును కట్టించెను. మఱియొక కరణము శివాలయమునకు సమీపముననే ఆంజనేయస్వామివారి ఆలయమును, దానికుత్తరముగ మానూరి వెంకటకృష్ణమ్మగారి తల్లి వెంకమ్మగారు కేశవస్వామి ఆలయమును కట్టించిరి. ఈ గ్రామమున వినాయకుని ఆలయమును మఱియొకటి కలదు.

గోపరాజు రామన్నగారు కరిణీకముల నిచ్చునపుడు ఈ గ్రామకరణముగ తూబాడు గంగరాజు నేర్పఱచెను.

ఈ గ్రామము ఒకరిచేతిలో నుండ పలువుర చేతులలోనికి మారుచు వచ్చినట్లు కన్పడుచున్నది. ఇది ఆకాలమున ముఖ్యపట్టణముగ నుండుట వలననే దీనిపై ప్రతివారును కన్నువేసి యుండవచ్చును. అందువలన ఒకరిని జయించి యొకరు, వారిని

జయించి మఱియొకరు దీనిని స్వాధీన పఱచుకొనుచు వచ్చిరనుట నిక్కవము. ఆ జయములు పోరాటములులేక సంభవింపవు. అట్టిపోరాటములలో తూపులు ఆడియుండక తప్పదు కదా? తూపు అనగా బాణము. అట్లు పెక్కు పర్యాయములు తూపులతో యుద్ధములు జరిగిన ప్రదేశమగుటచే నిది తూపాడు అని పిలువబడి యుండవచ్చును. అదియే యుచ్చారణ సౌలభ్యమునకు సరళ వర్ణముచేర్చి తూబాడు అని పిలువబడెను.

ఈ గ్రామములోని చెన్నకేశవస్వామి, ఆంజనేయస్వామి వార్ల అర్చకులు వైఖానసులు పరాంకుశం రంగాచార్యులు రామాచార్యులుగార్లు. శివాలయమునకు అర్చకులు ఆదిశైవులు నాదెండ్ల సుబ్బయ్య, జ్వాలయ్య, సత్యనారాయణ అనువారు.

47. ద్రోణాదుల

నరసారావుపేట కిరువదిరెండుమైళ్ళ దూరమున ద్రోణాదుల అను గ్రామము కలదు. ఇది పూర్వము జైనుల గ్రామము. తర్వాత హిందూ ప్రభువుల క్రిందకువచ్చినది. ఇందు సోమేశ్వరస్వామి దేవాలయము, వీరభద్రుని దేవాలయము, గ్రామదేవతయగు అక్కులదేవి ఆలయము కలవు. ఈ గ్రామములో 1155 వ సంవత్సరమునాటి శాసనమొకటి కలదు. ఈశాసనము కులోత్తుంగ చోడ మహారాజు కాలములోనిది. ఇందు కొంత

భూమి సోమేశ్వరస్వామివారికి దానముగా నిచ్చినట్లు వ్రాయబడి యున్నది. ఇదిగాక మఱియొక శాసనమునుగలదు. అందు శ్రీనాధరాజు వేంకటాద్రి దేవర అక్కలదేవికి భూదానము చేసినట్లున్నది. ఈ శాసనమున పల్నాటిసీమ కధిపతియగు అనుగుదేవర మహారాజు పేరు కన్పడుటచే ఆ మహారాజే గ్రామదేవతకు భూదానము చేసెనని చెప్పవలెను.

ఈ గ్రామ కరణములు చలివేంద్రవారు. విఠంవారు. ఈ గ్రామముననే తర్వాతికాలములో నెవరో కోదండరామస్వామి ఆలయమునుగూడ కట్టించియున్నారు. ఈ స్వామివారి అర్చకులు వైఖానసులు వేదాంతం పున్నమాచార్యులు, పురుషోత్తమాచార్యులుగార్లు. శ్రీ సోమేశ్వరస్వామి అర్చకులు ఆది శైవులు మువ్వా కోటయ్య గారు.

48. నెకరికల్లు

ఈ గ్రామము నరసారావుపేటకు నాల్గుమైళ్ళ దూరములో నున్నది. దీనికి ఆది నృసింహపురమని మొదట పేరు పెట్టబడినట్లు శాసనములవలన కనబడు చున్నది. ఈ గ్రామమున నొక కొండయున్నది. ఈ కొండ యందధికముగ నా కాలమున నక్కెరుచెట్లు కలిగియుండుటచే నక్కెరుకల్లు అనిపేరు వచ్చియుండును. కల్లుఅనగా కొండయని యర్థము. ఆ నక్కెరుకల్లే వ్యవహారములో వర్ణలోపాదు లేర్పడిన నకెరికల్లనియు, ఎకార వ్యత్యాసముతో నిపుడు నెకరికల్లుగా మారినది. పూర్వము ఆది నరసింహ పురమని పేరిడినను కొండయొక్క పేరే గ్రామనామముగ సిద్ధమయ్యెను.

ఈ గ్రామమందలి కొండమీద నరసింహస్వామి దేవాలయము, త్రిపురాంతకస్వామి దేవాలయము కలవు. నరసింహస్వామి దేవాలయములో నొక శాసనమున్నది. అందు "ఈ నరసింహస్వామి లక్ష్మీసహితుడై కరుణతో నగరము కాచుచుండెననియు, ఈ నృసింహదేవరకు గోపాలయ్య ఎనుబది పుట్ల భూమినిచ్చెననియు, సింగవిభుడు దానినే నూరుపుట్ల భూమిగ పెంచెననియు, ఇది ఆదినరసింహ పురముగ ఒప్పెననియు" వ్రాయబడి యున్నది. దీనివలన ఈ నృసింహస్వామి ఆలయము అనాదియనియు, ఇది నరసింహ క్షేత్రమనియు అర్థమగుచున్నది. ఈ శాసనము 1365 నాటిది.

మఱియు నీ గ్రామమున నూంకారమ్మ, పోలేరమ్మ అను గ్రామదేవతల గుడులుకలవు. పోలేరమ్మగుడిలో మఱియొక శాసనమున్నది. ఆ శాసనమున కరికాల చోడగండని మంత్రియగు చోడపశెట్టి నూంకారమ్మకు కొంత దానమిచ్చినట్లుగ కన్పడుచున్నది.

నరసింహస్వామి అర్చకులు. పాంచరాత్రులు. త్రిపురాంతరస్వామి అర్చకులు ఆది శైవులు. కొమ్మవరపు హుళక్కయ్యసాంబయ్య, అప్పయ్య అనువారు.

49. నాదెండ్ల

ఈ గ్రామము నరసారావుపేటకు ఆగ్నేయ దిశయందు పదిమైళ్ల దూరముననున్నది. ఇది చారిత్రక ప్రసిద్ధమైన గ్రామము. ఈ గ్రామమునకు చుట్టును, మధ్యయు కొండలు గలవు. ఇచట ననేక శాసనములున్నవి. 1046 సంవత్సరపు శాసనమున "ముక్కోల గోమన శెట్టి యనునాతడు విశ్వేశ్వర దేవునినిల్పి మంటపర మెత్తించినట్లు" కనబడు చున్నది. ఈ గ్రామముననే పొలములో దొరికిన శాసనమున మహాప్రధాని యగు అనంత భూపాలుని పేరు వ్రాయబడి యున్నది. ఇంకను 12 వ శతాబ్దినాటి శాసనము లనేకములు గలవు. ఆ శాసనములలో నొకదానియందు మూల స్థానేశ్వరుని దేవాలయ మొకటి యున్నట్లును, ఆ స్వామికి పెట్టబడు నైవేద్యములో ఎవరెవరికి ఎంతెంత చెందవలసినదియు వ్రాయబడియున్నది. మఱియొక శాసనమున "(శ్రీ) మన్మహామండలేశ్వర బుద్ధరాజు కుల సతియైన గుండమహాదేవి తాను కట్టించిన గుండసముద్రమును గ్రామమును మూలస్థానేశ్వరునకు నైవేద్యము కొఱకిచ్చినట్లు కలదు. 1173 వ సంవత్సరపు శాసనమునుబట్టి ఈ గ్రామమున కేశవదేవర ఆలయమున్నట్లును. మండెరాజు దాన మిచ్చినట్లును కనబడుచున్నది. ఇంకను ఈ కేశవదేవరకు అనేక దానము లీయబడినట్లు పెక్కు శాసనములలో తెలుపబడి

యున్నది. ఇంకొక శాసనమున "గోవర్ధన దేవుని కొండయందు ప్రతిష్ఠించి అనేక దానము లిచ్చినట్లు వ్రాయబడి యుండెను.

ఇప్పుడు కొండపైన పట్టాభిరామస్వామి, హనుమంతుని దేవాలయములు కలవు. చెన్నకేశవ, గోవర్ధనాలయములు కొండమీద ఖిలములై పోగా గ్రామమధ్యమున ఆ యాలయములు రెండును తిరిగికట్టింపబడి అతివైభవముగా జరుపబడు చున్నవి. పట్టాభిరామస్వామి దేవాలయమును మానూరి వెంకటప్పయ్యగారు జీర్ణోద్ధరణచేసి పునః ప్రతిష్ఠజరిపి భూదానము చేసియుండిరి. చెన్నకేశవస్వామి, గోవర్ధనస్వామి ఆలయములు రెంటికి మానూరి వెంకట గోపాల రాయణింగారిచే భూదానము చేయబడెను.

చెన్నకేశవస్వామి, గోవర్ధనస్వామి, ఆంజనేయస్వామి వార్ల అర్చకులు వైఖానసులు పరాంకుశం వెంకట రంగాచార్యులు, నరసింహాచార్యులు, రామాచార్యులు అనువారు. పట్టాభిరామస్వామి అర్చకులు పరాంకుశం రామాచార్యులు. మూలస్థానేశ్వరస్వామి అర్చకులు ఆదిశైవులు. నుదురుపాటి భద్రయ్య, నాగేశ్వరరావు. కోటేశ్వరరావు అనువారు.

50. పెట్లూరిపాలెం

ఈ పాలెం నరసారావుపేటకు దక్షిణమున నైదుమైళ్ల దూరమున గలదు. తెలుగురాయడు ప్రభుత్వము చేయుకాలమున, ఈ గ్రామము మున్న ప్రదేశము అరణ్యముగ నుండెడిది.

తెలుగురాయడు అరణ్యమును ఛేదించి యొక గ్రామము నేర్పఱచి కొణిదెన త్రికోటీశ్వరస్వామివారి ఉత్సవములలో పెట్టదిమ్మలు ప్రేల్చునిమిత్తం ఈ గ్రామమును అగ్రహారముగా నిచ్చిరి. అందువలన నీ గ్రామమునకు పెట్లూరిపాలెం అను పేరువచ్చియుండెను. ఈ గ్రామము కొంతకాలము త్రికోటీశ్వర స్వామి పేరటనే యున్నది. కృష్ణదేవారాయలవారి కాలమున తన సైన్యములోని ఏనుగులు ఇచట నీళ్లుత్రాగుటకు ఏర్పాటు చేసెను. ఆ సమయమున గ్రామకాపు తాళ్ళూరిమాకినీడు. ఈ భక్తుడు ఆ గ్రామములో నొక విష్ణుదేవాలయము కట్టించి దేవుని ప్రతిష్ఠించుటకు యత్నించుచుండగా ఒకనాటిరాత్రి భగవంతుడు తనకు స్వప్నమందు కన్పడి, ఇచటికి సమీపములోనున్న వల్మీకములో ఉభయ నాంచారులతో కేశవదేవర ఉన్నాడు. పుట్టకు పాలుపోసిన యెడల నీకు లభించగలడనియు ఆ దేవుని ఈ యాలయమున ప్రతిష్ఠింప వలసినదనియు చెప్పి అంతర్ధానమయ్యెను. అంతటలేచి మాకినీడు అదే విధముగ చేయగా ఉభయ నాంచారులతో కేశవస్వామి విగ్రహము కనుపించెను. మహదానందముతో ఆ విగ్రహములను దెచ్చి యథావిధిగా ప్రతిష్ఠజరిపి భూమి నొసంగియుండెను. ఈ విషయ మొక శాసనమున వ్రాయబడియున్నది. అప్పటినుండియు ఆ భక్తుని పుట్టిపాల మాకినీడని పిలువ నారంభించిరి.

కొంతకాల మీ గ్రామము గుంటుపల్లి భాస్కరుని ఆధిపత్యము క్రిందనుండెను. పిమ్మట మల్రాజువారి ఆధిపత్యము లోనికి వచ్చెను. వారిలో సూరన్నగారు దేవాలయములకు మాన్యములనిచ్చి, సన్నదులు వ్రాయించి యిచ్చిరి. మల్రాజు వారి పిమ్మట శేఖర్ జంగ్ అను పౌజుదారు ఆధీనము లోనికి 1784న వచ్చెను. వారి తరపున పనిజేయుచున్న బిల్లెడగు వెంకట నారాయణ అనువారు పూర్వులిచ్చిన మాన్యములను స్వామి వారి క్రింద చెల్లకుండ జేసెను. ఆ సమయముననే ఆలయములో దోపిడిగాండ్రు ప్రవేశించి మూలస్వామితో గూడ ఆభరణ ములనపహరించుకొని పోయిరి.

కొంత కాలమునకు తిరిగి మల్రాజువారికి అధికారము వచ్చెను. పిమ్మట తిరిగి చెన్నకేశవస్వామిని ప్రతిష్ఠింపజేసి మాన్యముల నిచ్చిరి. ఈ విధముగ అనేక మార్పులు చెందుచు వచ్చెను.

ఈ గ్రామ కరిణీకము పెట్లూరిపాలెం వారికిని, కొల్లగారు వారికిని గలదు. కొంత కాలమునకు వారినుండి మారిబొడ్డుచెర్ల వారికి సంక్రమించెను. ప్రస్తుతము గుంటుపల్లి వారు కరణము లుగా నున్నారు.

ఇటీవల ఒక భక్తుడు (శ్రీ) సీతారామస్వామివారి ఆలయమును కట్టించి ప్రతిష్ఠజరిపి భూములిచ్చి యున్నాడు. ఈ ఆల

యమునకు అర్చకులు వైఖానసులు, దీని సీతారామచార్యులు గారు.

51. పసుమర్రు

ఈ గ్రామము చిలకలూరిపేటకు తూర్పుదిక్కున రెండు మైళ్ల దూరమున నున్నది. ఈ గ్రామ కరిణీకమును గోపరాజు రామన్నగారు పసుమర్తి వారికిచ్చిరి. 16 వ శతాబ్దిలో కృష్ణదేవరాయలు ఈగ్రామము ఆఱుభాగములుగ విభజించిరి. అరిపిరాలవారికిని, మద్దూరివారికిని, శ్రీరామ కవచంవారికిని, నెమ్మానివారికిని ఇనమండ్రవారికిని, చింతామణివారికిని అగ్రహారములుగ నిచ్చెను. మద్దూరి యల్లంభొట్లనువారు గ్రామమునకు నడుమ కేశవస్వామి ఆలయము కట్టించి ప్రతిష్ఠ చేయించిరి. దీనికి తర్వాత ఆగ్నేయమున సోమేశ్వరాలయము కట్టించిరి.

విభురాం షాహా కాలములో దేవాలయములు జప్తు చేయబడగా ఆస్తిపాస్తులన్నియు పోవుటచే దేవాలయములు పాడుబడి కొంతకాలమునకు శిథిలములయ్యెను. తర్వాత కొన్ని దినములకు ఈ గ్రామము మానూరి వారి వంతుకు వచ్చెను. వీరి కాలములో విష్ణ్వాలయము కట్టించి చెన్నకేశవస్వామి విగ్రహములు భిన్నములగుటచే వేణుగోపాలస్వామిని ప్రతిష్ఠించిరి. అటుపిమ్మట వెంకట్రాయనింగారి ప్రభుత్వ సమయములో

గ్రామపౌరోహితులైన కంతేటి జోస్యులుగారు శివాలయం కట్టించగా వెంకట్రాయనింగారు తాండవేశ్వరస్వామిని ప్రతిష్ఠించిరి. 1756 లో వేణుగోపాలస్వామివారి మూలబేరము భంగమగుటచే అందు వేంకటేశ్వరస్వామిని ప్రతిష్ఠించిరి. ఈ గ్రామములో మఱియొకరు లక్ష్మీనరసింహస్వామి ఆలయము కట్టించి స్వామివారి ప్రతిష్ఠ చేసిరి.

అటుపిమ్మట పంపిణీలలో ఈ గ్రామము వేంకటేశంగారి వంతుకు వచ్చినందున సత్తెనపల్లిలోనికి జేరెను. ఇటీవల వేంకటేశ్వరస్వామివారి ఆలయం శిథిలముకాగా గ్రామవాస్తవ్యులు మరమ్మతులు చేయించి గోపుర ప్రాకారాదులు కట్టించిరి. శ్రీ వేంకటేశ్వరస్వామి అర్చకులు వైఖానసులు. మురికిపూడి నరసింహాచార్యులు, శేషాచార్యులు, హనుమాచార్యులు, రాఘవాచార్యులు, రాఘవాచార్యులు, పరుచూరి కష్ణమాచార్యులు, హనుమాచార్యులు అనువారు. తాండవేశ్వరస్వామి అర్చకులు ఆదిశైవులు తుర్లపాటి వీరయ్యగారు.

52. పవిడిపాడు

ఇది నరసారావుపేటకుత్తర దిక్కున తొమ్మిది మైళ్ళ దూరమున నున్నది. శాసనములను బట్టి చూడగా మొదట పహిండిపాడు అనుపేరు గలిగి యున్నట్లు తెలియుచున్నది. ఇందు వల్లభరాజస్వామి దేవాలయము కలదు. అందున్న

గరుడ స్తంభముమీద 1165 నాటి శాసనముకలదు. అందు గండి రాజనువారు వహిండిపాటియందు చెన్న కేశవ దేవర ప్రతిష్ఠ చేసి, భూదానము చేసినట్లును, రాజేంద్రచోడ మహారాజు వహిండిపాటిలో పెండ్లిసుంకములు శ్రీ దేవరకిచ్చునట్టి యేర్పాట్లుచేసి నట్లును వ్రాయబడియున్నది.

ఈ గ్రామమున సోమేశ్వరాలయము మఱియొకటి కలదు. దరిమిలా గ్రామములోని భక్తులొకరు శ్రీ సీతారామ స్వామి యాలయము కట్టించి ప్రతిష్ఠ జరిపిరి. సర్వశాస్త్ర పండితులును, బహు గ్రంథకర్తలునగు బెల్లంకొండ రామారావు గారు ఈ గ్రామ వాస్తవ్యులే. వీరు వల్లభరాజ స్తవము, సముద్రమథన చంపూకావ్యము, వేదాంతకౌస్తుభము, హయగ్రీవ శతకము మున్నగు మహాగ్రంథములను వ్రాసిరి.

శ్రీ వల్లభరాజస్వామివారి అర్చకులు వైఖానసులు రాంపిచర్ల నరసింహాచార్యులు. సోమేశ్వరస్వామి అర్చకులు ఆదిశైవులు. చందలూరి సుబ్బయ్య.

53. పూనూరు

ఈగ్రామము నరసారావుపేట తాలూకాలోనిది. ఇందు మదనగోపాలస్వామివారి ఆలయము కలదు. అందు 1390 నాటి శాసన మొకటి కలదు. ఈ గ్రామములోని నూతియందు

ఒక శాసనము లభించినది. అందు తెలుగుచోడ మహారాజు ప్రశస్తికలదు. ఈ శాసనముల వలన నీ గ్రామచరిత్ర యేమియు వెల్లడికాక యున్నది.

ఈ గ్రామ కరిణీకం మొదట ముప్పరాజువారిది. తర్వాత వారా మిరాశీని అమ్ముకొనిరి. ఇపుడు సాలసవారును, అప్పిచర్ల వారును కరణములు. ఈ గ్రామమున వీరభద్రస్వామి దేవాలయముకూడ గలదు. గోపాలస్వామి అర్చకులు వైఖానసులు వేదాంతం వెంకటాచార్యులు. వీరభద్రస్వామి అర్చకులు ఆది శైవులు మూలంరాజు వెంకటసుబ్బయ్య, కుమారస్వామి.

54. పోలూరు

నరసారావుపేటకు ఆగ్నేయమున పందొమ్మిదిమైళ్ల దూరమున పోలూరు అను గ్రామమున్నది. ఇక్కడ స్తంభముమీద రెండు శాసనములును, బండపై ఒక శాసనమును కలవు. ఇచట పురాతమైన చెన్న కేశవస్వామి దేవాలయము శిథిలావస్థకురాగా శ్రీ స్వామివారి అర్చకులైన పరుచూరి పెద శేషాచార్యులుగారు ఆలయ, గోపురాది నిర్మాణము గావించి 1938 బహుధాన్య సం॥ చైత్రం ౧ శుక్రవారమునాడు పునః ప్రతిష్ఠ చేయించిరి. ఈ గ్రామములో పురాతనమైన చెన్న మల్లేశ్వర స్వామి దేవాలయము మఱియొకటి కలదు.

శ్రీ చెన్న కేశవస్వామి అర్చకులు వైఖానసులు. పరుచూరి పెదశేషాచార్యులు, చిన్న శేషాచార్యులు, లక్ష్మమ్మ, చలపతాచార్యులు అనువారు. చన్నమల్లేశ్వరస్వామి అర్చకులు ఆదిశైవులు నూతలపాటి భద్రయ్య.

ఈ గ్రామ కరిణీకము పోలూరివారిది. ఈ గ్రామములోని శివాలయము శిథిలముకాగా ప్రత్తిపాటి వాస్తవ్యులైన ప్రతాప హనుమచ్ఛాస్త్రిగారు 1958 లో జీర్ణోద్ధరణ గావించిరి. శ్రీ చెన్న కేశవస్వామి, శ్రీ భూ దేవుల ప్రతిష్ఠయు, ఆంజనేయ, గరుడధ్వజ విఖనసాచార్య విమాన గోపురాతి ప్రతిష్ఠలును పెదశేషాచార్యులుగారి వలన నిర్వహింపబడెను. గాలిగోపురము లక్ష్మమ్మగారి వలన నిర్మింపబడెను.

55. పురుషోత్తపట్టణము

చిలకలూరిపేటకు పడమటిదిశన ఈ గ్రామము కలదు. 1462 లో పురుషోత్తమ గజపతి, పురుషోత్తము డనువారు కొండవీటిని పరిపాలించు నపుడీ గ్రామమును కట్టించిరి. అందువలన పురుషోత్తమ పట్టణమను పేరువచ్చినది. ఇందు లక్ష్మీనరసింహస్వామి దేవాలయ మొకటి కలదు. అందు 1248 లోని శాసన మొకటి కన్పించుచున్నది. అందు "గణపతి దేవ మహారాజుగారి ప్రధానియగు భాస్కర దేవుని తమ్ముడు పకయు అనువారు "కోట్యదాన" శంకరేశ్వరస్వామికి దానమిచ్చినట్లు

లిఖింపబడి యున్నది. ఇదిగాక 1399 లోని శాసనము మఱి యొకటి కన్పించుచున్నది. ఈ శాసనమువలన గరుడకంబ మొకటి స్థాపింపబడినట్లు తెలియుచున్నది. ఈ శాసనములను బట్టిచూడ శంకరేశ్వరస్వామి ఆలయ మొకటి యున్నట్లును, విష్ణ్వాలయములో గరుడకంబ మొకటి స్థాపింపబడినట్లును, అర్థమగుచున్నది.

ఇచట పూర్వము తోటలింగప్పగారి కుమారుడు కృష్ణమ్మగారి కాలమున గోపీనాథుని దేవాలయ మొకటి నిర్మింపబడి యుండెను. ఈ నిర్మాణము 18 వ శతాబ్దిలో జరిగి యుండవచ్చును. ఆ సమయమున తోటవారి వంశములో ప్రెక్కంద్రు తహశీల్దార్లుగా నుండి యుండిరి. తమ పలుకుబడిని, అధికారమును ఉపయోగించి కొండవీటిలో పాడుపడి యున్న శివాలయ భాగములను జేర్చి గోపినాథుని ఆలయము కట్టించి ఇచటికి పదిమైళ్ల దూరములో నున్న "బల్లికురువ" గ్రామములో దొరకిన గోపినాథస్వామిని రుక్మిణీ సత్యభామలతో సహా తీసుకొనివచ్చి యీ యాలయమున ప్రతిష్ఠించినట్లు చెప్పుదురు. శ్రీ స్వామివారి కళ్యాణమంటపము కూడ పూర్వము కొండవీటిలోని గోపినాథస్వామివారి మంటపమే యనియు, అది త్రవ్వితీసిన ప్రదేశములో గుర్తులిప్పటికిని నున్నవనియు చెప్పుటకూడ కలదు. ఇందలి నిజానిజములు లెట్లున్నను ఈ మంటపము శిల్ప సౌందర్యముతో విరాజిల్లుచు మనవారి శిల్ప నైపుణ్యమును వెల్లడించు చుండును. ఈ స్వామివారి అంగ

రంగ వైభవములు జరుగుటకై జమీందార్లు 260 యకరముల భూమి తోటకృష్ణమ్మ సనదుపొందినట్లుకూడ చెప్పుచుందురు. ఇప్పటికిని తోటవారే వంశ పారంపర్యముగ ధర్మకర్తలై యున్నారు. దీనినిబట్టి చూడ పెద్దలసూక్తిలో అసత్యమేమియు లేనట్లు స్పష్టమగుచున్నది. ఇప్పటి కిరువది సంవత్సరముల క్రిందటి వఱకు (శ్రీ) స్వామివారి యుత్సవములు మహావైభవముగ జరుగుచుండెడివి.

ఈ గ్రామమున శివాలయమును, ఆంజనేయస్వామి దేవాలయమును నున్నవి. ఈగ్రామము నానుకొని ఓగేరు ప్రవహించు చుండును. ఈ గ్రామమున తోట వెంకటకృష్ణమ్మ, రామకోటీశ్వరరావుగార్లు 1954 వ సంవత్సరములో బాపూజీ విద్యావిధానము ననుసరించి బేసిక్ ట్రైనింగ్ స్కూలును స్థాపించి దానికి 11 యకరముల భూమిని దానమిచ్చిరి. గోపినాథస్వామి అర్చకులు వైఖానసులు మురికిపూడి వెంకటాచార్యులు వగైరాలు.

56. బబ్బేపల్లి

నరసారావుపేటకు ఇరువది మైళ్ళదూరమున ఆగ్నేయ దిశయందు ఈ గ్రామమున్నది. ఈ గ్రామమున వేణుగోపాలస్వామి, మల్లేశ్వరస్వామి వార్ల దేవాలయములు రెండు కలవు. ఇవి చాలపురాతనములైనవి. మల్లేశ్వరస్వామి దేవాలయమున

నొక శాసనమున్నది. అందు తిరుకలి దేవచోడమహారాజు తిరుకలీసు దేవర ప్రతిష్ఠచేసి యూరికి దక్షిణమున కొంత పొలము దానము చేసినట్లు వ్రాయబడి యున్నది. పూర్వము తిరుకలేశ్వరస్వామి యనుపేరుతో వ్యవహరింపబడు దేవుడే యిపుడు మల్లేశ్వరుడుగ వ్యవహరింపబడుచుండెనని చెప్పవచ్చును. పూర్వపు రాజులు కట్టించిన శివాలయములన్నియు వారిపేర్లతోనే వ్యవహరింపబడినట్లు కన్పడుచున్నది. ఆ ఆచార ప్రకారమే యీ దేవుని పేరు మొదట తిరుకలేశ్వరుడని పెట్టబడుటయు ఆపేరు కొంతకాలమునకు సోమేశ్వరుడుగ మారుటయు జరిగియుండును.

ఈ గ్రామకరణములు యరచర్లవారు. వారే బబ్బేపల్లివారైరి. గోపాలస్వామి అర్చకులు వైఖానసులు. వేదాంతం కృష్ణమాచార్యులు, శేషాచార్యులు అనువారు. మల్లేశ్వరస్వామి అర్చకులు ఆదిశైవులు మువ్వా కోటయ్య.

57. బోప్పూడి

నరసారావుపేటకు ఆగ్నేయమున పదునొకండుమైళ్ల దూరమున ఈ గ్రామము కలదు. పూర్వ మీ గ్రామమున్న ప్రదేశము అరణ్యప్రాంతముగ నుండెడిది. ఈ యరణ్యముతో గూడిన కొండయందు ఋషులు తపస్సు చేసికొనెడివారని ప్రతీతి. ఇప్పటికిని ఈ కొండయందు తపస్సంపన్నులున్నా

రనియు, వారెవరికిని కన్పించరనియు చెప్పుదురు. ఇచట వేంకటేశ్వర స్వామి ఆలయము కలదు. ఇది స్వయం వ్యక్తమందురు. కరికాల చోడవంశపు బొబ్బిలి దేవ మహారాజువారిచటికి వచ్చి కొండమీద ఆవిర్భవించిన వేంకటేశ్వరస్వామివారికి అచటనే ఆలయ ప్రాకారాదులు కట్టించి, కొండక్రింద చెన్న కేశవస్వామి దేవాలయము నేర్పఱచి, దాని సమీపమున మల్లేశ్వరస్వామి యాలయమును నిర్మాణముచేసి, ఆ ప్రాంతములోని అరణ్యము కొట్టించి గ్రామనిర్మాణము చేసి బొబ్బిలిదేవ పురమని పేరిడిరి. అదియే ఇప్పుడు బొప్పూడిగా వ్యవహరింపబడుచున్నది. 1080 వ సంవత్సరములో నన్నచోడుడు చెన్న కేశవస్వామికి భూదానముచేసి శాసనము వ్రాయించిరి. ఈ శాసనములో నన్నచోడుడు చెన్న కేశవస్వామికి మాత్రమే భూదానము చేసినట్లు కన్పడుచున్నది. వేంకటేశ్వరస్వామికిని, మల్లేశ్వర స్వామికిని బొబ్బిలిదేవ మహారాజే భూములిచ్చి యుండెనని ఊహింపవచ్చును.

తర్వాత మొగలాయీల రాజ్యములో ఈ మాన్యములన్నియు నేలము వేయించబడెను. ఆ సమయమున ఈ ఆలయములు అంతరించు పరిస్థితి సంభవించెను. పిమ్మట కరిణీకపు మిరాశీదారుడైన బొప్పూడి రాఘవన్నగారు 1265 లో ఆలయములకు ప్రాకార మంటపాదులు కట్టించి అర్చనాది కైంకర్యములు జరుగునట్లు చేసిరి. తర్వాత కొంతకాలమున కీ గ్రామము

జప్తుచేయబడి మల్రాజు సూరన్నగారు వేలమునకు పెట్టగా ఆ వేలమున వాసిరెడ్డి వెంకటాద్రినాయుడుగారీ గ్రామమును కొనియుండిరి. అటుపిమ్మట సంతులలో నిది మల్రాజువారి స్వాధీనమయ్యెను.

ఈ గ్రామమునకు పడమరదిక్కున కొన్ని దిబ్బలున్నవి. అవి బౌద్ధస్తూపములుండు ప్రదేశము లందురు. విష్ణ్వాలయమునకు అర్చకులు (శ్రీ) వైఖానసులు మురికిపూడి నరసింహాచార్యులు, శేషాచార్యులు, హనుమాచార్యులు, రాఘవాచార్యులు అనువారు. మల్లేశ్వరస్వామి అర్చకులు ఆదిశైవులు, సోమరాజు శివానందము, సుబ్బయ్యగార్లు.

58. మిన్నికల్లు

ఈ గ్రామము నరసారావుపేటకు దక్షిణమున నున్నది. ఈ గ్రామమున మల్లికార్జున దేవాలయము కలదు. అచట నొక శాసనమున్నది. దానియందు కిన్నరదేవ చోడమహారాజు మల్లికార్జునస్వామికి భూదానము చేసినట్లున్నది. కృష్ణదేవరాయని కాలములో నీ గ్రామ మగ్రహారముగ నిచ్చినట్లు కన్పడుచున్నది. ఈ గ్రామ కరిణీకము మొదట చీమకుర్తి వారిది. ఇపుడు మిన్నికంటివారే కరణములుగ నున్నారు. మల్లికార్జునస్వామి అర్చకులు ఆదిశైవులు. యడ్లపాటికోటయ్య, రామలింగయ్య.

59. ము ల క లూ రు

ఇది నరసారావుపేటకు ఉత్తరదిక్కున నాలుగుమైళ్ళ దూరములో నున్నది. ములకలూరి కోటంరాజు అనేవారు గ్రామమునకు ఈశాన్యదిక్కున మల్లేశ్వరాలయము కట్టించి స్వామిప్రతిష్ఠ గావించిరి. తర్వాత కొన్నాళ్ళకు చెరుకూరు కాపురస్థుడు చేరాలకోనప్ప యనువారు ఈ గ్రామముననే విష్ణ్వాలయము కట్టించి వేణుగోపాలస్వామి ప్రతిష్ఠ చేసిరి. ఇపుడు విష్ణ్వాలయము శిథిలమైనది. శివాలయములో నొక శాసనమున్నది. కాని ఈ గ్రామమునకు సంబంధించినదికాదు. మల్లేశ్వరస్వామి అర్చకులు ఆదిశైవులు. చందలూరి వెంకట్రాయుడు, సాంబయ్యగార్లు.

60. ము న మా క

ఇదియు నరసారావుపేట తాలూకాలోనిది. ఇందు అమరేశ్వరస్వామివారి దేవాలయము కలదు. ఇందు 1223 వ సంవత్సరపు శాసనము కలదు. అమరేశ్వర దేవునకు దానమిచ్చినట్లు వ్రాయబడి యున్నది. ఆ దానమెద్దియో తెలియదు. దేవునకిచ్చునది భూదానమేకనుక అదియే కావచ్చును. ఈ గ్రామమునకు తూర్పున చోళులు ప్రతిష్ఠచేసిన శివాలయమొకటి యుండెడిదట. అది శిలమై పోయినది. దక్షిణదిక్కున ఆంజనేయస్వామి దద్దళమున్నది. ఈ గ్రామ కరిణీకము శ్రీగిరి

రాజువారికి, బెల్లంకొండవారికి ఈయబడెను. ఇది యొకప్పుడు బెల్లంకొండవారికి మొఖాసాగా నీయబడినదట. బెల్లంకొండవారి కరిణీక మిరాశీ భాగమును దౌహిత్రుడైన విశ్వాసం రామన్నకు ఇచ్చెను. అమరేశ్వరస్వామి అర్చకులు ఆదిశైవులు. ఆంజనేయస్వామి అర్చకులు వైఖానసులు వేదాంతం వెంకట్రామాచార్యులు.

61. ము త్త న ప ల్లి

ఇది మునమాకకు మైలు దూరములో నున్నది. ఇది అగ్రహారము. ఈ అగ్రహారములో శాఖమూరువారికి వాసిరెడ్డివారికి భాగములుగలవు. 1223 వ సంవత్సరమున వేయబడిన శాసనములో అమరేశ్వర దేవరకు నిత్యనైవేద్య దీపారాధనలకు దానము చేసినట్లు వ్రాయబడియున్నది.

62. ము త్తే శ్వ ర ము

ఈ గ్రామము నరసారావుపేట తాలూకాలోనిది. ఇందు రామస్వామి దేవాలయ మొకటియు మశీదొకటియు కలవు. 1189వ సంవత్సరములోని శాసన మీ గ్రామములోని వైశ్యుని గృహమున నొకటియు, రామస్వామి దేవాలయమున మఱియొకటియు, చెఱువుదగ్గర 1670 లోని దింకొక శాసనమును కనిపించుచున్నవి. వైశ్యుని గృహములోని శాసనమున కర్మరాష్ట్రములో వడ్డెన (వైదెన) అనుగ్రామము పేరు వ్రాయ

బడియున్నది. చెఱువుదగ్గర నున్న శాసనములో "తేజఖాను ఖామందులవారు చెఱువులకు భూములుకట్టించినట్లున్నది. రామస్వామి ఆలయమందలి శాసనములో "మశీదుకు మాన్యమీయబడినట్లు" తెలుపబడి యున్నది. ఈ గ్రామ కరణములు మల్లవరపువారు.

63. మారుటూరు

ఈ గ్రామము ఒంగోలు పోవురోడ్డు ప్రక్కననున్నది. ఈ గ్రామ మొకప్పుడు తాలూకా ముఖ్యపట్టణముగ నుండెడిది. ఇందు చెన్నకేశవస్వామి, సీతారామస్వామి, పాండురంగస్వామి, సోమేశ్వరస్వామి, ఘటేశ్వరస్వామివార్ల ఆలయములు కలవు. ఈ గ్రామ కరణములు మారుటూరివారు. వీరిని పవని వారనియు నందురు. వీరి మిరాశీలో కొంతభాగము తమ దౌహిత్రులయిన బాలసరస్వతులవారికి, గర్నెపూడివారికి నిచ్చియుండిరి. తర్వాత వారిలో వారికి వివాదములు కలుగగా దౌహిత్రులకిచ్చిన భాగముకూడ తామే స్వాధీనపఱచుకొనిరి.

ఈ గ్రామ మందలి విష్ణుదేవాలయములకు అర్చకులు పాంచరాత్రులు అయినవోలుకొండమాచార్యులు, భాగవతుల రామానుజాచార్యులు. శివాలయములకు అర్చకులు ఆదిశైవులు నార్నెపాటివీరయ్య, చినవీరయ్య, కోటేశ్వరరావు, సాంబయ్య అనువారు.

64. మైదవోలు

నరసారావుపేటకు ఆగ్నేయదిశలో పన్నెండుమైళ్ల దూరమున మైదవోలు అను గ్రామమున్నది. మొదట ఈ గ్రామముండు ప్రదేశము అరణ్యప్రాంతముగ నుండెడిది. నందనచక్రవర్తి రాజ్యము చేయుకాలమున వినోదార్థ మచటికివచ్చి గోరంటపొదలతోను, ఇతర వృక్షములతోను మనోహరముగా నున్న ఆప్రాంతమున గ్రామము కట్టించదలచి, అందుగల గోరంట పొదలను నరికించి గ్రామమును గట్టించి దానికి మైదవోలు అను పేరిడిరి. మయిద అనగా గోరంట అనిఅర్థము. గోరంట చెట్లుగల ప్రదేశమున కట్టించబడిన గ్రామమగుటచే నీ పేరు పెట్టబడెను. విభజనము జరుగునప్పుడు ఈ గ్రామము మానూరివారికి సంక్రమించెను. తర్వాత మొగలాయీలు రాజ్యము చేయు కాలమున నీ గ్రామము కొప్పోలు మాణిక్యారావుగారికి జాగీరుగా నీయబడెను. దీనికి ప్రక్కన పాతపాడొకటి యున్నది. అచట శివాలయమొకటి అనాదియైనది కలదు. తూర్పు దిక్కున చెరువొకటి యున్నది. ఈ గ్రామమున క్రీ॥ శ॥ 234 వ సంవత్సరపు రాగి శాసనమొకటి యున్నది. ఈ శాసనము సింహస్కందవర్మయను పల్లవరాజు కాలములోనిది. అందు "అగ్నివేనస గోత్రుడైన గోనందార్యునకు ఆంధ్రప్రదేశములోని గ్రామమైన విరపఱ్ఱును ధారాపూర్వకముగ నీయడమైనది" అని వ్రాయబడియున్నది. విరపఱ్ఱు అను గ్రామమే యిపుడు

విప్పర్ల యనుపేరుతో వ్యవహరింపబడి యుండవచ్చును. ఆ శాసనము వలన నీ గ్రామమునకు సంబంధించిన వృత్తాంత మేమియు గాన్పింపదు.

65. మ ద్ది రే ల పా డు

ఈ గ్రామము నరసారావుపేట తాలూకాకు చెంది యున్నది. పూర్వము బొబ్బిలిదేవ మహారాజు బొప్పూడిఅను పట్టణమును కట్టించి దానినే ప్రధానపట్టణముగా జేసికొని రాజ్యమేలుచుండెను. ఒకరోజురాత్రి ఆ మహారాజునకు స్వప్నమున మారి అను పేరుగల శక్తి కనిపించి "ఈ ప్రక్కన ఉన్న అరణ్యములో రేలచెట్లు, మద్దిచెట్లు దట్టముగ నలము కొన్న ప్రదేశమొకటి కలదు. ఆ రెండుజాతుల చెట్లకును మధ్యభాగమున త్రవ్వినచో శిలారూపమున నే నచట కన్పింతును. నాకచట గుడికట్టించి నన్ను కొలుచు చుండవలసినది" అని చెప్పి కనుగప్పి పోయెను. అపుడు రాజు మేల్కాంచి మరుసటి దినముననే పరివారముతో వెళ్ళి ఆ ప్రదేశమును గుర్తుపట్టి త్రవ్వించగా నా శక్తిచెప్పిన చొప్పున దేవిశిలావిగ్రహము కనుపించెను. అంతట బొబ్బిలిమహారాజు ఆ ప్రదేశమునన్న చెట్లను నరికించి ఆ దేవతకు గుడికట్టించి అందు నిల్పెను. ఆ దేవిని నిలుపునపుడు తన భోగస్త్రీల బిడ్డలను పశువులుగా సమర్పించి యుండెను. అంతట బొప్పూడి, ఉప్పు మాగులూరు గ్రామములలో కొంతభూమిని విడదీసి కండిక

యేర్పఱచి ఆ దేవికి దానముగ నిచ్చెను. పిమ్మట ఆ అరణ్య ప్రాంతమంతయు చదునుచేయించి గ్రామమును కట్టించి మద్దిరేలు అని పేరిడియుండెను. తర్వాత కొరిశపాడునుగూడ మద్దిరేల గుడికట్టులో కలిపివేసెను.

ఇట్లు గ్రామ నిర్మాణము జరిగిన పిదప మారి అను శక్తి రాత్రిసమయములలో ఆ గ్రామమున సంచరించి జననాశనము చేయ నారంభించెను. ఆ గ్రామములోని వారెన్నియో మ్రొక్కులు మ్రొక్కుకొనిరి. ఎన్నియో తంత్ర మంత్రములు చేసిరి. కాని యేమియు నుపయోగింపక బాధపడుచు నుండిరి.

శ్రీకృష్ణదేవరాయల కాలములో రాయలవారి గురువును, మహామంత్ర ద్రష్టయునగు తాతాచార్యులవా రా గ్రామమునకు వచ్చుట సంభవించెను. అపుడా గ్రామవాస్తవ్యులు తమ కష్టములను విన్నవించుకొనిరి. అంతట ఆచార్యులవా రా గ్రామమున నిలచి ఆ రాత్రికాలమున దేవి గ్రామ సంచారమునకు వెళ్ళినపుడు తానాలయములో ప్రవేశించి తలుపులు వేసికొని మారి లోన ప్రవేశించుటకు వీలుకలుగకుండ అష్టదిగ్బంధనముచేసిరి. అంతలో మారివచ్చి లోన ప్రవేశించుటకు శక్తి చాలనిదై "అయ్యా! తాము చెప్పినట్లు చేయుదును. నాకు లోన ప్రవేశించుట కవకాశము కల్పించుడు" అని తాతాచార్యులను వేడుకొనెను. అపు డాచార్యులుగారు "దేవీ! యిప్పటినుండి మాధవి యనుపేరుతో ప్రజానాశనము చేయ

కుండ ప్రసన్నురాలవై గ్రామమును సంరక్షించు చుండుము" అనిచెప్పి లోనప్రవేశపెట్టి తాను వెలుపలకు వచ్చెను. ఆనాటి నుండి ఆ గ్రామము అభివృద్ధిచెందుచు నుండెను.

తరువాత తిమ్మరుసువచ్చి 1432 ప్రాంతమున ఈ గ్రామమునకుమధురాపురి యను పేరిడి మాధవీదేవతకు దానమిచ్చియుండెను. ఈ దానమును గూర్చి శాసనము వ్రాయబడియున్నది.

అటుపిమ్మట తురకల పరిపాలనలో ఈ గ్రామము, మాధవి దేవాలయము పాడుపడి యుండుట సంభవించెను. అపుడా దేవి గ్రామస్థులకు కలలో కన్పించి "తాను ఈ గ్రామమును వదలి కాశీ పోవుచున్నట్లు" చెప్పి వెళ్ళెనట. తర్వాత రాజా వేంకటాద్రినాయుడుగారు ఈగ్రామమునకువచ్చి పాడుపడియున్న గ్రామమును సంస్కరించి పునరుద్ధరించిరి. దీనిని పునరుద్ధరించుటయే కాక తారిశపాడుగూడ అదేస్థితిలో నుండ దానినిగూడ పునరుద్ధరించి దానికి రాజాపేట యను పేరిడి, ఆ గ్రామమున రాజమాళీశ్వరస్వామికి ఆలయము కట్టించి స్వామిని ప్రతిష్ఠించెను.

పూర్వ మీ గ్రామ కరిణీకము బొబ్బిలిమహారాజుగారు తెన భోగస్త్రీల సంతతివారి కిచ్చియుండెను. వారి వంశము వారే నిర్వహించు చుండిరి. తర్వాత కొంతకాలమునకు తారి

శపాటి కరణములు మద్దిరాలచేరి సానికరణము లసమర్థులగుటచే వారిలెక్కలను వ్రాయుచు కొంతకాలమునకు వారే యా కరిణీకపు మిరాశీని ఆక్రమించుకొనిరి. వీరు తారిశపాటిలో నున్నపుడు జానంపల్లివారు. మద్దిరాల చేరినపిమ్మట మద్దిరాలవారైరి. ఈ గ్రామమున ఆంజనేయస్వామి దేవాలయమొకటి కలదు.

66. మురికిపూడి

ఈగ్రామము నరసారావుపేట తాలూకా లోనిది. ప్రథమమున నీ గ్రామముండు ప్రదేశము అరణ్యముగా నుండెడిది. ఇందు పెక్కండ్రు మునీశ్వరులు తపస్సు చేయుచుండెడివారు. వారి యేకాగ్రచిత్తతకు పరమ శివుడు లింగాకారములో సాక్షాత్కరించెను. ఆ మహర్షులు సంకల్పమాత్రముననే యాలయ నిర్మాణముగావించి మల్లేశ్వరుడను పేరుతో ఆ లింగము నందు ప్రతిష్ఠించిరి. అని ప్రజలు చెప్పుట కలదు. అది యెంతవఱకు సత్యమో చెప్పజాలము. కాని లింగము ఆచ్ఛాదనము లేక యుండగా జూచి 1296 వ సంవత్సరములో కాకతీయ ప్రతాపరుద్రుడు మల్లేశ్వరాలయము కట్టించిరి. ప్రౌఢదేవరాయల కాలములో నీ గ్రామము అన్నంభొట్లవారికిని, కప్పగంతుల వారికిని, చాగివారికిని, నిమ్మగడ్డవారికిని, కొండూరి వారికిని, ఇంకను కొంతమందికి కలిపి 360 గృహములు

కట్టించి యీగ్రామమును వారి కగ్రహారముగ నిచ్చిరి. ప్రతాప రుద్రుని కాలమునాటికి గ్రామమున్నట్లు కన్పించదు. ఆచ్ఛాదన లేకయున్న లింగము ఋషులచే ప్రతిష్ఠింపబడినది కావచ్చును. ప్రౌఢదేవరాయల కాలములో బ్రాహ్మణులకు గృహములు కట్టించుటయే గ్రామనిర్మాణమున కారంభమై యుండును. అటు పిమ్మట అన్నంభొట్లు అను బ్రాహ్మణుడు చెన్నకేశవ స్వామి యాలయమును కట్టించి గ్రామము నభివృద్ధి పఱచి, దీని ముక్తిపూడియనియు, శ్రీరంగపురమనియు పేర్లు పెట్టిరి. ఇచట ఋషులు ముక్తిపొందియుండుట వలన ముక్తిపూడి యని పేరు పెట్టియుండ వచ్చును.

అగ్రహారీకులలో సూరంభొట్లనువారు సూరంపల్లె యను గ్రామమును, తాతంభొట్లనువారు తాతంపూడి యను గ్రామ మును, వేమనభట్టు అనువారు వేమవరమను గ్రామమును కట్టించియుండిరి.

గోపరాజు రామన్నగారు కరిణీకము లిచ్చినపుడు ఈ గ్రామ కరిణీకమును పసుమర్తివారికిచ్చిరి. కొంతకాలమైన పిమ్మట పసుమర్తివారినుండి ఆర్వేలవారు ఆ మిరాశీని లాగు కొనగా పసుమర్తి తిమ్మరాజు ఆ కాలములో పరిపాలకుడుగా నున్న గుంటుపల్లి భాస్కరయ్యకు చెప్పుకొనిరి. అపుడు భాస్క రయ్య ఆర్వేలవారిని తొలగించి పసుమర్తివారికే యిచ్చెను.

చెన్నకేశవస్వామి అర్చకులు ఫురికిపూడి అప్పలా చార్యులు వగైరాలు. మల్లేశ్వరస్వామి అర్చకులు ఆదిశైవులు తుర్లపాటి కాళిదాసు, వెంకట సుబ్బయ్య అనువారు.

67. సూరవరపుపల్లె

ఇది నరసారావుపేట తాలూకాలోనిది. మురికిపూడి అగ్రహారీకులలో నొకరగు సూరంభొట్లనువారు ఈ గ్రామ మును తనపేర కట్టించిరి. ఇది కొంతకాలము గుంటుపల్లిముత్త రాజయ్యగారి అధికారముక్రింద నుండెను. అటుపిమ్మట మల్రాజు సూరన్నగారి స్వాధీనములోనికి వచ్చెను. ఈ గ్రామము కొన్నాళ్ళకు వాసిరెడ్డి చంద్రమౌళిగారికి విక్రయింపబడెను. పూర్వమే యెప్పుడో యీ గ్రామమున వేంకటేశ్వరస్వామి వారి ఆలయము కట్టింపబడి యున్నది. అది పరాసుల కాల ములో నష్టపడెను.

వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు గారు నష్టపడిన ఈ యాలయమును పునరుద్ధరించిరి. తర్వాత ఈ యాలయమునకు మండవ అయ్యన్న అనువారు మరమ్మతులు చేయించి పునః ప్రతిష్ఠ చేయించిరి. ఆ గ్రామస్థుల చేతనే చెన్నకేశవస్వామి ఆలయము కట్టించబడినట్లు తోచుచున్నది. ఈ స్వామివార్ల అర్చకులు వైఖానసులు మురికిపూడి అప్పలాచార్యులు వగై రాలు.

68. తాతంపూడి

ఈ గ్రామము నరసారావుపేట తాలూకాకు చెందినది. మురికిపూడి అగ్రహారీకులలో నొకరగు తాతంభొట్లు అనువారు ఈ గ్రామమును తన పేర నిర్మించి యుండిరి.

ఈ గ్రామ కరిణీకము ముక్తిపూడి వారినుండి కందుకూరివారికిని, ధమ్మాళపువారికిని సంక్రమించెను. ఇందు ఆంజనేయస్వామి దేవాలయము కలదు. అర్చకులు వైఖానసులు మురికిపూడి అప్పలాచార్యులు వగైరాలు.

69. వేమవరము

ఈ గ్రామము నరసారావుపేట తాలూకాకు చెందినది. మురికిపూడి అగ్రహారీకులలో నొకరగు వేమనభట్టుచే కట్టింపబడినది. అందువలననే వేమవరమను పేరువచ్చినది. కొంతకాలమైన పిదప తియ్యగూరవారను రెడ్లువచ్చి యీ గ్రామమునప్రవేశించి గ్రామమును పునరుద్ధరించి తియ్యగూరపాలెము అని పేరుపెట్టినట్లు చెప్పుదురు. వారు ప్రబలులైయున్న కాలములో ఆ పేరు వచ్చిన రావచ్చును. కాని కొలదికాలములో ఆ పేరుపోయి మామూలుపేరు వచ్చియుండును.

వేమవరమనుటకు మఱియొక విధముగా చెప్పుదురు. నాజెండ్ల సమితిలోనున్న వేమవరం గ్రామమునుండి అంకమ్మయను దేవత ఈ గ్రామమునకువచ్చి తన పేరీ గ్రామమునకు

పెట్టుకొను"డని గ్రామస్థులకు చెప్పినట్లును, అపుడా దేవత పేరు ఈ గ్రామమునకు పెట్టినట్లును కొందఱు చెప్పుదురు. ఇది అంత నమ్మదగినదిగ కన్పింపదు. ఆ వఱకే వేమవరమని పేరుండియున్నది. కనుక ఇది పుక్కిటిపురాణమని చెప్పవచ్చును. ఈ గ్రామమున మల్లేశ్వరస్వామి లింగము, అంకాలమ్మగుడియు, ఆంజనేయస్వామి విగ్రహము నుండెడివని పెద్దలు చెప్పుదురు. ఇపుడవి కన్పింపవు. ఈ గ్రామములో కొంతభాగమును వేరుచేసి వేమ వరం ఖండ్రికయని పేరుపెట్టి ప్రతివాది భయంకర అయ్యవార్లం గారికిచ్చి యుండిరి. ఇవుడీ గ్రామమున వేణుగోపాలస్వామి ఆలయము కలదు. అర్చకులు వైఖానసులు.

70. యేల్చూరు

ఈ గ్రామము నరసారావుపేటకు పదమూడుమైళ్ళ దూరమున నున్నది. ఇందు నరసింహస్వామి, నీలకంఠస్వామి ఆలయములు కలవు. ఈ గ్రామములో 35 కుచ్చెళ్ల భూమిని విడదీసి నృసింహాపురమని పేరు పెట్టి నృసింహస్వామికి అగ్రహారముగా నీయబడెను. ప్రథమమున కోగంటివారీ గ్రామకరణములుగ నున్నారు. కొంతకాలమున కీ గ్రామము దుస్థితికి రాగా కరణములుగనున్న కోగంటివారచటనుండజాలక యిళ్ళు వాకిళ్ళు వదలి దేశాంతరము వెళ్ళిరి. పిమ్మట కొంతకాలమునకు ఎచ్చటి నుండియో బలవంతులైన కాపులు కొందఱు కర

ణములను వెంటబెట్టుకొని యీ గ్రామమున నివసించుచు గ్రామమును పునరుద్ధరించి తమ వెంటవచ్చిన కరణములకు కరిణీక మిచ్చియుండిరి. ఈ విధముగ కొంతకాలము జరిగెను. కాపు వెంటవచ్చిన కరణములు ఏల్చూరివారు.

పిమ్మట కొంతకాలమునకు కోగంటివారు వచ్చి కరిణీకము విషయమై వివాదమునకు దిగిరి. అపుడు గ్రామములోని పెద్దలు ఇరువురు సమానముగ దీసికొనునట్లు రాజీ కుదిర్చిరి. ఆ ప్రకారమే యేల్చూరివారును, కోగంటివారును కరిణీకములు చేయుచుండిరి. కొంతకాలమునకు కోగంటివారి వంశమంతరించగా వారి దౌహిత్రులైన చీమకుర్తివారికి వారి భాగము సంక్రమించెను.

చీమకుర్తి ఓబళయ్య అనువారు 1535 మన్మథనామ సంవత్సర భాద్రపదములో నీగ్రామమున చెరువు త్రవ్వించి శాసనము వేయించిరి. కొంతకాలమునకు నరసింహస్వామి ఆలయము అంతరువు పడగా మల్రాజువారు మఱికొంతభూమి నిచ్చి నిత్యనైవేద్య దీపారాధనలు జరుగునట్టి యేర్పాటు చేసెను.

నరసింహస్వామి వారి అర్చకులు వైఖానసులు. వినుకొండ వెంకట రంగాచార్యులు, రామాచార్యులుగార్లు. నీలకంఠస్వామి అర్చకులు ఆదిశైవులు. అన్నలూరు నాగభూషణం, కోటయ్యగార్లు.

71. వేలూరు

ఈ గ్రామము నరసారావుపేటకు ఆగ్నేయమున పండ్రెండు మైళ్ళదూరమున నున్నది. ఇందు వీరేశ్వరస్వామి, సోమేశ్వర స్వామివార్లు ఆవిర్భవించిరని చెప్పుదురు. కళావల్లి దేవచోడమహారాజు కాలమున మూలస్థానేశ్వరస్వామి ఆలయమొకటి కట్టింపబడెను. శా॥ శ॥ 925వ సంవత్సరమున పరిచ్ఛేద బిక్కమహారాజు కాలమున మూలస్థానేశ్వరస్వామికిని, సోమనాధస్వామికిని హవిర్బల్యర్చనాదులకు కొన్ని దానములు చేయబడినట్లు శాసనములవలన దెలియవచ్చుచున్నది. రెడ్డిరాజుల కాలములో గ్రామమునకు పశ్చిమభాగమున నొకదేవాలయము కట్టించి యందు చెన్నకేశవస్వామిని ప్రతిష్ఠించిరి. కందిమళ్ల బయ్యాలు అనువారు సోమేశ్వరస్వామి ఆలయము తిరిగి కట్టించి ప్రతిష్ఠ చేసియుండిరి. కృష్ణదేవరాయల కాలమున 1521 లో సోమేశ్వరస్వామికి భూదానములు చేయబడియుండెను.

తరువాత తురకల రాజ్యమున 1581 లో ఈ భూదానము లన్నియు తగ్గించబడెను. అందువలన ఆలయము లన్నియు అంతరువు పడుట సంభవించెను. కొండవీటి సీమ బందీలు చేసినపుడు ఈగ్రామము నాదెండ్ల సంతులో చేర్పబడెను. అవుడు అమాని దేశపాండ్యాలు అఫ్లూయత్ చేసిరి. 1712 లో వంతు వేసినపుడు ఈ గ్రామము మానూరివారికి వచ్చినది.

అపుడు చిలకలూరిపేట క్రిందకు చేరెను. తర్వాత వేలూరు, తుర్లపాడు, కొప్పేరు, సొలస, చిరుమామిళ్ళ, కావూరు, గోవిందపురం, బయిసికాపురం, గన్నెపూడి అను తొమ్మిదిగ్రామములు వేలూరిముఠా అని పేరుపెట్టి విక్రయమునకు పెట్టగా వాసిరెడ్డి పద్మనాభుడుగారు కొనియుండిరి. వారి ప్రభుత్వములో మిరాశిదారుడైన అబ్బరాజు నరసింగరావుగారు శిథిలమైన మూలస్థానేశ్వరాలయము కట్టించి, పునఃప్రతిష్ఠ చేయించి భూములిచ్చియుండిరి. 1793 వ సంవత్సరములో జగ్గయ్యగారి కుమారుడైన వేంకటాద్రినాయుడుగారు ప్రభుత్వమునకువచ్చి యీ గ్రామములో కేశవస్వామి, వీరభద్రస్వామివార్ల ఆలయములు బాగుచేయించి తిరిగి ప్రతిష్ఠలు గావించిరి. ఈ విధముగా ఈ గ్రామములో దేవాలయములు పలువురిచే పలుమార్లు కట్టింపబడినట్లు కన్పడుచున్నది.

గోపరాజు రామన్నగారు ఈ గ్రామ కరిణీకపు మిరాశీని అబ్బరాజువారికిని, పొత్తూరివారికిని, నన్యంవారికిని, శ్రీగిరిరాజు వారికిని సమానభాగములు కల్గియుండునట్లుగ నిచ్చియుండిరి. చెన్నకేశవస్వామి అర్చకులు వైఖానసులు పర్చూరి వెంకటాచార్యులు. మూలేశ్వరస్వామి, వీరభద్రస్వామివార్ల అర్చకులు ఆదిశైవులు. అడుసుమిల్లి సుబ్బయ్య, చెంచయ్య, తుర్లపాటి వెంకట్రాయుడుగార్లు.

72. యడవల్లి

ఇది నరసారావుపేటకు దక్షిణమున తొమ్మిదిమైళ్ల దూరమున గలదు. ఈ గ్రామములో కోదండరామస్వామి, శంభుస్వామివార్ల ఆలయములు కలవు. కోదండరామస్వామి ఆలయములో నొకటి, శంభుస్వామి దేవాలయమందు మూడు శాసనములు కన్పించుచున్నవి. వానిలో 1157 వ శాసనమును బట్టి చండిభీమపోలిశెట్టి యనువారు స్వయంభూ బ్రహ్మేశ్వరాలయము కట్టించినట్లును, 1267 లోని శాసనమునుబట్టి తిరుమలదేవరాజుగారు ఈ స్వామికి కొంత భూదానము చేసినట్లును వ్రాయబడియున్నది. కోదండరామస్వామి ఆలయములోని శాసనములో గణపతిదేవ మహారాజు పేరు మాత్రము కాన్పించుచున్నది. వివరము లేవియు కాన్పింపవు. ఈ ఆలయములుగాక సీతారామస్వామి, పట్టాభిరామస్వామి, వేంకటేశ్వరస్వామి ఆలయములుగూడ నిందు కన్పడుచున్నవి. విష్ణుదేవాలయములకు అర్చకులు వైఖానసులు. రత్నాకరం నరసింహాచార్యులుగారు. శివాలయములకు అర్చకులు వెల్నాటిపూజార్లు శంకరమంచి కృష్ణమూర్తిగారు.

ఈ గ్రామ కరిణీకము మొదట శ్రీగిరిరాజువారిది. వారికడ హస్తకులుగానున్న వారణాసివారి ఆ మిరాశీ భుక్తమయ్యెను.

73. యడ్లపాడు

నరసారావుపేటకు తూర్పున యడ్లపాడు అను గ్రామము కలదు. ఈ గ్రామమునకు తూర్పుననున్న కొండమీద పూర్వము లక్ష్మీనృసింహస్వామివారి అలయము కట్టింపబడెను. అది ఇప్పుడు శిథిలమైపోయినది. ఈ గ్రామమున ప్రసిద్ధమైన ఆంజనేయస్వామివారి ఆలయముకలదు. కొండమీద రాజేశ్వరస్వామి దేవాలయమున్నది. ఈ గ్రామములో యడ్లపాటి కేశవరాయుడు అనువారు చెన్నకేశవస్వామి ఆలయము కట్టించి ప్రతిష్ఠచేయించి యున్నారు. ఆ దేవునికి నిత్యనైవేద్య దీపారాధనలకు భూమినిగూడ నిచ్చియున్నారు.

ఈ గ్రామ కరిణీకము యడ్లపాటివారిది. కొంతకాలమీగ్రామము ఉమ్మెత్తాలవారి కట్టుబడిలో నుండెడిది. విష్ణ్వాలయములకు అర్చకులు వైఖానసులు పుసులూరి రామాచార్యులుగారు. రాజేశ్వరస్వామి అర్చకులు వెలనాటి పూజారులు ఆమంచి సీతారామయ్యగారు.

74. యద్దనపూడి

ఇది నరసారావుపేటకు ఆగ్నేయమున పదునారు మైళ్లదూరములో నున్నది. ఈ గ్రామమున రామలింగస్వామి, వేణుగోపాలస్వామివార్ల దేవాలయములు రెండుకలవు. అవి రాతి

పలకలతో కట్టబడియున్నవి. గోపాలస్వామి దేవాలయము చింతపల్లి తిమ్మనాయనింగారిచే కట్టింపబడినట్లు చెప్పుదురు. ఈయాలయము శిథిలముకాగా శ్రీ స్వామివారి అర్చకస్వాములైన పరుచూరి వెంకట్రామాచార్యులుగారు ఆలయ, గోపుర, ప్రాకారాదులు నూతనముగ కట్టించి పార్థివనామ సంవత్సర జ్యేష్ఠ శు ౧౦ మి నాడు స్వామివారిని ప్రతిష్ఠింపజేసిరి. ఇచట కరణములు యద్దనపూడివారు. గోపాలస్వామి అర్చకులు వైఖానసులు పరుచూరి వెంకటశేషాచార్యులు. రామలింగస్వామి అర్చకులు ఆదిశైవులు తుర్లపాటి వెంకట్రాయుడు.

75. రాజాపేట

నాదెండ్లకు నైరృతిదిశగ ఈ గ్రామమున్నది. ఈ గ్రామము శ్రీ రాజావాసిరెడ్డి వేంకటాద్రినాయుడుగారి పేర కట్టించబడెను. ఓగేరునదికి సమీపముననుండి యొకప్పుడిది తాలూకా ముఖ్యపట్టణముగ నుండెను. షుమారు 117 సంవత్సరముల క్రిందట ఇచటినుండి తాలూకాను నరసారావుపేటకు మార్చియుండిరి. ఇందు ప్రాతకోట యొకటియు, శిథిలములైన దేవాలయములు రెండును, శ్రీ రాజావాసిరెడ్డి వేంకటాద్రినాయుడుగారిచే ప్రతిష్ఠింపబడిన రాజగోపాలస్వామి ఆలయము, రాజమాళీశ్వరస్వామి దేవాలయముకలవు.

రాజగోపాలస్వామి అర్చకులు వైఖానసులు. దీవి రాఘవాచార్యులు, మురికిపూడి నరసింహాచార్యులు, శేషా

చార్యులు, హనుమాచార్యులు, రాఘవాచార్యులుగార్లు. రాజమాళీశ్వరస్వామి అర్చకులు వెలనాటిపూజార్లు చింతపల్లి నారాయణ, రమణయ్యగార్లు.

76. రా వి పా డు

ఈ గ్రామము నరసారావుపేటకు పడమరగా మూడు మైళ్ళ దూరముననున్నది. ఇందు రామలింగస్వామి దేవాలయముకలదు. ఆ యాలయములో నున్న నంది స్తంభమున 1277 లోని శాసనమొకటి చెక్కబడియున్నది. ఈ శాసనమున "సామంతపోతినాయడు సురేశ్వరమహాదేవరను ప్రతిష్ఠించి త్రికూటము, మండపము కట్టించి, వనమును దానమిచ్చినట్లు" వ్రాయబడియున్నది. ఇపుడా పేరుతో నా గ్రామమున దేవాలయము లేదు. ఈ శాసనము రామలింగేశ్వర దేవాలయములో నున్నది. కనుక పోతినాయుడు కట్టించిన సుర్వేశ్వర దేవుడు రామలింగేశ్వరుడే కావచ్చును. ఈ గ్రామమున ఆంజనేయస్వామి దేవాలయమును కలదు. కొంతకాల మీ గ్రామము కొండవీటి హవేలీలో చేరియున్నది. తరువాత మానూరివారి అధికారము క్రిందకువచ్చి చిలకలూరిపేటలో చేరెను.

1751 లో నాసర్ జంగ్ ఈ గ్రామమును పరాసువారి కిచ్చెను. నిజామల్లీ ఖాను కాలములో దీనిని ఫిరంగిపురం మొదలైన గ్రామములతో కలిపి ప్రత్యేక జాగీరుగ జేసి, జిల్లాదారు

డైన రజాఖేఖానున కిచ్చిరి. 1774 వ సంవత్సరమునకు ఈ గ్రామము తిరిగి మానూరివారి స్వాధీనమయ్యెను.

రామలింగేశ్వరస్వామి అర్చకులు ఆదిశైవులు. కొండకావూరికోటయ్య.

77. రొం పి చ ర్ల

ఈ గ్రామము నరసారావుపేటకు పడమటి దిశగనున్నది. ఇది పూర్వమెంతయో యభివృద్ధిజెంది రాజధానీ నగరముగ వాసిగాంచియున్నది. పూర్వ మీ నగరము "సవాలేకవర" మని పిలువబడెడిది. కోటభీమరాజను నాతడు ఇచట పెద్దకోట కట్టించి దీనిని పెద్దవ్యాపార కేంద్రముగా జేసి ఇటనుండి రత్న వ్యాపారము చేసెను. ఈకోటకుచుట్టు పెద్దఅగడ్త త్రవ్వించెను. ఎల్లపుడును ఈ యగడ్త నీళ్ళతో నిండి సముద్రమువలె కన్పించెడిది. ఇట్టి యగడ్త యుండుటవలన నీ నగరము శత్రుదుర్భేద్యమైయుండెను. ఆ పట్టణముయొక్క వెలుపల చాలదూర మా యగడ్తలోని నీరు ప్రవహించి పెనురొంపితో గూడి యుండెడిది. ఇట్లు రొంపిగానుండుట వలననే రొంపిచర్ల అను పేరేర్పడెనేమోయని తలంప వీలగుచున్నది. ఈ కోటకట్టిన ఉప్పరులు రొంపిచర్లకు తూర్పుదిక్కున గ్రామము కట్టుకొని నివసించుచుండిరి. దానిని ఉప్పరిపాలెం అందురు. మఱియొక దిశన కడేకార్లు ఒక గ్రామము కట్టించి కర్లగుంటయని పేరిడిరి. ఇంకొక

వైపున ఖిల్లేదారుడైన దాసరినాయకుడు ఒక పల్లెను కట్టించి దాసరిపాలెమని పేరుపెట్టెను. ఈ విధముగా చుట్టు గ్రామములతోగూడి యీ రొంపిచర్ల యను పట్టణమెంతయో సురక్షితముగానుండెను.

ఈ కోటలోపల వేణుగోపాలస్వామి, శంకరలింగస్వామి వార్ల ఆలయములను భీమరాజు కట్టించి దానములు చేసియుండెను. భీమరాజుచే పరిపాలింపబడు సమయమున కులోత్తుంగ చోళుడు సైన్యముతో వచ్చి దాడిజరిపి భీమరాజును సంహరించి యీ కోటను స్వాధీనము చేసికొనెను. అప్పటి యాతడే రాజ్యమేలుచుండెను. 1168 వ సంవత్సరములో కోటకేతరాజనువాడు రాజ్యమునకు వచ్చెను. అటుపిమ్మట కొలదికాలములోనే కాకతీయ ప్రతాపరుద్రదేవ మహారాజు ఈ కోటను వశపఱచుకొని రాజ్యము చేయుచుండెను. ఈ మహారాజు 1320 సంవత్సరమున ఈ పట్టణమున గోపీనాథ స్వామి దేవాలయమునకు కొండవీటి మాన్యమిచ్చి యున్నట్లు ఒక శాసనమువలన తెలియుచున్నది.

తర్వాత రెడ్లు రాజ్యమునకు వచ్చిరి. వారి రాజ్యకాలములో ఈ గ్రామమునకు సమీపమున వాయువ్యదిశగ పెద్ద చెఱువు త్రవ్వించి, యీ చెఱువునుండి నీరు కోటలోనికి సర్వదా వచ్చుచుండునట్లు రహస్యమార్గము నేర్పఱచి కోటలో నీరు సమృద్ధిగా నుండునట్టి యేర్పాటుచేసిరి. ఏనుగులు

నీరు త్రాగుటకొక బావినిగూడ కట్టించిరి. 1520 లో తిమ్మరుస్న గారి ఆధిపత్యమున వెంకటనాయునింగారు ఈ కోటలోనుండి ప్రభుత్వము చేయుచుండిరి. ఆ సమయమున ఈ గ్రామములోని శంకరలింగస్వామివారికి అమృతఫల నివేదన శాశ్వతముగా జరుగుటకు నాలుగు కుచ్చెళ్ల భూమి నొసంగి శాసన స్తంభము వ్రాయించిరి.

పిమ్మట లింగప్పనాయకుడు ప్రభుత్వమునకు వచ్చి శ్రీ స్వామివారి అమృతఫలముల నైవేద్యమునకు నాలుగు కుచ్చెళ్లు చాలదని తలచి రొంపిచర్ల గ్రామమంతయు సమర్పించినట్లు దేవాలయములోని శాసన స్తంభము మీద వ్రాయించి యుండెను.

తర్వాత శ్రీరంగరాయల ప్రభుత్వములో మేదరిమెట్ల కమ్మవారు ఈ కోటలోనుండి ఈ ప్రాంతమును పరిపాలింప నారంభించిరి. ఆ సమయమున వీరు కంచుభేరీలు శానీలు, నవబత్, నగారాలు మొదలైన వానితో నెంతయో వైభవముగ నుండిరి. వీరి వైభవములను జూచి రేవెళ్ల వారికి కన్నుకుట్టి యీ కోటను స్వాధీనపఱచుకొనవలెనని తలచి తమ ఫౌజుతో వచ్చి కోటను ముట్టడించిరి. మూడు సంవత్సరములు పోరాడిరిగాని కోటవారి స్వాధీనము కాకయుండెను. కోటలోనివారికి ఆహారపదార్థములు నీరు కొరత లేక యుండెను. అప్పుడు రేవెళ్లవారు ఆ కారణమును దెలిసికొని ఆ జల

సూత్రమెఱిగిన ఒక గొల్లవానిని ధనమిచ్చి లోబఱచుకొని ఆ మార్గమును దెలిసికొని నీరు కోటలోనికి పోకుండునట్లు బంధించివైచిరి. కొలది దినములకే కోటలో నీటికరువేర్పడుటచే కోటలోనివారు చాల బాధపడజొచ్చిరి. ఆ సమయమున రేవెళ్లవారు లగ్గలకెక్కి కోటలో ప్రవేశించిరి. అపుడు మేదరిమెట్టవారు అవమానమునకు సహింపక రేవెళ్లవారికి చిక్కకుండ ప్రధానులెల్లరు భార్యాబిడ్డలతో సహా ఏనుగుల బావిలో పడి మరణించిరి. అప్పటినుండి మొగలాయీలు రాజ్యమునకు వచ్చువఱకు రేవెళ్లవారే పరిపాలనలో నుండిరి.

మొగలాయీలు రాజ్యమునకు వచ్చినపిదప ఆ కోటనొకింతభిన్నము చేసిరి. కాని బ్రాహ్మణుల యీనాములకు మాత్రము భంగము కలిగించకుండుటయేకాక కొన్ని దానములుగూడఁ జేసియుండిరి. పిమ్మట ఈ గ్రామంలో కొంతభాగమును వేరుచేసి అన్నపతేవారికిచ్చి అన్నవరం అను పేరు పెట్టిరి.

సంతుబందీలు చేసిన సమయములో ఉప్పరిపాలెం, దాసరిపాలెం, కర్లగుంట, అన్నవరం అను నాలుగు గ్రామనులను వేరుచేసి వినుకొండ పరగణాలో చేర్చబడెను. ఈ గ్రామము జంపని అమరప్పరాజు సీతారామరాజులకు ఫాదుషాచే జాగీరుగా నీయబడెను.

ఆ కాలమున బెల్లంకొండకు నాయకవ్వాడీలు (నాయకులు) మల్రాజువారును, కొండవీటికి హాజరతులు (ప్రభువులు) కటికినేనివారును, వినుకొండకునాయకవ్వాడీలుపానుగంటివారును నుండిరి. తర్వాత వినుకొండను పదునాల్గు వంట్లుగా జేసి పదునాల్గుమందికి జాగీర్లుగా నీయబడెను. కొంతకాలమునకు రామరాజు ఫాదుషా దగ్గరకువెళ్ళి వినుకొండ జమీందారీని సంపాదించుకొనెను. మల్రాజువారు బెల్లంకొండకు జమీందార్లుగా నుండిరి. వీరు ఫాదుషా దగ్గరకువెళ్ళి రామరాజుపై నేరారోపణలుచేసి వినుకొండ జమీందారీగూడ తమపేర ఫాదుషావారిచే ఫర్మానా వ్రాయించుకొనివచ్చి రామరాజును పంపి తామే దానినిగూడ ఆక్రమించిరి. తర్వాత నొకప్పుడు వినుకొండ జమీలో నాల్గవవంతును మల్రాజువారు వాసిరెడ్డివారికి విక్రయించిరి. రొంపిచర్ల నానుకొనియున్న నాల్గు గ్రామములలో నాల్గవవంతుక్రింద ఉప్పరిపాలెం వాసిరెడ్డివారి స్వాధీనమాయెను. మిగిలిన గ్రామములు మల్రాజువారి క్రిందనే యుండెను.

ఈ గ్రామములోనున్న రాతిశాసనముమీద "షట్సహస్రవనీ వల్లభుండైన గణపతిదేవ మహారాజుల ధర్మముగ "కొండముద్ర"లో కొంతభాగము కేశవదేవరకు దానమీయబడియున్నట్లు" వ్రాయబడియున్నది. వేణుగోపాలస్వామి దేవాలయములోని గరుడ స్తంభముమీద వ్రాయబడిన 1265 సం

వత్సరపు శాసనములో "ఈ గ్రామములోని అనంత గోపినాథుని ప్రతిష్ఠనుగూర్చియు, గోపినాథున కీయబడిన దానములను గూర్చియు లిఖింపబడి యున్నది. ఇంకొక స్తంభముపైనున్న శాసనములో (1320). "ప్రతాపరుద్రదేవుని నగరి కధికారులైన కొండపెదమంచి యనువారు గోపీనాథునకు కొంత దానమిచ్చినట్లు" తెలియుచున్నది. ఇదిగాక ప్రతాపరుద్రుని సోదరియగు తిరుమలదేవిచే కట్టింపబడిన దేవాలయము కోటయందు మఱియొకటికలదు. కాళమ్మశక్తిగుడియు నొకటి యున్నది. ఇది ఇప్పటికిని పూజలోనే యున్నది. ఇంకను నిచ్చట నల్లగట్టమ్మ, అంకాలమ్మ, అద్దంకమ్మ, పోలేరమ్మ, నూకాలమ్మ, పాతగట్లమ్మ అనుశక్తి దేవాలయములుకూడ నున్నవని చెప్పుదురు. కాని ఇప్పుడవి కనుపించవు.

ఈ గ్రామ కరిణీకము మిరాశి మాదిరాజుగారిది. ఈయనకు సంతానము లేనందున ఒక పిల్లవానిని పెంచుకొనెను. తర్వాత మాదిరాజున కిరువురు పుత్రులు జన్మించిరి. ముగ్గురును సమభాగములు చేసికొని అనుభవించుచుండిరి. వేణుగోపాలస్వామి అర్చకులు వైఖానసులు రత్నాకరం తులసిబృందావనాచార్యులు, చిలుకు బృందావనాచార్యులు అనువారు. సోమేశ్వరస్వామి అర్చకులు ఆదిశైవులు. పేటేటి హనుమయ్య, లక్ష్మీనారాయణగార్లు.

78. లింగంగుంట

నరసారావుపేటకు రెండుమైళ్ల దూరమున ఈ గ్రామమున్నది. ఇది అగ్రహారము. ఈ గ్రామ మందలి తోపులో నొక శాసనమున్నది. అందీ గ్రామమునకు సంబంధించిన విషయమేమియులేదు. కొంకరాజు, కాశానాయకుల పేర్లు కనుపించుచున్నవి.

18 వ శతాబ్దములో ఈ గ్రామము పుష్పగిరి శంకరస్వామికి అగ్రహారముగ మల్రాజువారిచే నీయబడినది. ఈ గ్రామమున పెద్దచెఱువు కలదు. ఇచట మానూరివారి ప్రభుత్వకాలమున ఆకులనరసు అనువానిచే నిర్మింపబడిన రామలింగస్వామి, పోరూరి వెంకటరామయ్యచే కట్టింపబడిన కాశీ విశ్వేశ్వరస్వామివార్ల దేవాలయములు కలవు. ఇచటి గ్రామ కరిణీకము కూరపాటివారిది.

79. వంకాయలపాడు

నరసారావుపేటకు ఆగ్నేయమున పదుమూడుమైళ్ల దూరములో ఈ గ్రామమున్నది. రెడ్లపరిపాలన కాలములో ఒక రెడ్డిరాజు ఆ గ్రామమునకు వచ్చెను. అపుడా గ్రామములోని పెద్దలు వంటచేయించి భోజనము పెట్టించిరి. ఆయన తిన్నపదార్థము లన్నిటిలో వంకాయకూర రుచివంతముగానున్నందున ఆ రాజు మెచ్చుకొని నిజముగా ఇది వంకాయల

పాడేయనెనట. అప్పటినుండి ఈ గ్రామము వంకాయలపాడుగా వ్యవహారింప బడుచుండెను. రెడ్డిరాజులకాలములో 1320 వ సంవత్సరమున ఈ గ్రామము బొల్లమూరి వేంకటేశ్వరస్వామికి అగ్రహారముగా నీయబడెను. వంతులు వేసినప్పుడు ఈ గ్రామం శేరీచేసి నాదెండ్లసముతులో చేర్చబడి మానూరి వెంకన్నగారి వంతులోవచ్చెను.

ఈ గ్రామములో శ్రీ వేణుగోపాలస్వామి ఆలయము పూర్వముండెనిది. అది ఇప్పుడు ఖిలమైపోయినది. రెడ్డిరాజుల కాలమున చిన్నమాంబయను వైదికస్త్రీ చెఱువుత్రవ్వించి శాసనము వేయించినది. వేణుగోపాలస్వామివారి ఆలయము జీర్ణోద్ధరణము చేయబడినది. హనుమంతుని గుడియు నొకటి కలదు. వేణుగోపాలస్వామి అర్చకులు వైఖానసులు. పరాంకుశం వెంకటరామాచార్యులు.

80. వు ప్పు మా గు లూ రు

నరసారావుపేట కీ గ్రామము 10 మైళ్లలో నున్నది. ఈ గ్రామమున పూర్వకాలము సిద్ధులుండెడివారట. ఇచట నున్న కొండగుహాలోవారు లింగమునకు పూజలు చేయుచుండెడివారు. ఇప్పటికిని ప్రతి సోమవారము గ్రామప్రజలు అచటికివెళ్ళి అచటనున్న లింగమునకు అభిషేకములు చేయుదురు.

చోడరాజుల కాలమున ఇచట వేణుగోపాలస్వామి, ఆంజనేయస్వామివార్ల ఆలయములు కట్టించి యా రాజులు భూములిచ్చి యుండిరి. 1211 వ సంవత్సరములోని బల్లిచోడ రాజు స్వామివారి దీపారాధన నూనెకు నూనెగానుగను దానమిచ్చినట్లు కనబడుచున్నది. గజపతులు రాజ్యము చేయునపుడు మల్లెసాని యను నాపె శివస్థలం కట్టించి మల్లేశ్వరస్వామిని ప్రతిష్ఠించెను. 1715 లో వాసిరెడ్డి పద్మనాభుడుగారు ఆలయము శిథిలావస్థలో నుండగా బాగుచేయించి యుండిరి. ప్రతాపరుద్రునికాలములో వేయించిన శాసనమున "తమకు యుద్ధమందు జయము లభించినందున ప్రతాపరుద్రదేవునకు పుణ్యము వచ్చుటకుగా దేవునకు దానముచేసినట్లు వ్రాయబడియున్నది. ఇది ప్రతాపరుద్రుని సేనానులలో నెవరో వ్రాయించి యుందురు. శ్రీ వేణుగోపాలస్వామి అర్చకులు వైఖానసులు బృందావనం వెంకటాచార్యులు అనువారు. మల్లేశ్వరస్వామి అర్చకులు వెలనాటిపూజార్లు. శంకరమంచి కృష్ణమూర్తి అనువారు.

81. వై ద న

నరసారావుపేటకు నైర్ఋతిదిక్కున ఇరువదిమైళ్ల దూరములో నున్నది. ఇచట రామలింగేశ్వరస్వామి, చెన్నకేశవస్వామి, ఆంజనేయస్వామి దేవాలయములు కమలరావు-

లింగేశ్వరస్వామి ఆలయమున నొక శాసనమున్నది. ఈ శాసనము వలన నీ గ్రామ చరిత్రయేమియు తెలియదు.

ఇందలి కరణములు కొప్పరపువారు. చీమకుర్తివారు. విష్ణ్వాలయములకు అర్చకులు వైఖానసులు. నారాయణం రామాచార్యులు, వేంకటాచార్యులు అనువారు; శివాలయమునకు అర్చకులు ఆదిశైవులు. పేకేటి వేంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం అనువారు.

82. సంత మాగులూరు

ఈ గ్రామము నరసారావుపేటకు దక్షిణమున తొమ్మిది మైళ్ల దూరములో నున్నది. ఇచటగల శ్రీపర్వతమను కొండయందు మల్లినాథదేవరగారి అరుసుమఠ మొకటి యుండెడిది. ఆ మఠమునకు దానమీయబడినట్లు 1265 వ సంవత్సరములో వ్రాయబడిన శాసన మొకటి కలదు. ఈ గ్రామమును మాగులూరనియు పిల్చెదరు. ఈ గ్రామములోని మఱియొక శాసనమునుబట్టి కాకతీయ ప్రతాపరుద్రదేవ మహారాజు రాజ్యము చేయుకాలమున నాతని ప్రధాని కొలని రుద్రదేవునింగారు గోపినాథస్వామికి భూదానము చేసినట్లు వ్రాయబడియున్నది. కాని ఆ దేవాలయమిపుడు కాన్పింపదు. ఈ గ్రామ కరణములు పొత్తూరివారు. ఇచటగల సీతారామస్వామి, ఆంజనేయస్వామి వార్ల అర్చకులు వైఖానసులు. రొంపిచర్ల వెంకట్రామాచార్యులు. పరమేశ్వరస్వామి అర్చకులు ఆదిశైవులు కూరపాటి మునిరాజు.

83. సంతగుడిపాడు

ఈ గ్రామము నరసారావుపేటకు ఎనిమిదిమైళ్ళ దూరములో పడమరదిక్కున నున్నది. ఈ గ్రామమున్నప్రాంతము అరణ్యప్రదేశముగ నున్నపుడు ప్రౌఢదేవరాయ లాప్రాంతమునకు వేటకువచ్చి తిరుగగా మధ్యాహ్నకాలమునకు దాహమయ్యెను. అపుడా ప్రాంతము వెదకునప్పటికి నిర్మలజలముతో గూడిన సరోవర మొకటి కన్పించెను. అందలి నీరములం గ్రోలి యటవిశ్రమించి యీ సరోవర ప్రాంతమున నొక గ్రామమును నిర్మించుట బాగుండునని సంకల్పించి యా యరణ్యము నంతయు నరికించి యీ గ్రామమును కట్టించి ఆ సరోవర తీరమున ఆలయమును కట్టించి అమరేశ్వర లింగమును ప్రతిష్ఠించి గుడిపాడని పేరుపెట్టెను. ఆ దేవాలయమిప్పుడు ఖిలమైపోయినది. ఈ గ్రామములో పూర్వ మీ దేవాలయమున బ్రాహ్మణులు పెక్కండ్రు వేదము చెప్పుకొనుచుండెడివారు. వేదపాఠములు జరుగుచున్న గ్రామమగుటచే సంతగుడిపాడను పేరు వచ్చినది. ఆ గ్రామములో వస్తువిక్రయము నియమిత దినములలో జరుగుచుండెడిది. దానిని సంతయందురు. సంతజరుగు గుడిపాడగుటవలన సంతగుడిపాడని పేరువచ్చినట్లు చెప్పుదురు. పూర్వముకూడ నిది ప్రధానగ్రామము కాక చిన్న

గ్రామమే యగుటవలన నిది సంతలుజరుగుట కనువైన గ్రామము కాదు. ఆ కారణమువలన మొదట చెప్పినదే యుక్తమని చెప్పవచ్చును.

తానీషాకాలమున ఆదూరి సూరపురాజు కొన్ని జాగీర్లు సంపాదించిరి. అపుడు ఈ గ్రామమున గోపాలస్వామి ఆలయమును తూర్పుదిక్కున సోమేశ్వరాలయమును కట్టించిరి. ఈ గ్రామ కరణములు మంచికంటివారు. గోపాలస్వామి అర్చకులు వైఖానసులు. నారాయణం నరసింహాచార్యులు. శివాలయమునకు అర్చకులు ఆదిశైవులు. తుర్లపాటి వెంకటసుబ్బయ్య.

84. సొలస

ఈ గ్రామమిపుడు సత్తెనపల్లి తాలూకాకు చెంది యున్నది. పూర్వ మీ గ్రామమున్న ప్రదేశము అరణ్యప్రాంతమున నుండగా నందలి చెట్లను కొట్టించి నాదెండ్ల చౌదరులు పశువుల నీటికి చెఱువు వేయించిరట. దాని సమీపమున మనల వలసయ్యయను నొక గొల్ల గ్రామము కట్టెనట. అందువలన నాతని పేరుతో వలసయని పేరువచ్చెను. అదే జనులవాడుకలో సొలసగా మారియుండును.

ఇచట పూర్వము 1616 మొదలు 1618 వఱకు కొండవీటికి అమీనుగావచ్చిన జూపల్లి రంగపతిరావు రంగనగరమను పేర నొక పట్టణము కట్టించి రామేశ్వర స్తంభముల నచ్చటచ్చట నిలిపియుండెను. అందొకటి సొలస గ్రామమున స్థాపించెను. ఆ రంగపతి పట్టణము సొలసయే కావచ్చును. అందువలననే ఈ గ్రామమున రంగనాథున కాలయము కట్టించి స్వామిని ప్రతిష్ఠించెను. కొంతకాలమున కీదేవాలయము శిథిలమైనందున అరవపల్లి కోటయ్య, రామస్వామి అనువారు ఆలయమును గ్రామమున కట్టించి 1885 వ సంవత్సరము జూన్ 14 వ తేదీన స్వామివారి ప్రతిష్ఠ జరిపియుండిరి. వారే స్వామివారికి భూవసతులు కల్పించిరి. పూర్వము రంగపతిపేట యుండు ప్రదేశమంతయు సొలసలో నిపుడు సేద్యపు భూములుగా మారినవి. ఆ భూములలో రావికోటయ్యగారి భూమిలో దొరకగా ఈ రంగనాథుని విగ్రహము తీసికొనివచ్చి యిపుడున్న ఆలయములో ప్రతిష్ఠించి యున్నారు.

ఈ సొలస గ్రామములో నంతర్గతమై యిప్పళపాలెమొకటి యున్నది. సంతుబందీలు చేసినపుడు ఈ పాలెము కొండవీటి హవేలీలో చేరి మానూరి వెంకన్నగారి క్రిందకు వచ్చినది.

రంగనాయకస్వామి అర్చకులు వైఖానసులు పరుచూరు హనుమాచార్యులు, సత్యనారాయణాచార్యులు.

85. సింగిస్కాన్ పేట

ఈ గ్రామము కొండవీటికి దక్షిణమున రెండుమైళ్ల దూరములో నున్నది. కొండవీడు మహమ్మదీయుల స్వాధీనములో నున్నపుడు శిఖవన్ ఖాన్ అనువాడు కొండవీటికి అధికారిగా నుండెను. ఆతనిచే ఈ గ్రామము పునరుద్ధరింప బడుటచే ఆతని పేరుతో "శిఖవన్ ఖాన్" పేట అని పిలువబడెను. అది వాడుకలో శింగిస్కాన్ పేట యయ్యెను. ఇందు వెన్నముద్దకృష్ణుని ఆలయముకలదు. ఇందుగల విగ్రహము పూర్వము కొండవీటిరాజులచే గోపినాథపురమను నామాంతరము గల కోటయందుగల ఆలయము శిథిలముకాగా అందుగల విగ్రహము నచట భూస్థాపితము చేసిరి. చిలకలూరిపేట జమీందారైన రాజామానూరి వెంకటకృష్ణమ్మగారు చిలకలూరిపేటలో ప్రతిష్ఠించుటకు తీసికొనిపోవుచుశింగి స్కాన్ పేటకు వచ్చునప్పటికి ఆ దేవుడు కలలోకన్పించి నన్నిచటనే ప్రతిష్ఠించవలసినదని చెప్పగా వారా గ్రామముననే గుడికట్టించి ప్రతిష్ఠ చేసి, భూదానములు చేసియుండిరి. ఈ యాలయమునకు అర్చకులు వైఖానసులు. పరుచూరి వేంకటాచార్యులు.

86. సంకురాత్రిపాడు

ఈ గ్రామము సొలసకు మైలుదూరమున నున్నది. పూర్వము కొండవీటిని పాలించిన రెడ్లలో నొకరగు అనపోత

వేమారెడ్డి సొలసగ్రామములోని కొంతభూమిని విడదీసి ఆ భూమిని తనకుమార్తెయగు వేమాంబకు సంక్రాంతిపండుగనాడు జరుగవలసిన పసపుకుంకుమ నిమిత్తం ఇచ్చెనట. ఆ కారణమువలన అచ్చటనున్న గ్రామమునకు సంక్రాంతిపాడు అని పేరువచ్చెను. ఇచట కొంతినేని రామయ్యవారి కుమారులు, మనుమలు రామలింగేశ్వరస్వామి ఆలయము కట్టించి సౌమ్యనామ సంవత్సర ఫాల్గుణ శు ౧౩ ల రోజున స్వామివారి ప్రతిష్ఠజరిపిరి. ఇచట ఆంజనేయస్వామి ఆలయమును కలదు. ఆంజనేయస్వామి అర్చకులు వైఖానసులు పరుచూరి వేంకటాచార్యులు.

87. లింగారావుపాలెము

ఈ గ్రామము యడ్లపాటికి సమీపమున నున్నది. రెడ్డిరాజుల ప్రభుత్వకాలములో లింగారావు అనెడు కర్ణ బలిజెవచ్చి సొలసలోని కొంతభూమి తీసికొని లింగారావుపాలెమను పేరుతో గ్రామమును కట్టించెనట. మిరాశీ సంతులు వేసినపుడు నాదెండ్ల సంతులోనికీ గ్రామము చేరెను. భాగములు వేసినప్పుడు మానూరివారి వంతుకువచ్చి సత్తెనపల్లిలో చేరెను.

రామకృష్ణమ్మ దేశపతి అనువారు ఈ గ్రామమున శ్రీ సీతారామస్వామివారి ఆలయము కట్టించి కొరిటేపాటి వాస్తవ్యులును, మహాపండితులును, ఆగమశాస్త్ర నిష్ణాతులు

నైన విద్వాన్ శ్రీమత్తిరుమల పెద్దింటినరసింహాచార్యుల వారి అధ్వర్యమున ప్రతిష్ఠాకలాపము జరిపించి భూవసతులు కల్పించిరి. శ్రీ స్వామివారి అర్చకులు వైఖానసులు. పరు చూరి కేశవాచార్యులుగారు. రామలింగేశ్వరస్వామి ఆల యముకూడ కలదు. అర్చకులు ఆదిశైవులు.

88. దే చ వ ర ము

ఈ గ్రామము నరసారావుపేటకు అయిదుమైళ్ళ దూర మున నున్నది. పూర్వ మీ గ్రామమును దేచవరం దేచడు అను గొల్లవాడు కట్టించినందున ఈ పేరువచ్చినది. ఆ వంశీకులు నశించగా 1793 లో ఈ మిరాశీని కౌండిన్య గోత్రులగు కను పర్తి వెంకటనర్సుగారికి శ్రీ రాజామల్రాజు గుండారాయనిం గారు విక్రయముచేసిరి. ఈ గ్రామములో మల్లేశ్వరస్వామి, సీతారామస్వామివార్ల దేవాలయములు కలవు. సీతారామ స్వామివారి అర్చకులు వైఖానసులు నారాయణం కృష్ణమా చార్యులు. మల్లేశ్వరస్వామి అర్చకులు ఆదిశైవులు బెల్లం కొండ నరసింహయ్య.

89. జొ న్న ల గ డ్డ

ఈ గ్రామము గుంటూరు నరసారావుపేట రోడ్డుమీద నున్నది. ఇచట కాకతీయ ప్రతాపరుద్రుని కాలమున వారి సేనాధిపతియగు దేచయవెంకన్న అనువారు 1292 వ సంవత్స

రమున నీ గ్రామమునకు పడమరగా గోపీనాధస్వామివారి ఆల యము కట్టించి ప్రతిష్ఠచేయించిరి. వీరే అర్చకత్వమునకు భూములిచ్చినట్లు శాసనమున గలదు. ఈ దేవాలయమున 1292, 1319 సంవత్సరములకు సంబంధించిన శాసనములు గలవు. అవి యీ గ్రామ చరిత్రకు సంబంధించినవిగావు. ఈ గ్రామ కరిణీకము గోవిందప్ప అనువారిది. గోపాలస్వామి అర్చ కులు వైఖానసులు నారాయణం శేషాచార్యులు, అప్పలా చార్యులు, కృష్ణమాచార్యులు, రత్నాకరం వీరరాఘవా చార్యులు అనువారు. మల్లేశ్వరస్వామి అర్చకులు ఆదిశైవులు కొండకావూరుకోటయ్య, సత్యనారాయణ, వెంకటకోటయ్య, సుబ్రహ్మణ్యం, కోటయ్య, శేషయ్య అనువారు.

90. ఈ పూ రి వా రి పా లె ము

ఈ గ్రామము చిలకలూరిపేటకు మూడుమైళ్ళ దూర మున నుండును. గొట్టిపాటి గ్రామ కాపురస్తులు, కమ్మవారు ఈపూరి అంకమ్మ అనువారు తనతండ్రిగారి పేరుతో నీ గ్రామ మును కట్టించి, సీతారామస్వామి ఆలయమునుగూడ కట్టించి యుండిరి. ఆ కారణమువలన ఈపూరివారి పాలెమను పేరు వచ్చినది. శ్రీస్వామివారి అర్చకులు వైఖానసులు నారాయణం రంగాచార్యులు.

91. పరగటిచర్ల

ఇది నరసారావుపేట తాలూకాలోనిది. జైనుల కాలములో ఇప్పుడున్న గ్రామమునకు పడమటిదిక్కున ఒక గ్రామముండెడిది. అది జయినపాడని పిలువబడెడిదట. అది ఇప్పుడు కనుపింపదు. ఈ గ్రామ కరిణీకము భృగుబండ రామభద్రన్న కీయబడెను. ఈ గ్రామము కొంతకాలము రామరాజుగారి ఆదిపత్యముననుండి తర్వాత మల్రాజువారి అధీనములో చేరినది. మల్రాజు రామారాయణింగారి కాలమున ఈ గ్రామమును శ్రోత్రియముగా నిర్ణయించి భృగుబండ లక్ష్మీనారాయణగారి కీయబడినది.

జయినపాటిలో పాతపెంకు లిప్పటికి దొరకుచుండును. ఇందు భృగుబండ నరసయ్య అనువారు రామలింగస్వామి ఆలయము కట్టించి ప్రతిష్ఠ చేయించిరి. ఆంజనేయస్వామి ఆలయముకూడ కలదు. ఆంజనేయస్వామి అర్చకులు వైఖానసులు వేదాంతం వెంకట్రామాచార్యులు. రామలింగస్వామి అర్చకులు ఆదిశైవులు.

92. కారుచోల

ఈ గ్రామము నరసారావుపేట తాలూకాలోనిది. పూర్వమిచ్చట విశ్వామిత్రుడు యజ్ఞముచేసెనని చెప్పుదురు.

ఇందెచట త్రవ్వినను విభూతి కన్పించెడిదట. ఆ బూదియంతయు దిబ్బగా నేర్పడెను. ఆ దిబ్బమీద జయినులు గ్రామము కట్టించి 'ఖరపాల' యని పేరిడిరి. ముక్కంటి రాజ్యముచేయు కాలమున ఉత్తర దేశమునుండి బ్రాహ్మణులను పిలిపించి ఈ గ్రామమును విశ్వామిత్రయజ్ఞ స్థానముగ నేర్పఱచి దానముగ నిచ్చిరి. ఈ గ్రామమున చెన్న కేశవస్వామి ఆలయము కలదు. అర్చకులు శ్రీ వైఖానసులు. శ్రీనివాసుల భావనాచార్యులు.

93. గుర్వాయపాలెము

ఇది యల్లమంద శివారు గ్రామము. ఇచట 1231 వ సంవత్సరమునకు సంబంధించిన శాసనమొకటికలదు. ఆంజనేయస్వామివారి దేవాలయం గలదు.

94. సాతులూరు

నరసారావుపేటకు తూర్పున నాలుగుమైళ్ల దూరమున ఈ గ్రామముకలదు. ఈ గ్రామమున చోళరాజులచే కట్టించబడిన రామలింగేశ్వరస్వామి ఆలయము కలదు. హనుమంతుని దేవాలయమును నున్నది. ఇదిగాక సీతారామస్వామి దేవాలయము వైఖానసాగమరీత్యా ప్రతిష్ఠ చేయబడినది యొకటి గలదు. ఇవిగాక శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయమును మఱియొకటి యున్నది. సీతారామస్వామి ఆలయమునకు అర్చకులు వైష్ణవులు. హనుమంతుని ఆలయమునకు, గోపాలస్వామి వారి దేవాలయములకు మాధ్వులు అర్చకులు.

95. నాగరాజుపల్లి

నరసారావుపేటకు తూర్పున పదునాలుమైళ్ల దూరమునను్నది. ఈ గ్రామమున శివాలయమొకటియు, విష్ణ్వాలయమొకటియు, హనుమంతుని దేవాలయమొకటియుగలవు.

96. పోతవరము (పోతవరప్పాడు)

ఈ గ్రామము నరసారావుపేట తాలూకాలోనిది. గోపరాజురామన్న కరిణీకము లిచ్చినపుడు జొన్నలగడ్డ గోవిందరాజునకిచ్చెను. సమితుబందీలు చేసినవుడు ఇది నాదెండ్లసమితులో చేర్చబడెను. వంతులు వేసినపుడు మానూరి వెంకన్నారావు వంతులోనికి వచ్చెను. తర్వాత చేసికొనిన విభాగములలో వెంకటేశ్వరరావుకు చెందెను. రామాభట్లు అనువారు 1189 లో శివాలయము కట్టించి రామలింగేశ్వరస్వామి ప్రతిష్ఠ చేయించెను. దీనికి దక్షిణముగ జొన్నలగడ్డ భాస్కరుడు విష్ణ్వాలయమును కట్టించి చెన్నకేశవస్వామిని ప్రతిష్ఠించెను.

97. జంగాలపల్లి

ఇది నరసారావుపేట తాలూకాలోనిది. ఈ గ్రామ కరిణీకమును గోపరాజురామన్నగారు జంగాలపల్లి కృష్ణంరాజుగారికిచ్చిరి. సముతుబందీ చేసినపుడు నాదెండ్ల సమితులో చేరినది. కర్ణాటుల రాజ్యములో గ్రామ మధ్యమున వీరాంజనేయ విగ్రహాము ప్రతిష్ఠింపబడినది. ఒంట్లు వేయునపుడీ గ్రామము మానూరు వెంకన్నారావుకు చెందినది.

జూపిటర్ ప్రింటింగ్ ప్రెస్, గుంటూరు.